
ఆంధ్రపత్రిక



ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY
సచిత్ర వార పత్రిక



కొమ్మల కొబ్బరి చెట్టు

ఫొటో: గుండాల నారాయణమూర్తి, విజయనగరం]


పద్మిని ఇలా చెప్పుచున్నది,
"నేను ఎల్లప్పుడూ లక్స్ టాయ్‌లెట్ సబ్బును వాడు చున్నాను —
అది ఎంతో సంపూర్ణమైన తెల్లనిది, శుద్ధమైనది!"
పద్మిని, అధికంగా పనిచేయుచున్న తార. లక్స్ టాయ్‌లెట్ సబ్బును రోజూ వాడుచూ తన సౌందర్యమును కాపాడుకొనుటను ఆమె మరువదు — "దాని తెలుపు, శుద్ధత నా చర్మమును మృదువుగాను, నునుపుగాను వుంచుచున్నవి." అని ఆమె చెప్పుచున్నది.
పరిమళమైన, సౌమ్యమగు, లక్స్ టాయ్‌లెట్ సబ్బును మీరే వాడి చూడండి — త్వరలో, మీరు కూడ దాని తెలుపు శుద్ధతలయందు ఆధారపడుదురు.
లక్స్
టాయ్‌లెట్
సబ్బు
LUX
TOILET SOAP
సినీమా తారలకు
సౌందర్యమునిచ్చు సబ్బు

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక


సంపుటము 52
సంచిక 24
5-2-58

Founder : K. NAGESWARA RAO

హేవిళంబి మాఘం బహుళపాడ్యమి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
"పద్మశ్రీ" బిరుదు పొందిన తార
నర్గీస్



దినోత్సవం రోజున మద్రాసు నగరంలో సైనికదళాలు, విద్యార్థి సైనికదళాలు, పోలీసు దళాలు విన్యాసాలు ప్రదర్శించి, కొత్తగవర్నరు శ్రీ విష్ణురామ్ మేధికి వందన మర్పించాయి.

"మేము ఆంధ్రులం!"

"వాక్ప్రశా" [పి లానీ, రాజస్థాన్]

ఆంధ్ర వారపత్రికలో ఈమధ్య కొందరాంధ్రులు "నేను ఆంధ్రుణ్ణి," "నేనూ ఆంధ్రుణ్ణే" అంటూ పరిమితంగా ఎవరికి వారు వ్రాసుకొన్నారు. కాని, వారేకాదు, మేమూ ఆంధ్రులమే అని తెలియపరుస్తున్నందుకు ఆంధ్రప్రజలు సంతోషిస్తారనుకుంటా.

మేము వుంటున్నది మీవూరు కాదు. కనీసం మీరాష్ట్రమైనా కాదు. అంటే పరరాష్ట్రాంధ్రులం అన్నమాట. అసలు మావూళ్ళో వుంటున్న ఆంధ్రులమే తక్కువ. అయినా కొంతమంది పెద్దలు (ఎవరికివారే పెద్దలం), పిన్నలు (అసలు ఈరకం, మాలో ఎవరూ లేరు!) కలిసి ఆంధ్రసంఘం అంటూ ఒకటి స్థాపిద్దామనుకోవడం జరిగింది. నిజానికి ఇది ఒక అపూర్వ సంఘటనే అనుకోవాలి. ఎందుకంటే, ఎప్పుడోకాని, మేము కలుసుకోము; కలుసుకొన్నా ఏకీభావంతో ఏవిషయం మాట్లాడుకోము. ఎందుకంటే మేము ఆంధ్రులం. అందుకనే 'అపూర్వ సంఘటన' అన్నాను. ఈ విషయం (ఆంధ్ర సంఘం స్థాపిస్తామని) నా స్నేహితుడొకనితో చెబితే ఆంధ్రులు ఆరంభశూరులు పూర్తిగా అయ్యేదాకా నమ్మకమేదని అన్నాడు. నిజమేనని ఒప్పుకొన్నాను. ఎందుకంటే, ఇదివరలో ఇక్కడికి నేను రాకపూర్వం, యిట్లాంటి ప్రయత్నమే ఒకటి జరిగి ఎవరికివారు, భిన్నాభిప్రాయాలతో ఆప్రయత్నం విరమించుకొన్నారని విన్నాను కాబట్టి. ఈ దృష్ట్యా సంఘ సంస్థాపన జరిగేదాకా మాలో ఎవరికి వారికే నమ్మకం లేకపోయింది. మేము ఒకానొక రోజున ఒకచోట సమావేశమయి సంఘస్థాపన ఎప్పుడు ఎక్కడ ప్రారంభోత్సవం చేయవలెననే విషయంపై కూలంకషంగా చర్చజరిపి ఒక సమాధానానికి వచ్చేటప్పటికి మూడుగంటలు పట్టింది. ఆ తర్వాత సంఘ ప్రారంభోత్సవం ఎవరిచేత జరిపించాలన్నది మరో పెద్దసమస్యగా పరిణమించి, ఈలోపుగానే రెండుమూడు మార్లు అసలు, సంఘం స్థాపిద్దామని ఉత్సహించిన పెద్దమనిషి మీద అవిశ్వాస తీర్మానాలు ప్రకటించి మొత్తానికి ఎట్లాగైతేనేం ఒక నిశ్చయానికి వచ్చేటప్పటికి ఒక రాత్రి చాల ప్రొద్దుపోయింది.

అసలు కార్యక్రమం జరిగేరోజు రానే వచ్చింది. ఎవరికి వారు "అర్జంటుపనులు" అని చెప్పి, తప్పుకొని పోయాము (మేము ఆంధ్రులం కాబట్టి!) ఆనాటి సభకు హాజరయినవారు పట్టుమని పదిమంది కూడా లేరుట. ఇది తర్వాత తెలిసింది. సాయంత్రం జరిగిన అల్పాహార విందుకుమాత్రం అంతమంది ఆంధ్రులం హాజరు. ఈ విషయంలో, ఆంధ్రులమయిన మేము కనబర్చిన ఐకమత్యానికి ఆనాటి ఛీఫ్ గెస్టుగారు విస్మయం, ఆశ్చర్యం పొందారు.

ఇక మా సంఘ కార్యక్రమాలలో అల్పాహార విందులది అగ్రస్థానం. ఎందుకంటే అది లేనిదే, ఎవ్వరమూ సమావేశానికి హాజరుకాము. సమావేశంలో కార్యదర్శిగారు పసందయిన విందులు ఏర్పాటు చేయటంలేదని విమర్శించి, అతడిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించటం మాపని. (ఆంధ్రులమయిన మాకు అవిశ్వాస తీర్మానాలలో విశ్వాసమెంకు!) ఆవిమర్శకు సమాధానంగా కార్యదర్శిగారు విత్తం కొద్ది వైభవమనీ, సంఘసభ్యులలో చాలమంది చందాలు కట్టడం లేదనీ (ఇది నిజమే అయినా, అంత పబ్లిక్కుగా మమ్మల్ని అనడం, మాకు అగౌరవం. మేము ఆంధ్రులం; మాకు ఆత్మాభిమానం ఎక్కువ!) తత్కారణంగా పసందయిన విందులు ఏర్పాటుచేయటం తనకు చేతకాదనీ కావలిస్తే. తను తనజీతం, భత్యం (గౌరవం కూడా!) లేని పదవికి రాజీనామా యిస్తాననీ, (ఇటువంటి పదవులకు కూడా ఆంధ్రదేశంలో డిమాండు హెచ్చు అని మా కార్యదర్శిగారికి తెలియదు లెండి!) అనడం అసాధారణ విషయమేమీ కాదు. అతను, రాజీనామా ఇస్తానని అంటున్నపుడు అట్లా చెయ్యమని కేకలెయ్యడం మావంతు, తీరా రాజీనామా చేస్తే, మరొకరెవరయినా ఆపదవిని స్వీకరించండని మా అధ్యక్షుడుగారంటే 'నువ్వంటే నువ్వు' అని అనుకొనేవాళ్ళమే గాని, ముందుకు ఎవ్వరం వెళ్లేవాళ్ళంకాదు. ఎందుకంటే మాకు తెలుసు, అది వుటి వెట్టిచాకిరీ పదవి అని. జీతం ఇచ్చే ఉద్యోగానికైతే ఏ మంత్రిగారి రికమెండేషనో తెచ్చుకొని తంటాలు పడతాంగాని నిస్వార్థ ప్రజాసేవ చెయ్యాలని మాకెందుకుంటుంది చెప్పండి? మేమూ ఆంధ్రులమేగా!

మా సంఘంలో మేమెప్పుడూ తెలుగులో మాట్లాడం. ఇంగ్లీషును ఆదరిస్తాం. హిందీని ఉద్ధరిస్తాం! ఇది మా విశాల దృక్పథాన్ని సూచించడం అన్నమాట.

ఒకనాటి సమావేశంలో కొందరు "తెలుగూస్" యిటువైపు తెలుగు సినిమాలు రావడంలేదనీ అందుకుగాను, మన సంఘం ద్వారా కొన్ని తెలుగు సినిమాలు తెప్పించాలని తెచ్చిన తీర్మానాన్ని ఖండించి, ముక్కముక్కలుగా చేసి, అది అంతర్జాతీయ దృక్పథానికి విరుద్ధం కాబట్టి వారి సంకుచితత్వానికి ఉద్వాసన చెప్పి, ఆ తీర్మానాన్ని ఉపసంహరించుకొనేటట్లు చేసిన "ఆంధ్రులం" మేము!

ఆంధ్రరాష్ట్ర జన్మదినోత్సవ సభలో మాట్లాడుతూ, ఒక సభ్యుడు ఆంధ్రులు ఆవేశ పూరితులై, తప్పటడుగులు వేస్తుంటారనీ, వారిలో ఐకమత్యం లేదనీ, అకారణంగానే ఆంధ్రలో ఇదివరకు ప్రభుత్వాలు మారినవనీ అనర్గళంగా, తానాంధ్రుడు కానట్లు ఇంగ్లీషులో ప్రసంగించాడు. (ఆంధ్రుల ప్రత్యేకత ఇదేనేమో!)

మా సంఘ సభ్యులలో ఒకనికి ఈవూరిలో జరిగిన ఆటల పోటీలలో ఛాంపియన్‌షిప్ వచ్చింది. ఈవూరిలోవున్న మిగత సంఘాల వారు అతని గౌరవార్థం సన్మానసభలు చేసి, అతని ప్రజ్ఞావిశేషాలను వేనోళ్ళ కొనియాడారు. కాని మా ఆంధ్రసంఘం అతనికి అటువంటి సన్మానం ఏమీ జరుపలేదు. ఇందుకు కారణం అతడు ఆంధ్రుడవడమే. పైగా ఆంధ్రులమైన మాకు అతడి గొప్పతనాన్ని గౌరవించి సత్కరించే సహృదయత ఎక్కడుంటుంది? అందుకేనేమో ఎవరో అన్నట్లు గుర్తు ఆంధ్రదేశంలో వున్నా, ఆంధ్రుడనిపించుకున్నా పైకిరాలేడని.

మాకు మణిపురి,కథక్ నృత్యాలంటే మహామోజు! కూచిపూడిఅంటే మాకు తెలియదు. వాటి గొప్పతనం తెలుసుకోవాలని కూడా వుండదు మాకు. ఆగ్రా, జయపూర్ లలో తయారుచేసిన బొమ్మలనే మా యిండ్లలో పెట్టుకుంటాముకాని కొండపల్లి బొమ్మలకు మాయిళ్ళలో స్థానంలేదు. దానికి కారణం కూచిపూడి, కొండపల్లి గొప్పతనం మాకు తెలీకగాదు. అది ఆంధ్రదేశంలో వున్నాయి! తర్వాత మేము ఆంధ్రులం!

ఇటువైపు అంటే ఉత్తరాదిన దక్షిణాది

(49 వ పేజీ చూడండి)

మహాభారత ప్రచురణ

మరి కొంతమంది వారపత్రిక పాఠకుల అభిప్రాయాలు

సచిత్రవారపత్రిక సంపాదకులకు :

ఆర్యా !

ఆంధ్రసచిత్రవారపత్రికలో భారతము వరుసగా ప్రకటించి పాఠకులకు అందజేయనున్నామను తమ ప్రకటన సంతోషము కల్గించినది. పద్యములు, వాటి అర్థము లేక తాత్పర్యముతో ప్రకటిస్తారనుకున్నాను. చూడగా 1 పేజీ రెండు ప్రక్కలా పద్యములు ఇచ్చి వున్నారు. దీనివలన తమరు తలంచిన ఆశయము నెరవేరదని మనవిచేస్తున్నాను. వారపత్రికలు చదువువారి భాషా జ్ఞానమును తమరు అంచనా వేసినట్లు కనపడదు. కారణ మేమనగా ఇప్పటి పాఠకుల భాషా జ్ఞానము వచనరూపములో వున్న "పత్రిక"ల భాషనుకూడ అర్థముచేసుకోలేని స్థితిలోనున్నది. అటివారికి పద్యరూపములోనున్న భారతమును వున్నపాళముగా ఇచ్చిన వారికే మర్థమవుతుంది? ఇంగ్లీషుభాష ప్రచారములోనికి వచ్చినదిమొదలు మాతృభాష ప్రజలకు దూరమైపోయినది. మా మూలు సుమతి శతకము, దాశరథీ శతకము కూడ చదువుకొని అర్థముచేసుకోలేనిస్థితిలో వున్నారు. అట్టివారికి భారతములోని పద్యములు ఇచ్చుచున్నారు. తమ ఉద్దేశ్యము ప్రజలకు ఇటి సాహిత్యము నందజేసి వారికి భాషాజ్ఞానం కలిగించడమూ, మంచిచెడ్డలభేదాన్ని తెలియపరచడమూ అయివున్నది. మంచి భాష, మంచి భావము చాలా అవసరమన్నది నిస్సందేహము. అందుచేత తమరు పద్యములతో పాటు వాటి అర్థ తాత్పర్యము, కొంత విమర్శ కూడా పాఠకులకు ఇచ్చినట్లయిన తమ పవిత్రోద్దేశ్యము నెరవేరుతుందని మనవి చేస్తున్నాను. ఇది నా ఒక్కని అభిప్రాయము కాదు. చాలామంది ఇది కోరుతున్నారు. ఆ విధముగ చేసిన చాలా గ్రంథమగునని భయపడెదరేమో! ఏ కొంచెము ఇచ్చినప్పటికీ ప్రయోజనము కలుననీ, చదివిన కొంచెమయిననూ చదువరులకు వంటపడుతుందని నా అభిప్రాయము. ఆలోచించి ఉచితరీతిని వ్యవహరించగలరని ఆశించుతున్నాను.


ముక్తినూతల హనుమంతరావు,
నర్సారావుపేట.

* * *

ఆర్యా !

మన వారపత్రికలో "ఆంధ్ర మహాభారతము" ప్రచురించబోతున్నారని విని ఎంతో సంతోషించాము. ఇంత కాలానికయిననూ మహాభారత కథను సమగ్రముగా తెలుసుకోనబోతున్నాము కదా అని ఉవ్విళ్లూరాము. నాలుగు అణాలు పెట్టి సంచిక కొని మహాభారతకథను వారం వారం తెలుసుకొనవచ్చును కదా అని ఆశపడ్డాము.

కాని మా ఆశ అడియాశ అయినది. కారణం పద్య ప్రచురణ. అర్థము కాని చదువు వ్యర్థమన్నారు పెద్దలు. ఎంతసేపని అర్థం కాని పద్యాలు చదివి ఆనందించగలము? సచిత్ర వారపత్రిక పాఠకులలో నూటికి ఎంతమంది భారత కథారసాన్ని పద్య రూపంలో పఠించి ఆనందించగలరని మీ ఊహ?



అఖిలభారత కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీ అల్లూరి.

కొద్దో గొప్పో చదువుకున్న నా సహచరులతో మీరు ప్రచురించబోతున్న మహాభారత విషయము చెప్పి ఇప్పటికయినా భారత కథను చదవమని ప్రోత్సహించాను. కాని తీరా పత్రికను తెరచి ఆశతో భారతము చదువబోగా, కొద్దిగా చదువుకున్న నాకే కొన్నిచోట్ల అర్థముగాక కష్టపడినాను. ఎంతసేపని ఊహించి అర్థము తెలుసుకొనుటకు ప్రయత్నించగలను? కొద్ది జ్ఞానము కలిగిన గ్రామస్థులకు అది యేవిధంగా అర్థమవుతుంది?

పద్యాలు అర్థము గావందువల్లనూ, ఆశ నిరాశ అయినందువల్లనూ, యేదో హక్కు వున్నట్లుగా ఈ లేఖ వ్రాస్తున్నందుకు క్షమింప ప్రార్థన.

కేవలము పండితులకు, చదివి అర్థము చేసుకొనగల శక్తి గలవారి ఉపయోగార్థం మీరు ప్రచురించుచున్నటయిన ప్రశ్నించునదేమీ లేదు.

అట్లుగాక సాధ్యమైనంత ఎక్కువమందికి భారతకథను తెలుపుటయే మీ ఆశయమైతే ఇది పద్ధతి కాదు.

పద్యప్రచురణకన్నా అర్థ ప్రచురణకు మీరు ఎక్కువ వ్యయప్రయాసల నెదుర్కొనవలసినప్పటికీ, అట్టి తాత్పర్యమును ప్రచురించి లక్షలకొలది అల్ప జ్ఞానులకు మేలు చేకూర్పవలసినదిగా ప్రార్థించుచున్నాను.

—వి. వి. రమణయ్య,
దండిగుంట.

* * *

ఆర్యా,

తమ ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికను గత మూడు సంవత్సరములుగా చదువుతూ వస్తున్నాను. ఒక విషయము కూడ వదలక సంపూర్ణముగా చదివి చాలా ఆనందించేవాడిని. తమపత్రిక సర్వాంగ సంపూర్ణముగానూ, సర్వగుణ సంపన్నముగానూ ఉండడంవల్ల ఎక్కువ ప్రేమతోను, అభిరుచితోను ఇక్కడ చదువుకుంటున్నాము.

తాము శ్రీమదాంధ్రమహాభారతమును ప్రకటించుచున్నామనునది విని అత్యంత ఆహ్లాదము పొందితిమి. మీరు పద్యముల మూలము మాత్రమే ఇచ్చుటవల్ల సంపూర్ణముగా అర్థము చేసుకోవడం శ్రమసాధ్యముగా వున్నది. కాబట్టి టిప్పణముతో ప్రకటించవలసినదిగా కోరుతున్నాము.

మూలశ్లోకములను, పద్యములను పత్రికలో ప్రకటించడంవల్ల ఏమి లాభము? పుస్తకమే కొని చూచుకోలేమా? టీకతో ఇస్తే అందరికి బహుళ ఉపయోగకరముగా వుంటుందని విన్నవించుచున్నాను.

తాము ఈ విషయము ఆలోచించి ఆ విధంగా ప్రకటించుటకు మొదలు పెట్టగలరని నమ్ముతున్నాను.

మేము ఈ తమిళ రాజ్యములో నివసించుట ప్రారంభించి ఎన్నియో తరములై పోయినవి. అయినప్పటికినీ మాతృభాషాభిమానమును వదలక కాపాడుకొంటూ వచ్చుచున్నాము.

—ఎస్. గురుస్వామి, మధుర.

* వచ్చే వారం ఈ లేఖల ముగింపు]



న్యూఢిల్లీ లేఖ

న్యూగినీ—ఇండొనీషియా

రాజధానిలో ప్రధాని లేనప్పుడల్లా మామూలుగా పను లన్నీ స్తంభించిపోతాయి. ఈమధ్య కొద్ది రోజులపాటు మంత్రులందరూ గౌహాతికి ప్రయాణం కట్టడంతో పరిస్థితి ఎలా తయారైందీ వేరే చెప్పనక్కరేదు.

అయినా హడావుడి కేం తక్కువలేదు. రిపబ్లిక్ దినోత్సవాలలో విన్యాస ప్రదర్శనలకు రిహార్సల్సు ముమ్మరంగా జరిగాయి. చూడటానికి వచ్చిన ప్రేక్షకులకు అంతు లేదు.

ముస్లిముల పరిభాషలో చెప్పాలంటే జనవరి 26 మతాతీతమైన ఈద్ పండుగలాంటిది. కేంద్రసచివాలయంలో పనిచేసేగుమాస్తాలకు, చప్రాసీలకు ఈపండుగ రిహార్సిళ్ళ వరప్రసాదం లాగ వస్తాయి. రిహార్సిల్ జరిగే రోజుల్లో కేంద్ర సచివాలయానికి వచ్చే పోయే రోడ్లమీద రాకపోకలకి అంతరాయం కలుగుతుంది. ఇతరులు పనిచేసుంటే చూస్తూ అలిసిపోయే బాబూ బహదూర్లు, చప్రాసీలు రోడ్ల పక్కన బారులు తీర్చి నిలబడతారు. రిహార్సిల్ అయిపోయే సరికి మధ్యాహ్నభోజన కాలం కూడా ఆసన్నమవుతుంది. కనక ఆ పూటకి సచివాలయం పనులన్నీ బంద్.

ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ నేల ఈనినట్లు తయారయే ఈ మాదిరి ప్రేక్షకులు ఊరినిండా ఉండటంచేతనే ఢిల్లీనుంచి కార్యాలయాలను ఇతర ప్రదేశాలకి మార్చటానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ఢిల్లీకి ఏ విదేశీ అతిథి వచ్చినా పిలవకుండా, పెట్టకుండా హాజరై దారి కటూ ఇటూ నిలబడి స్వాగత నినాదాలు చేసేజనం కొల్లలు. చిటికెవేస్తే చాలు—అటు కార్యక్రమనిర్వాహకులకు ప్రేక్షకజనం లభిస్తారు; ఇటు ప్రేక్షకజనానికి జీతనష్టం లేకుండా సెలవూ లభిస్తుంది. ఉభయతారకమైన పద్ధతి

*　　*　　*

ఈ శీర్షికలో ఈ మధ్య ఒకసారి న్యూగినీ ప్రజల ప్రసక్తి వచ్చింది. అధికార పత్రాల నుంచి సేకరించిన కొన్ని వివరాలు ఈ దిగువ ఇస్తున్నాను:—

"న్యూగినీ ద్వీపంలో ఆ మూలనుంచి ఈ మూలకి 1500 మైళ్ళ పొడుగున బ్రహ్మాండమైన పర్వతపంక్తి ఉన్నది. ప్రపంచంలోని గొప్ప పర్వతపంక్తులలో ఇదొకటి. కొన్ని కొన్ని చోట్ల ఈ పర్వతాల ఎత్తు 15 వేల అడుగుల వరకూ ఉంటుంది. మెసొజోయిక్, టెర్షియరీ జాతికి చెందిన ఈ పర్వతాలు అంతగా స్థిరమైన ప్రదేశంలో లేవు. ఇంతకంటే స్థిరమైన ఆస్ట్రేలియన్ భూభాగాన్ని ఈ పర్వతాలు పసిఫిక్ మహాసముద్రంనుంచి వేరుచేస్తున్నాయి. ఇవి పడమటగా వ్యాపించి

శ్రీకృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]


తూర్పు ఇండియా ద్వీపసమూహంలో కలుస్తున్నాయి. ఆగ్నేయంగా ఇవి పసిఫిక్ మహాసముద్రం అంచునే వ్యాపించి అక్కడక్కడ చెదురుగా కొన్ని ద్వీపాల్లో కనిపిస్తున్నాయి.

న్యూగినీ గడ్డకు ప్రత్యేకంగా చెందిన జనాభా 12, 73, 837—అనీ, బయటి నించి వచ్చిన జనాభా 13, 455 అనీ అంచనా.

జాతిరీత్యా చూస్తే ఈ ద్వీపవాసుల్లో చాలామంది మెలనీషియన్ జాతికి చెందినవారు. నల్లగా, ఉన్నిలాంటి వెంట్రుకలు కలిగిన ఈజాతివారు పశ్చిమ పసిఫిక్ ప్రాంతమంతటా కనబడతారు. ఎత్తును బటి, జుట్టునుబట్టి, ముక్కు ఏర్పాటును బటి, తదితర అవయవ లక్షణాలనిబటి స్థూలంగా ఇలా జాతి నిర్ణయం చేశారుగాని, మళ్ళీ ఈజాతిలోనే మెలనీషియన్ జాతి అనీ, పాపువన్ జాతి అనీ రెండు విభాగాలు చేశారు. అయితే ఈజాతుల్లో స్పష్టంగా నిర్దేశించ దగినంత తేడా లేకపోవటంచేతా, తెగలమధ్య, తెగలోనే కొందరి కొందరికీ కొన్ని తేడా లుండటంచేత, శారీరక నిర్మాణాన్నిబట్టి జాతిభేదాన్ని నిర్ణయించే పద్ధతికి ఆట్టే ఉపయోగం లేకుండా పోయింది. పాపువన్ జాతి అంటే అనాదిగా ఆద్వీపంలోనే ఉంటూ, మొదటినుంచీ ఒకటేభాష మాట్లాడుతున్న జాతి అనీ, మిగతా వారిలాగ బయటినుంచి వలసవచ్చి తమ అసలుభాషను ఇతర భాషలతో కలగలుపు చేసుకున్న జాతి కాదనీ అర్థం చేసుకోవాలి. న్యూగినీలో సెపిక్, హైలాండ్స్ జిల్లాల వంటి పశ్చిమ ప్రాంతాల్లో ఉండేవాళ్ళు పాపువన్‌లుగాను, కోస్తాప్రాంతాల్లోను, న్యూఐర్లండు న్యూబ్రిటన్, మనుస్, బొగన్ విల్లావంటి లంకజిల్లాలలోను ఉండేవాళ్లు మెలనీషియన్లుగా స్థూలంగా మనం నిర్ణయించవచ్చు.

పాపువో మెలనీషియను ఒకే జాతినుండి ఉద్భవించిన వారుకాదు. వీరిలో వీరికి రంగులోను, జుట్టు మొదలైన ఇతర శారీరక లక్షణాల్లోనూ భేదాలున్నాయి. మొత్తంమీద వీరు మాట్లాడే భాషనిబట్టి వీరిని గుర్తుపట్టవచ్చు. వీరిభాష పాపువన్, ఆస్ట్రోనీషియన్ భాషలు కలియగా ఏర్పడింది. ఎప్పుడో ప్రాచీనకాలంలో జరిగిన వలసల్లో ఈ ఆస్ట్రోనీషియన్ భాష న్యూగినీ భూభాగంలో ప్రవేశించింది. మొత్తం న్యూగినీలోని స్వదేశీయుల్లో మూడింట రెండు వంతులు పాపువో మెలనీషియన్లు ఉంటారని అంచనా వేశారు.

మడాంగ్ జిల్లాలోని అయోమీప్రాంతం వంటి చోట కొద్దిగా నీగ్రో లక్షణాలుగల తెగలుకూడా కనిపిస్తాయి. మెలనీషియను సగటున 5 అ. $1\frac{1}{2}$ అం. నుంచి 5 అ. 3 అం. దాకా ఎత్తు ఉండగా, ఈ నీగ్రిటో తెగల ప్రజలు సగటున 4 అ. $4\frac{1}{2}$ అం. నుంచి 4 అ. 9 అం. దాకా మాత్రమే ఎత్తుంటారు. ఎత్తులో



అనేక జాతులూ, అనేక భాషలూ గల న్యూగినీ ద్వీపంలో కొంతభాగం డచ్చి వలసపరిపాలనలో ఉన్నది; కొంతభాగం ఆస్ట్రేలియన్ ధర్మకర్తృత్వ పరిపాలనలో ఉన్నది. ఆస్ట్రేలియన్ భాగంలో జరిగిన ఒక సభలో పాల్గొంటున్న లులువాయి ప్రజలను, శాసనసభ్యులను పై చిత్రంలో చూడవచ్చు.

తప్పిస్తే వీరికీ ఇతర జాతుల వారికీ ఆట్టే తేడా లుండవు. అయితే మామూలుగా ద్వీపంలోని అన్ని జాతుల్లోనూ కనబడే చిన్న చిన్న తేడాలే వీళ్ళలోనూ కనిపిస్తాయి. ఈ నీగ్రిటో జాతిజనంకూడా బలంగా, కండలు తిరిగి, మసి రంగు శరీరం, దాదాపు నల్లనిజుట్టు కలిగినవారు కావటంచేత ఇతర జాతులవలెనే వీరూ స్థానికంగా ఉద్భవించిన వారేగాని ఎక్కణ్ణించో వచ్చినవారు కాదని కొందరు అభిప్రాయపడ్డారు.

వాయవ్యంగా ఉన్న మనుస్ ద్వీప సమూహంలో కొద్ది కొద్దిగా జనం కనిపిస్తారు. వీరికీ కెరొలిన్ ద్వీపాల్లోని జనానికీ, మైక్రొనీషియా అనబడే ప్రాంతంలోని జనానికీ శారీరకంగా పోలికలు కనిపిస్తాయి. వీళ్ళని మైక్రొనిషియన్ జాతివారుగా నిర్ణయించారు. వీరు అసలు కేషియన్ ప్రాంతపు వారనీ, న్యూగినీలోని మనుషులు మెలనీషియన్ల, మలయన్ల కలయికవల్ల ఉద్భవించిన వారనీ కొందరంటారు. పాలినీషియన తెగలు సంఖ్యలో తక్కువగానే ఉన్నాయి. ఈ తెగల జనం తావూ, నుకుమానూ మొదలైన ద్వీపాలలో మాత్రమే కనిపిస్తారు. పాలినీషియన్ జాతికి సామాన్యమైన లక్షణాలే వీరిలోనూ కనిపిస్తాయి.

భాష తీసుకుంటే అంతా గందరగోళమే. ఎన్ని భాషలో చెప్పలేము. ఒక్కొక్కసారి ఈ గ్రామములోని జనం మాట్లాడే భాషకీ, కొద్దిమైళ్ళదూరంలో ఉన్న గ్రామ జనం మాట్లాడే భాషకీ సంబంధం వుండదు. దుబాసీ ఉంటేగాని ఒకరిభాష ఒకరికి అర్థం కాదు. ఒక్కొక్కసారి ఉభయులకీ చెందని సామాన్యభాష ఏదన్నా మాట్లాడతారు. కోస్తా ప్రాంతాలలో ఒకభాష మాట్లాడే వారు అయిదు వేలకు మించరు. ఇంకా తక్కువే ఉంటారు. న్యూగినీ అంతర్భాగాలలో మటుకు ఆయాభాషల జనం ఎక్కువౌతూ కనిపిస్తారు. ఉదాహరణకి మౌంట్ హాగన్ ఉపజిల్లాలోని దాదాపు 25 వేల మంది జనం మెడ్లపా భాష మాట్లాడతారు. చింబూ ఉపజిల్లాలో జరిపిన సర్వే మూలముగా కుమాన్ భాషను మాట్లాడేవారుగానీ, అర్థం చేసుకునే వారుగాని 40,000 మంది దాకా ఉన్నారని తేలింది. మొత్తం మీద మూడు ప్రధానభాషాజాతు లున్నట్లు నిర్ణయించారు. ఒకటి పాపువో మెలనీషియన్, రెండు పాపువన్, మూడు మెలనీషియన్.

ఇక ఈ న్యూగినీ ప్రజలలో జాతీయత ఏమాత్రం వుంది అంటే—సాధారణంగా ఒక గ్రామాన్ని దాటి, లేక కొన్ని పల్లె పట్టుల్ని దాటి జాతీయతా భావము విస్తరించదు.

ఒకేభాష మాట్లాడే వివిధ తెగలవారిలో కూడా ఇతర భాషలవారికీ తమకూ తేడా ఉంది అనేభావం ఉన్నప్పటికీ, తమలో తమకు ఐకమత్యం ఉండాలి, ఒకేలక్ష్యాలు, ప్రయోజనాలు ఉండాలి అనే భావం మటుకు లేదు.

న్యూగినీ ప్రజల సంస్కృతికి మంత్ర తంత్రాదులతో కూడిన మత విశ్వాసాలు, ఆచారాలు ప్రధాన చిహ్నాలు. అధిభౌతిక శక్తులున్నాయనీ, అవీ మనుషుల్లాంటి వేననీ, వాటికి బలులు పరిహారాలు ఇస్తే అవి రక్షిస్తాయనీ వారు నమ్ముతారు. ప్రపంచంలోని ఇతర పెద్దమతాల్లో మాదిరిగా వీరి మత విశ్వాసాలు, మంత్రాలు ఒక నిర్ణీతపద్ధతిలో ఉండవు. 'మనిషి రెండు వేర్వేరు లోకాల్లో నివసిస్తాడు' అనే నమ్మకంమీద ఆధారపడి వీరు మంత్ర తంత్ర తతంగమంతా సాగిస్తారు. ఈ రెండులోకాల్లో ఒకటి పుణ్యలోకం, ఇంకొకటి పాపలోకం. పుణ్యలోకంలో మళ్లీ అంతర్విభాగా లున్నాయి. వీటిల్లో కొన్ని పుణ్యాత్ములవీ, కొన్ని దుష్టాత్ములవీ."

ఇదంతా ఉదహరించటంలో నా ఉద్దేశం న్యూగినీపై డచ్చి అధికారాన్ని సమర్థించాలనికాదు. ఇండొనేషియా ప్రజలకీ, న్యూగినీ ప్రజలకీ జాతిరీత్యా, సంస్కృతిరీత్యా, భాష, మతంరీత్యా ఏవీ అనుబంధం లేదని చూపించడానికే. అందుచేత న్యూగినీని ఇండొనీషియన్లు ఆక్రమించుకోవటం సామ్రాజ్యవాదమే అవుతుంది. ★

పాకజీవులు

సరోజ పుట్టింటికి వెళ్ళింది.

* * *

ఆరోజు పొద్దున్న శేషగిరి యింట్లో చిన్న శభ్యత్రయ సమావేశం. నాతిగల బ్రహ్మచారి శేషగిరి మొదటివాడు. తదితరు లిద్దరూ "శతమర్కటం"—గాళ్లు.

— "ఎన్నడూ హోటల్ భోజనం, మాత్రం చేయకు." అన్నాడు శేషగిరి మిత్రుడు జూనియర్ శుకుడు.

"ఆమాట ముమ్మాటికీ కోటి వరాలమాట. పూర్వ జన్మలో, అది ఇవనక, రాత్రిం బగళ్ళు కృషిచేసి, పంచ మహాపాతకాలనూ అదేపనిగా చేస్తే ఈ జన్మలో శిక్ష ఏవిటో తెలుసా?... హోటల్ భోజనం...." సీనియర్ శుకుడు ఉవాచ.

"అబ్బా!" అన్నాడు శేషగిరి గడ్డం గోక్కుంటూ. "ఆ... అంతే... రెండు నెలల క్రింద నేను కేంపుమీద ఓ వూరెళ్లాను. ఓ హోటల్లో భోంచేశాను. వంకాయపులుసు వడ్డించాడు. వడ్డిస్తే... వాటిమధ్య ఏముందనుకున్నారూ?"—అని సీరియస్‌గా మిగతా ఇద్దరి మొహాల్లోకి మార్చి మార్చి చూస్తున్నాడు జూనియర్ శుకుడు.

"ఏముందీ...?" అన్నాడు శేషగిరి.

"వేటి మధ్య?" అన్నాడు సీనియర్

"ఆ వంకాయల మధ్య—" ఇంకా ప్రశ్న మార్కు మొహంతో వున్నాడు జూనియర్ శుకుడు.

హఠాత్తుగా గజం ఎత్తు పైకెగిరి, జూనియర్ వీపుమీద ఓ చరుపు చరచి "గింజలు!" అన్నాడు శేషగిరి. "ఏడిచినట్టుంది. వంకాయల మధ్య వాటి గింజ లుండక బఠాణీలు వస్తాయా?" అని ఆక్షేపించాడు సీనియర్.

శేషగిరి చరిచిన చరుపుకు చొక్కా ఎన్ని చదరపు అంగుళాలు చిరిగిందో నని చూచుకుని జూనియర్ ఇలా అన్నాడు: "అది కాదర్రా! వంకాయల మధ్య—వంకాయ గింజలుకాక బఠాణీలుకాదు, భాతుగుడొచ్చినా ఆశ్చర్యపడను కానీ—"

"కానీ—"అని ప్రతిధ్వనించాడు సీనియర్ శుకుడు.

"...ఓ చిట్టెలుక వచ్చింది!"

"రామ రామ" అన్నాడు శేషగిరి వణికిపోతూ. "ఎంత అద్భుతమయిన సస్పెన్సూ! పులుసులో—వంకాయల మధ్య—చిట్టెలుక వసుందని ఎవడయినా అనుకోగలడా!!"

"ఒరేయ్ శేషూ! అబ్బాయ్ జూనూ! ఇంత సస్పెన్సు భరితమయిన సంఘటన—ఇలా అడుగున పడిపోనివ్వడం తెనుగు సాహిత్యానికే తీరని అపచారం! ఏతత్కారణంబున 'పప్పుపులుసులోచిట్టెలుక' —అనే అపరాధ పరిశోధక గాథ నొకండు రచియించెద..." అన్నాడు సీనియర్.

"అలాకాదు. 'పప్పులుసులో చిట్టెలుకా...?' అని చివరిని నాలుగు చుక్కలూ, ఓ క్వెశ్చెన్‌మార్కూ తగిలిస్తే హిచ్‌కాక్—సినిమాలా వుంటుంది" ఈ సలహా జూనియర్ ది.

రంగారావ్

"కవర్ పేజి మీద ముచ్చటయిన మూడు రంగులో, ధగధగ మండిపోతున్న పొయ్యీ, దానిమీద పొగలు కక్కుతున్న కుండా, ఓ మూల కనీకనపడకుండా చిన్న ఎలుక తోలూకు రేఖాచిత్రమూ గీయించే శావంటే —కాపీలు వేడి పెసరట్లలా అయిపోతాయి" —ఇది శేషగిరి అమూల్యాభిప్రాయం.

"అందు చేతను—ఎటూ మాకు హోటల్ భోజనం తాలూకు మహత్యం అవగతమైంది గనుకా—"

"నీకూ తిండి ప్రశ్న ఉదయించింది కనుకా—"

"శుభంగా రేపొద్దుటినుండీ మీ ఇంటో వంట ఆరంభిద్దాం."

"వంటా? మనమా? అన్నాడు శేషగిరి ఆముదం తాగుతున్నట్టు."

"అచ్చె - అదేముంది...ఇన్ని బియ్యం వుడికించి, అంత ముక్కలు వేయించేస్తే ఎటూ అన్నంలో పొడీ, ఆవకాయా వుండనే వుందీ. పెరుగు సరే...ఇహ జీవితంలో అంతకన్న ఏం కావాలీ - అంటా" — ఆశావాది జూనియర్ ఉద్ఘాటన.

"అయినప్పటికీ..." అని నసుగుతున్న శేషగిరిని పూర్తి చేయనీయక.

"నీకెందుకు, నువ్వూరుకో ... అంతా చూస్తావుగా" అన్నాడు సీనియర్.

"'చూస్తావుగా' ఏమిటీ-'చేస్తాముగా'" అన్నాడు జూనియర్.

"అదేనోయ్, రుచి చూస్తావుగా—"

"ఓ ఎస్! అలాగే కానిద్దాం" అన్నాడు శేషగిరి.

ఆ క్షణాన అంతరిక్షాన గ్రహాలు అనుకూలంగా లేవట!

* * *

"లే, లెమ్మ, సోదరా!"

"ఊఁ..." నిద్ర సగం పోతూ నేవున్నాడు శేషగిరి.

"లేవమంటుంటే...?"

"అబ్బ, వూరుకో సరోజా!"

"ఒ - రే...య్!"

"ఓ...నువ్వట్రా జూనియర్! పొద్దున్నే ఏవిటిలా కొట్టుకొచ్చావ్? కాస్సేపాగు... మా ఆవిడ కాఫీచేసి యిస్తుంది" అని ఒళ్ళు విరుచుకుంటూ లేచి కూచున్నాడు శేషగిరి.

ఏదో తీర్మానం చేసుకున్న వాడిలా జూనియర్ శేషగిరి ప్రక్కకొచ్చి కూర్చున్నాడు.

"అబ్బాయ్, శేషగిరీ!"

"తమ్ముడూ, జూనియర్!"

"ఒక యథార్థం చెప్పనా?"

"తప్పకుండానూ"—అన్నాడు ఆవులిస్తున్న శేషగిరి.

"ను...వ్వు"

"ఆ..."

"వడపోసిన—"

"ఆ..."

"కల్తీలేని"

"ఆ..."

"నూటికి నూరుపాళ్ళ శుంఠవిరా"

"ఔ..." అన్నాడు ఆమధ్యే కర్నూలు వెళ్ళివచ్చిన శేషగిరి. ఇంత తంచన్‌గా ఒప్పేస్కున్నాడే అని జూనియర్ ఆశ్చర్యంతో ఇదయి పోతున్నాడు.

"ఎందుకూ?" అన్నాడు శేషగిరి—బీప్ బీప్-లా.

జూనియర్‌కు అందలేదు. 'ఏవిటి—'ఎందుకూ'?" అని అడిగాడు.

"అదేరా నేను కల్తీలేని శుంఠనన్నావే... ఎందుకూ...అని?"

"చెబుతున్నా విను. మొదటిది మీ ఆవిడ ఈ ఇంట్లో కాదుకదా ఈ జిల్లాలోనే లేదు. ఉంటే ఈ ఇంటికి ఫర్లాంగు వ్యాసార్థంలో

★ పాకజితులు ★

మా నీడలు కూడా రావు—ఏం, ఇహ రెండోది: ఇవాళ్టినుంచీ మన ముగ్గురం వంట వండుకుంటున్నాం..."

"ఇంతకీ...ఆ మూడోవ్యక్తి ఎవరో?" అన్న సందేహం వెలిబుచ్చాడు శేషగిరి కళ్లు నులుముకుంటూ.

"మా నాన్నే...మా చిట్టితండ్రే...దా ...మ్మా...మాపెడతా..." అని శేషగిరిని బెడ్ రూం నుండి వంటింటివైపు తీసుకు వెళ్ళాడు జూనియర్.

హాల్లోకొచ్చే సరికి వాతావరణమంతా ఊటీలో డిసెంబరు ఉదయంలాగుంది. జూనియర్, శేషగిరీ వంటింటిగడపదాకా వెళ్లారు. అంతే! ఆ తర్వాత ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేకపోయారు. వంటిల్లంతా పొగతోనిండిపోయి వుంది.

జూనియర్ శుకుడు ఏదో ఉజ్జాయింపుగా వేలు చూపెడుతూ "అదుగో...కొంచితే మన యనుంగు చెలికాడు?" అన్నాడు—అక్కడి పొగ గౌరవార్థం రెండు పొడి దగులు దగ్గుతూ.

జూనియర్ వేలు చూపించిన వైపు ఒక కిటికీ వుండేదని తెలిసిన శేషగిరి, బహుశా జూనియర్ ఆ కిటికీ వెలుపల ఎక్కడోవున్న ఎవర్నో చూపెడుతున్నాడు గామోసను కుని—"పొద్దున్నే అనవసరంగా—ఇంకోడి ఊసెందుకు? మనం కాఫీ పెట్టుకుందాం" అన్నాడు.

"పడ్డి వెధవాయా! ఇంకో డేమిట్రా—మంచంకోడు! సీనియర్ మహామునులుం గారు, పుట్టినప్పటినుంచి ఆ పని తప్ప మరోటి చేసి ఎరగనట్టు, విసనకర్రను చేత దాల్చి అదే పనిగా విసురుతున్నారు... కాస్త కళ్ళు తెరిచిచూడు..." అని ఏర్పాటును వివరించాడు. జూనియర్

"విసరడం ఎందుకూ?"

"కుంపటి రాజడానికి!"

"ఓహో, అదా సంగతి?"—అన్నాడు జ్ఞానోదయమయిన శేషగిరి "అదా విషయం. ఇంతసేపు ఇంకా ఏమిటో అనుకుంటు న్నాను. మన సీనియర్ గాడు కుంపటి అంటి స్తున్నాడా? పొద్దున్న లేవగానే ఆదేం ఖర్మవాడికీ...!" అన్న శేషగిరికి—దగులూ విసనకర్ర చప్పుడు వినిపించాయి.

ఆ శబ్దాలు వస్తున్న దిశను చూస్తే లీలగా తువ్వాలు కట్టుతున్న సీనియర్ శుకుడు అవుపించినట్టనిపించాడు.

ఇదంతా ఇటువైపు—.

—ఇహ అటువైపు...ఎక్కడో కొన్ని గజాల తర్వాత ఉన్న నూతిలోంచి వినిపించి నట్లు గొంతుకలు వినిపించాయి సీనియర్ కి. "దౌర్భాగ్య వెధవల్లారా! ఇంత ఘాతుకు లయితే ఎలారా? ఒక శవమేమో అసలు పడక మీదనుంచే లేవదు" లేచిన శవం లేవని శవాన్ని లేపుకొస్తానని వెళ్ళి, తాపీగా వచ్చి, నుంచుని సావకాశంగా బీచి ఒడ్డున సాయంకాలం కూర్చుని వున్నట్లు రెండూ, మాట్లాడుకున్నాయి...హు"

"బ్రదరూ! అలా తిట్టేయకు...మన శేషగిరిని తీసుకొచ్చాను"—అంటూ శేషగిరి జబ్బపట్టుకుని రంగంలోకి ఉరికాడు జూనియర్ శుకుడు.

పొగా – దగులూ సాగుతు నేవున్నాయి. జూనియర్ పైకి చూస్తున్నాడు.

శేషగిరి కనుబొమలు చిట్లించాడు. "సీనియర్! నువ్వు కుంపటి విసురుతున్నావని చెప్పాడే జూనియర్?"

"అవునూ!"

"ఏమిటి అవునూ?" అని సీనియర్ శుకుడు ఇంతసేపట్నుంచీ విసురుతున్న విసుర్ల దెబ్బకు తలుకున్న చల్దిఅన్నం కుండను రెండుచేతులనూ కోహినూర్ లా పైకెత్తి పట్టుకున్నాడు శేషగిరి.

"తస్సాదియ్యా! అంత ఇనపకుంపటే ఆవిరయి పోయిందే! ఆ—! బహుశా వేడి ఎక్కువయింది కామోలు"—అన్నాడు సీనియర్.

"మైడియర్ ఫూల్! కొంచెం కుడిప్రక్కకు తిరిగి చూడూ, ఏముందో?" అన్నాడు శేషగిరి.

"కు-మ్-ప-టి" అన్నాడు సీనియర్ – "మేజిక్ కుంపటి" అన్న డిటెక్టివ్ సీరియల్ రాస్తేనో—అనుకుంటూ.

"మరి అంతలావు కుంపటిని చూడకుండానే ఇంతసేపూ విసిరావుటోయ్..." అన్నాడు శేషగిరి సీనియర్ ఓపికవు విస్తుపోతూ..."

"హి—హి—హీ...చూడ లేదోయ్."

"కళ్ళేమయ్యాయీ?" అన్నాడు జూనియర్ కాఫీ ఆలస్యమయి పోతూందే అన్న బాధతో.

"పొగకదూ—కళ్ళు సరిగ్గా కనపళ్ళేదు" అన్నాడు సీనియర్—రెండురెళ్ళు నాలుగు అన్న ధోరణిలో.

జూనియర్ ఆ ఏర్పాటు నంతటినీ కదిలించాడు. కుంపటిక్రిందా, చుట్టుప్రక్కలా, సగంకాలిన కాగితంముక్కలూ, ఓ పాతిక అగ్గిపుల్లలూ వున్నాయి.

"కుంపటి రాజేయడం ఇలాకాదోయ్, మహాశయా! అంత పిడకముక్కమీద ఏదో పోసి నిముషంలో వెల్గించేది మా ఆవిడ!" అన్నాడు శేషగిరి.

"ఏదో ఏమిటే? పిడకమీద కిరోసిన్ పోసి అంటిస్తారు" అన్నాడు జూనియర్.

"కిరోసీనా? మొన్న మా ఆవిడ వెళ్లిపోగానే ఆ సీసా కనుపిస్తే — ఎలక్ట్రిక్ దీపాలుండే ఇంట్లో అప్రశుతిలాగు ఇదెందుకని సీసాతో వీధిలో పారేశాను."

"చచ్చితిమి!"—సీనియర్.

"మరి ఇప్పుడేదిదారి?"

కాసేపు ఆలోచనలు. హఠాత్తుగా తుళ్లిపడ్డాడు శేషగిరి. మాట్లాడడం ఆరంభించాడు.

"తమ్ముళ్ళూ! మొట్టమొదటి రోజు—ఇంత నిరుత్సాహపడిపోతే ఎలా? నలభీమాదులు 'క్యూ'లో నుంచుని ఒకముద్దకోసం కాచుకు నేరీతిలో, షడ్రసోపేతమయిన, విటమినుయుతమయిన భోజనం మన ఏకైక లక్ష్యం. ఆ లక్ష్యానికి ఈ ప్రస్థానం. ఇంత గొప్పప్రయత్నంలోనూ – ఇది ఒక అత్యల్ప, బహుస్వల్ప విషయం..."

"...అంచేత...?"

"...తక్షణం...హుటాహుటిని, నడుము బిగించి, దీక్షాకంకణధారులమై, ఈ వెధవపని మాని వంటకానిద్దాం" అని చతికిలబడ్డాడు అలిసిపోయిన శేషగిరి.

ఫెడేల్—మని శేషగిరి నెత్తిమీద ఓ మొట్టికాయ మొట్టి, సీనియర్ అన్నాడు: "ప్లానింగు కమిషన్లో వుండవలసినబుర్ర! అనవసరంగా ఇక్కడ వృధా అయిపోతోంది"

"నిప్పులేనిదే ఏంవంటరా, బ్రదర్?" అన్నాడు జూనియర్ శుకుడు.

"అవు నవును! అసలా వూసే మరచిపోయాను." అని ఇకిలించాడు శేషగిరి.

కాసేపు నిశ్శబ్దం. బొగ్గులబస్తా నానుకుని శేషగిరీ, కాలుమీద కాలు వేసుకుని రోటి మీద కూర్చుని సీనియరూ, కిటికీ వూచలు పట్టుకుని జూనియరూ ఆలోచిస్తున్నారు.

"అద్గదీ!" అన్నాడు జూనియర్.

"ఏది...ఏది..." అన్నాడు శేషగిరి.

"ప్లీచు!" అన్నాడు జూనియర్.


"ప్లీచు—అంటే?" అని అడిగాడు సీనియర్ మిస్టరీ అర్థం కాక.

"ప్లీచంటే-ప్లీచే! అది తెలీదుటోయ్..." అన్నాడు జూనియర్.

"ఒరేయ్! ప్లీచు, గీచు అన్నావంటే నీ పీ చూడిపోగలదు—అదేదో అందరికీ అర్థమయేటట్టు ఏడువు."

"అబ్బబ్బ! ఎంత మట్టిబుర్రలురా మీవి? కొబ్బరి పిచుతో కుంపటి అంటిద్దామంటుంటే అర్థం చేసుకోలేం?" అని వివరిం

(55-వ పేజీ చూడండి)



[ఉ ద్యో గ ప ర్వం నుం డి]

చ. అనవుడు భీష్ముఁ డిట్లనియె నక్కట భాగ్యము గాదె పాండునం
దను లొక యాపదం బడక ధర్మగతిం దగ నందఱున్ సుహృ
జ్జనులను గృష్ణునిం గలసి సమ్మద మొందుటయుం బ్రశాంతిమై
మనముల నీసు దక్కి మృదుమార్గము వట్టుటయుం దలంపఁగన్.

క. నీవాక్యము విప్రస్వా, భావికమై యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్
భావింపఁ గార్యమున యం, దేవిధమున సభకు నింత యిష్టం బగునే.

చ. సమయమ యాది పాండవు లశక్తులచాద్పున నిందు నాఁడు బ
న్నమువడి చన్నదైన్యము వనంబునఁ బడ్డ విషాదవేదనా
శ్రమము విరాటువీట లఘు సంచరణంబున దాఁగి యున్నదుః
ఖమును జగం బెఱుంగదె యకల్మషులం బఱుపంగఁ బాడియే.

క. పితృధన మగు పా లుచిత, స్థితి వారల కిచ్చి నిర్విశేషుం డై యీ
పతి లోకము మెచ్చఁగ నిజ, సుతునివహము నట్ల వారిఁ జూడఁగవలయున్.

వ. అట్లుం గాక.

చ. కడవఁగ జూద మాడి యవుఁ గాదన నేరక సత్యభాషణం
బెడలిన వచ్చుధర్మగతి హీనత కోర్వక రాజ్యహీనతం
బడుటకు నోర్చి ధర్మజుఁడు పంచిన సైరణ సేసెఁగాక క
వ్వడి నెఱిగిన్క కట్టి మగవారును నోర్తురె యిజ్జగంబులన్.

వ. అనిన విని కర్ణుండు గనలి యిట్లనియె.

క. జనులెల్ల నెఱింగిన యీ, పని యేటికి నుగ్గడింప బలుమఱు దుర్యో
ధనునకయి శకునిజూదంబున మేదిని గెలిచె ధర్మపుత్రుం డోడన్.

ఆ. దీన నేమి తప్పు కానకు నేఁగిన, యతడు సమయవృత్తి నాక్రమించి
తండ్రిపాలు మాకుఁ దగు నంచు నడియరి, తనము సేసి రాక తప్పుగాక.

క. విరటుఁడు ద్రుపదుఁడుఁ దోడుగ, బరవసమున నెత్తి విడిసి బలిమి నడిగినం
గురుపతియు వెఱచి యిచ్చునె, ధరలోఁ జక్కనగ మిట్టి తగవులు గలవే.

వ. అనిన గాంగేయుండు గటకటంబడి కర్ణున కి ట్లనియె.

ఉ. చిక్కని పోటుమానిసి వినీ వినువారలు నవ్వ నేమిగా
నెక్కుడుమాట లాడెద వహీనపరాక్రమశాలి యర్జునుం
డొక్కడ యార్వురన్ మనల నుగ్రరణంబున గెల్చె నిన్న నే
డిక్కడ బల్కులన్ గెలిచె దీ వతనిన్ మన రాజుకొల్వునన్.

క. నరుఁ డాలవెనుక వచ్చినఁ గురురా జడుగంగ నీవు గురుఁడును గృపుఁడున్
గురుసుతుఁడు వినఁగ వారల చిరసమయము దెగుటయేను జెప్పనె తెలియన్.

తే. అనిన ధృతరాష్ట్రుఁ డాపగా తనయుభక్తి, ననునయించి రాధేయునిఁ గినిసి ప్రియము
దోఁపఁ దానిట్టు లనియె నా ద్రుపదమనుజ, పతిపురోహితుతోడ సంభ్రమము లేక

ఉ. మంచిగ నేను బంధులును మంత్రి జనంబులుఁ బెద్దలున్ విచా
రించి సమస్తభూప్రజకుఁ బ్రీతిగ బిడ్డలపాలి కిప్డు పు
త్తెంచెద సౌమ్యు నొక్కరు మదీయమనోగతి వారిఁ గూడి వ
ర్తించు తెఱంగు గైకొనుట దెల్లము కౌరవజాతి కెంతయున్.

తే. నీవు మున్నేగుమని యతనికి విభూష, ణాంబరమ్ములతోఁ దమ్మలంబుఁ బెట్టి
వీడుకోలిచ్చి పుచ్చిన విప్రవరుఁడు, పాండుజనపాల తనయులపాలి కరిగె.

వ. ఇట్లు సని వారలం గని యతండు సముచితసంభాషణంబుల దన వోయివచ్చిన కార్యంబుతెఱం గెఱింగించె నిట ధృతరాష్ట్రుండును బుత్రమిత్ర వృద్ధామాత్యసహితంబుగా నాస్థానాసీనుం డయి యుండి సంజయుం రావించి యతని కిట్లనియె.

తే. పాండునరపాలసుతు లుపప్లావ్యమునకు, వచ్చి యున్నారు నీ వేఁగి వాసుదేవ
సహితముగ వారిఁ గని తద్విషాద మేమి, భంగి మాను నమ్మోయి దగ బలుకవలయు.

ధృతరాష్ట్రుఁడు సంజయుని బాండవులయొద్దకు బంపుట.

క. మీ యయ్య మీరు వనవా సాయాసము నిస్తరించి యభ్యుదయమునన్
డాయుట విని ముదితాత్ముం, డై యిట పుత్తెంచె నన్ను ననుమీ మొదలన్,

వ. అని చెప్పి చుట్ల నున్నవారలతో నిట్లనియె,

క. దుర్యోధనుండు గార్యా, కార్యజ్ఞుఁడు గామి నిట్టి కలఁక గలిగెఁ గా
కార్యులు దృఢధైర్యులు రణ, ధుర్యులు నగు పాండుసుతులు దోషాన్వితులే.

క. ఏకోదకవృత్తి మనము, వారలునుం గలసి బ్రదుకవలదే నెమ్మిన్
వా రిడుమలఁ బడఁ దగియెడు, వారే పితృభాగ మేలు వారలు గారే.

ఆ. మనల నింక నమ్మ రన్యతాత్ము లన్యాయ, పరులు గర్వు లనుచుఁ బాండుసుతులు
గూడి మనుట కియ్యకొన నేరరైనను, ధర్మజుండు గలఁడు దగవు నడప.

వ, అని పలికి వెండియు.

మ. మన కీ కుండఁగవచ్చునే మనము దుర్మానంబు వాటించి యొ
ప్పని కార్యంబులు వట్టి వారికిఁ దగం బాలీక గర్వంబు లా
డిన నిక్కం బగు నల్క నర్జునుఁడు గాండీవంబు మోపెట్టఁ గృ
ష్ణుని సారథ్యము నై జగత్త్రితయసంక్షోభంబు గాకుండునే.

తే. అలఘుగద బూంచికొని భీముఁ డతిరయమునఁ, గురుకుమారులపైఁ దీవ్రకోప మెసఁగఁ
గవియు టాత్మ భావించిన గంప మడరు, నిక్క మెవ్వరు మార్కొని నిలుచువారు.

సీ. కవ లగ్రజన్ములకంటె నేమిటఁ గీడు ద్రుపదుఁ డల్పుండె తత్సుతులు బాహు
గర్వసమగ్రులు గారె విరాటుండు నాతనితమ్ములు నాత్మజులును
ననదులే సాత్యకి యలతులఁ బోయెడువాఁడె వృష్ణికుమారవరు లనేకు
లట్టి యోధులు పోర నరవాయి గొందురే పాండ్యుండుఁ గేకయపతులు నాది

తే. నైన బంధులు మిత్త్రులు నగ్గలికలఁ, గొఱఁతపడియెడువారె యందఱును గెల్వ
నోపినను రుద్రునకు నైన నోర్వరాని, ధర్మపుత్రుకోపమునకుఁ దలఁక వలదె.

వ. అని పలికి సంజయుదిక్కు మొగం బై యెల్లవారును విన నిట్లనియె.

తే. నీవు ధర్మజుపాలికి నెమ్మి నరుగు, మతఁడు పేరోలగం బున్న యవసరమునఁ
గాన్పు మతనికి ననుజవర్గంబునకును, బంధులకు నింపు పుట్టంగఁ బలుకు మచట.

క. నెయ్యము వాటించి కడుం, దియ్య మెసఁగ నలుక లెల్లఁ దీఱునటులుగాఁ
గయ్యము మనుతలఁపు లోనుగ, న య్యమనందనుడు మాను నట్టి తెఱఁగునన్.

సంజయుఁడుపప్లావ్యంబున నున్న పాండవులయొద్దకు వచ్చుట

వ. శాంతిప్రకారంబునం గార్యంబు నడపి యొక్కటి యై మనుట యొడఁగూర్చి రమ్ము రథం బెక్కి పొమ్మని తగిన తెఱంగున వీడ్కొలిపిన సంజయుండునుం జని యుపప్లావ్యంబు సొచ్చి మాధవు మందిరంబున కరిగి యభ్యంతర వినోదంబుల నరసహితుండై యున్న యన్నారాయణునకుం దనరాక యెఱింగించి పుచ్చి తగఁ బ్రవేశించి భయభక్తి వినయ సంభ్రమంబులు మెఱయ వారలం గాంచి యమ్మహాత్ము లిరువుర సంభావనంబులును సంభాషణంబులునుం బడసి సంప్రీతచేతస్కుండై మఱునాఁడు ధర్మతనయు నొద్దోలగం బున్న సమయంబు వేచి సముచితంబుగా నతనిం గని సాష్టాంగంబుగాఁ బ్రణమిల్లిన నతండుం బ్రియపూర్వకంబుగా నాదరించి తన సమీపంబున నునిచికొనినం గొలిచి యుండి యతని కి ట్లనియె.

తే. భాగ్యమున నిన్నుఁ గనుఁగొనఁబడసి నాదు, చూడ్కి చరితార్థ మయ్యె నస్తోకపుణ్య
ధనుఁడు మీ తండ్రి ధృతరాష్ట్రధరణినాథుఁ, డిందు మీ యున్కి విని ప్రియ మెసక మెసఁగ.

క. అనుజులు నీవును ద్రోవది,యును బుత్రచయంబు నున్న యోగక్షేమం
బున తెఱఁ గారయఁ బుత్తెం,చె నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్.

వ. అనిన సూత నందనునకు ధర్మనందనుం డి ట్లనియె,

క. ఆరాజు మాదెసం గల, కారుణ్యము కతమునను సుఖంబున నిట్లు
న్నారము నినుఁ బుత్తెంచిన, గారవమున నాదు మది వికాసముఁ బొందెన్.

క. అమ్మనుజేశ్వరునకు సే,మమ్మే పుత్రకులు సుఖులె మనుమలునమ్మో
దమ్మునఁ బెరిఁ గెదరే నగ, రమ్ముల భూములను శుభపరంపర గలదే

సీ. ద్రోణుండు గృపుఁడును ద్రోణసుతుండును సుఖ మున్నవారె సుశ్లోకుఁడైన
భీష్ముండు గుశలియే పెద్దతనం బిచ్చి యాతని గౌరవు లనుసరించి
మెలఁగుదురే బ్రాహ్మణులకు మన్నన గల్గి యుండునే నే మర్థి నొసగినట్టి
వృత్తులు సెల్లునే యొత్తొరు వొండులవలన బుట్టదు గదా కలఁకులందు

తే. బుట్టినప్పుడు గాండీవి భుజబలంబు, తలఁతురా భీమసేనుగదావిహార
ముగ్గడింతురె కవలు మహోగ్రరిపుల, భూము లంతంత కొత్తుట పొగడఁబడునె.

మ. ఒకనాడా తమముందటం బలుమఱున్ హోరాటమై నేలయొ
త్తికొనంగా బవరంబులన్ గెలువఁగా దెల్లంబుగాఁ జూచి పాం
డుకుమారాళి నుతింప కుండుదురె యాటోపంబునన్ ఘోషయా
త్రకు గంధర్వులు వచ్చినప్పటిచరిత్రం బాత్మలం బాయునే.

క. వినుము మనము మధ్యస్థుల, మని నర్జును నెదిరి సంజయా యిట మున్నె
వ్వనికిని మానము ప్రాణం,బును దగఁ దక్కించుకొనగఁ బోలునె చెపుమా

క. దుర్యోధను నింటం దగు, కార్యమునకు ఖడ్గమునకుఁ గలవాఁడై చా
తుర్యంబు మెఱయుకర్ణుని, యార్యత్వము సెల్లు చున్న యదియే నెమ్మిన్.

వ. అనిన విని సంజయుండు సవినయంబుగా నిట్లనుఁ గురురాజునొద్ద నవినీతులు నీతిమంతులు సత్త్వసంపన్నులు దురహంకారులు మఱియు వివిధప్రకారులు నయి పెరసి యుండుదురు వా రొక శ్లాకశ్లమాటలం బోయెడువార గారు కావున వారి నంత యనం బనిలేదు నా విన్నపంబు చిత్తగింపుము.

క. పొం దొందగఁ దలచితి నీ, విందుశిశిర మైన విమలహృదయంబున వా
రందఱకును సేమం బిట, ముందర లేకున్న నేఁడు మొదలుగఁ గలుగున్.
క. ధృతరాష్ట్రభూపతికి వృద్ధత కతమునఁ జిత్త మొకవిధము గామి సుతో
ద్ధతి మాన్పఁడ నాఁడు మనః, క్షతి పిదపం బుట్టి యిపుడు శాంతుం డయ్యెన్.
తే. ఇట్టి చందంబు లెల్లను నీవు పుణ్య, చిత్తవృత్తిమై సైఁచినఁ జెల్లి వచ్చె
నీయజాతశత్రుత్వంబు నిఖిలలోక, విశ్రుతముగాదె ధర్మప్రవీణ హృదయ.
చ. జగముల నెల్లెడన్ దురితసంతమసంబు జయింపఁ గోరి పొ
ల్పుగఁ బరమేష్ఠి నిల్పిన వెలుంగు మహీసురు లట్టివారికిం
దగవు ఘటింప సత్పురుషదత్తము లై చను జీవనంబు లెం
త గుమతులైన మార్తురె పదంపడి యాయువు శ్రీయు నొల్లరే.
ఉ. ఒక్కొకచో గడంగి ప్రతియోధులు మార్కొను నప్పు డాత్మలన్
నెక్కొని మోములం బొడము నెవ్వగతోడ జనంబు లిట్టియం
దక్కట భీముఁడైన మనయర్జునుఁడైనను మాద్రిపుత్రులం
దొక్కరుఁడైన నీపగఱ నుక్కడగింపరె యొక్క వ్రేల్మిడిన్.
క. వా రొక యాగ్రహవృత్తిం, గూరియు ధర్మంబు సెడుటకుం జాలరు దు
ర్వారబలు లయ్యు బొందుకు, మారులు శాంతాత్ము లంద్రు మనుజాధీశా.
క. నలువురు దమ్ములు భవదాప్తులుఁ గృష్ణుఁడు వినుచు నుండ భూవర నీ కేఁ
గొలువునను విన్నవింపం, బలుకులు గల వవధరింపు పరిపాటి మెయిన్.
చ. అనవుడు వీరె తమ్ములును నాప్తులు గృష్ణుఁడు వీరె తక్కుకొ
ల్వునఁ గలయట్టి సర్వజనులున్ వినుచుండెద రయ్య నిన్ను నే
మను మని పంచెఁ జెప్పు మది యంతయు నేర్పడ నన్న ధర్మసం
దనుగరువంపుఁ బల్కులవిధంబునకున్ మదిలోన నుల్కుచున్.
ఆ. సంజయుండు కృష్ణు సద్భక్తి నీక్షించి పవనపుత్రుఁ బార్థుఁ గవల ద్రుపద
తనయు సవినయమునఁ గనుఁగొని ప్రీతిఁ బాంచాలు మత్స్యధరణిపాలుఁ జూచి,
వ. సావధానుల రై వినుం డని పలికి యుధిష్ఠిరుదెసకు మోడ్పుఁగేలు నిగిడించి యిట్లనియె.
ఉ. శాంతతఁ బొంది కార్యముదెసన్ ధృతరాష్ట్రమహీశుఁ డాత్మన
త్యంతముఁ దేఱి నన్నిట ప్రియంబునఁ బంచెడునప్డు నాకుఁ దే
రెంతయు వేడ్కఁ దాన వెర వేర్పడఁ జెప్పుచుఁ బన్న బంచె ని
ట్లెంత ఘటించెఁ బొందు మన మీపదనం దెలి వొందగాఁ దగున్.
క. చులుకని కార్యము సేయం, దలచుట మీయట్టి సర్వధర్మజ్ఞులు శాం
తులు ననఁ బ్రసిద్ధు లగుపెద్దలకుం దగ వగునె యెవ్విధంబునఁ జూడన్.
ఆ. మడుగుఁ జీరయందు మసి దాకినట్లు మీ, సత్కులమునఁ గల్మషంబు గౌర
వేంద్రుకతనఁ బొందె నింతయుఁ బాపంగ, నీవ నేర్తు కార్యనిపుణహృదయ.
చ. అఖిలజనక్షయం బయి జయాపజయంబులు రెండునుం దుదిన్
సుఖములు గాని యీపనికిఁ జొత్తురె యుత్తము లట్లుఁ గాక యా
నిఖిలసుఖంబు లేమిటికి నీ వని వృద్ధజనంబు బాలురన్
సఖులను బంధులన్ గురులఁ జంపిత యేని దయాపయోనిధీ.
ఉ. పెట్టనికోట నీకు హరి భీముఁడు నర్జునుఁడున్ రణంబునం
దొట్టినమంట లాకొలఁది యోధుల సాత్యకియున్ విరాటుఁడుం
జుట్టపుమేరు వుగ్రరణశోభితుఁ డీ ద్రుపదుండు నిన్ను ని
ట్టట్టన వచ్చునే సురలకైనను నొల్లవుగాక చివ్వకున్.

లాభ నష్టాలు

నాకేం తోచలేదు...

గుర్రప్పందాలలో యావదాస్తీ, నష్టం కావచ్చు. అందుకు విచారించవలసిన పని లేదు.

సభ్యత్వం వున్న భీమాసంస్థ-హఠాత్తుగా దివాలా తీయవచ్చు. అందుకు బాధపడవలసిన అవసరం లేదు...

కాని, నిండు నెలరోజులు కుటుంబానికి ఆధారమైన జీతపు సొమ్ము-దారిలో హఠాత్తుగా మాయమయితే-మధ్య తరగతి కుటుంబీకుడి గతి యెలా వుంటుందీ-అంటే, అది అనుభవించిన వాడికే తెలియాలి!

దగ్గరున్న పోలీస్-స్టేషన్‌కు వెళ్లాను. సబ్-ఇన్‌స్పెక్టరు ఠీవిగా దర్శనమిచ్చారు. వాడిపోయిన వదనంతో వందనం చేశాను. విచిత్రంగా-నాకేసి చూడకనే-"చెప్పండి!" అన్నారు.

దిగులుతోనూ, విచారంతోనూ-తడబడుతున్న మాటలను ఓపిగ్గా కూడదీసుకుని-నాలుగు ముక్కల్లో చెప్పాను:

"మా కంపెనీలో జీతం తీసుకుని వస్తున్నాను. జేబులో పెట్టుకున్న ఆ జీతపు సొమ్మును-ఆ నూటపదినీ-దారిలో ఎవరో కొట్టేశారు..."

ఈసారి ఇన్‌స్పెక్టరు నావేపు చూశారు. ఆ చూపులో అవహేళన, ఏహ్యం, జాలి అనే రంగులు వెలువడ్డాయి. అట్టే సేపు ఆయనవేపు చూడలేక ముఖం దించుకున్నాను. "మిస్టర్" అని ఆయన నన్ను పలకరించేంతవరకూ-ఆయన వేపు నేను చూడలేదు.

"ఐయామ్ వెరీ సారీ... ఇప్పుడిలాటి కేసులు జరగడం అధికమయిపోయింది. అలాటి దొంగల్ని పట్టుకోడానికి మా శాఖ వారు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటారు. మీ విషయంకూడా దర్యాప్తు చేస్తాం.... రిపోర్టు రాసిచ్చి వెళ్ళండి..." అని, ఓ కాగితం నా ముందు విసిరారు...

'అంతే గాబోలనుకున్నాను...

నా వేళ్లు, కలాన్ని ఆ కాగితంమీద నడిపాయి...ఆగాయి.

లేచాను...బయటికి నడిచాను...

లోకంలో-చీకటి తెరలు కొద్ది కొద్దిగా అల్లుకుంటున్నాయి. అక్కడక్కడా విద్యుద్దీపాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి...

'ఏం చేస్తావ్?' అన్నది లోకం.

'ఇంటికి వెళ్లు' అన్నది మనస్సు. కాని...

ఇంటివాడుగ అడిగితే ఏం చెప్పాలి?... పాలవాడికి, పెరుగువాడికి, ఇంటిసామానుల అంగడివాడికి, మిగతా చిల్లర అప్పులవాళ్ళకి యేం చెప్పాలి?—నా జీతపు డబ్బులు యెవడో జేబుదొంగ కొట్టేశాడంటే, నమ్మేదెవరు? అబద్ధాలాడి అప్పుచేసుకో చూస్తానని కొందరు—ప్రత్యక్షంగా కాక పరోక్షంగా చెప్పుకుంటారు! ఈ నిందల మధ్యలో నా అవస్థ యెలా వుంటుంది?...

సి. డి. యస్. రామయ్య

మనస్సును మౌనం ముంచింది...కాళ్లు నడకను సాగించాయి. జీవితపు వెలుగునీడల్ని గురించి చర్చిస్తోంది నా అంతరాత్మ...

ఇరవయ్యో నిమిషానికి, నా రెండు కాళ్లు మాయింటి గుమ్మం తొక్కాయి...నా బాధను శారదకు యెలా వివరించాలా అనుకున్నప్పుడు—నా ఒంట్లో షాక్ తగిలినట్టనిపించింది. ఒళ్ళు దులుపుకున్నాను. మనస్సును స్థిమిత పరుచుకున్నాను. ముందడుగు వెయ్యమని నా కాళ్లకు ఆజ్ఞాపించాను...

వాకిలి తలుపు మెల్లగా తీశాను... మోహను దీపంముందు కూర్చుని, బొమ్మల పుస్తకం చూస్తున్నాడు...శారద?

"అమ్మా!...నాన్నొచ్చేశాడమ్మా!" అని రైలు కూతలా కేక వేశాడు మోహను. ఐదేళ్ళకుర్రాడు అలాగేనా అరవడం? అనుకున్నాను.

"ఏమండోయ్!..." అంటూ వంట వాకిలినుండి అర్ధాంగి కంఠం జవాబిచ్చింది. "స్నానం చేస్తున్నా...నిమిషంలో వస్తాను. కూర్చోండి."

ఎవరినీ పలకరించే స్థితిలో లేనప్పుడు... మెల్లగా మంచంమీద వాలి, కాసేపు కునుకు తీయాలని తోచింది. అందుకని, నాగదివేపు నడవబోయి...నాలుగడుగులు వేసి...

అంతలో నా చూపు మోహను దగ్గరున్న ఒక వస్తువుమీద పడ్డంతో—నా నడక ఆగిపోయింది...అది బీగాలగుత్తి!...

మంత్ర ముగ్ధుడిలాగా—దాన్ని చూడ్డంతోటే—నా బుర్ర బద్దలయిపోయింది... బద్దలయిపోయిన ఒక్కొక్క ముక్కలోనూ ఒకొక్క ఆలోచనా మెరుపులాగా పుట్టుకొచ్చింది ... అంతా ఒక్క నిమిషంలోనే జరిగిపోయింది.

ఆ ఆలోచన పుట్టుకొచ్చేసరికి—నాలో ముచ్చెమటలూ పోశాయి...గుండె గతుక్కుమన్నది. అంతరాత్మ తప్పు అన్నది—కాని, వేరేగత్యంతరం లేదు అన్నది మనస్సు.

గుండెరాయి చేసుకుని, ఆ బీగాలగుత్తిని చేతికి తీసుకున్నాను. మోహను ఒకసారి నావేపు పరీక్షగా చూసి వూరుకున్నాడు. వడివడిగా వెళ్ళి మరోగదిలోని శారద బీరువా తీశాను...బీరువమధ్య భాగంలోని కుడివేపు సొరుగులో చిన్న పెట్టె తీశాను...తెరిచాను. అందులో నిరపాయంగా నిద్రించే రెండు పేటల బంగారుగొలుసు కనిపించింది. దాన్ని చేతికి తీసుకున్నాను...

'అది శారద సొత్తు...దానిని అమ్మి, సొమ్ము చేసుకోడానికి, అదీ శారద సమ్మతి లేకుండా, చేయడానికి-నీకేం అధికారముంది? నీభార్యకు ద్రోహంతలపెట్టావా?'-బీరువా అద్దంలో ప్రతిబింబం నన్ను ప్రశ్నించింది. పెదిమలు కొరుక్కున్నాను... అంతలో నా మనస్సుకు ఆవేశమొచ్చింది!

'ఇది శారద సొత్తే కావచ్చు...కాని, మానం పోతున్న ఆపత్సమయంలో ఉపయోగపడని ఆభరణం దేనికి? ఇలాలు దేనికి? కాలము కలిసివస్తే-ఇలాటి ఆభరణాలు కూటపదార్లు చేసుకోవచ్చు...అంతమాత్రానికి-నా మంచిచెడుగుల తతంగం శారద కనుక్కోగలదని తెలుసు. ఊరుకో!'—

నాలో లేని బలమొచ్చింది...ఆ ఆభరణాన్ని జేబులో వేసుకుని, బీరువా తలుపులు మూశాను...పిదప, ఆ బీగాల గుత్తిని వాకిట్లో దీపం ముందు కూర్చున్న మోహను ముందు పడేసి — "ఇప్పుడే వస్తానని అమ్మతో చెప్పు!" అని చెప్పి, బయటికి చరచరా వచ్చేశాను...

బజారుకి వెళ్లి ఆ ఆభరణాన్ని అమ్మేశాను...ఆ విచారాన్ని వ్యక్తపరుస్తూ-నా కళ్ల నుండి రెండు నీటి బొట్లు రాలాయి.



“మధుర స్మృతులు”

చిత్రకారుడు: రావాడ కృష్ణ, —పుల్లేటికుర్రు.

అప్పుగా వచ్చిన రెండువందల ఇరవై రూపాయలనూ—ఈసారి కూడా జేబుదొంగల మహాశయులకు పాలుగాకుండా-జాగ్రత్తగా భద్రపరుచుకున్నాను... అలా నడిచి వస్తుంటే 'గోల్డ్ కవరింగ్' కొట్టు కనిపించింది...ఆ కొట్టులో ప్రవేశించి - ఇంతకు ముందు చేసుకున్న - శారదకు సొంతమైన రెండుపేటల బంగారు గొలుసు లాటిదే - మరొకటి (నకిలీది) కొన్నాను. పద్దెనిమిది రూపాయలని కొట్టువాడు చెప్పినా-నాకు ఆ సమయంలో బేరమాడాలనిపించలేదు.

త్వరత్వరగా ఇంటికి వచ్చేసరికి-ఆ దీపం ముందే మోహను కూర్చుని, పుస్తకాలు చూస్తున్నాడు...అమ్మ యేదని అడిగాను. దేవాలయానికి వెళ్ళిందన్నాడు...గండం గడిచిందన్నటు తృప్తిగా నిట్టూర్చాను... అక్కడే వున్న బీగాలగుత్తి సహాయంతో బీరువా తీసి-పూర్వం బంగారు గొలుసున్న సింహాసనంలో నకిలీ బంగారు గొలుసును పెట్టేశాను. ఈ సారి అద్దంలోని నా ప్రతిబింబం-నన్ను చూసి యీాగబోయింది. అయితే, నా మనస్సు మాత్రం - “‘ధైర్య సాహసే లక్ష్మీ’ అన్న పెద్దల మాటలను నిరూపించావు శివరాం” అని సమర్థించింది.

*   *   *

వారంరోజుల తర్వాత—అన్నంముందు కూర్చున్న ఒకానొక సమయంలో—

“ఏమండీ! ప్రయాణంగురించి యేమాలోచించారూ?” అని ప్రశ్నించింది శారద!

“రాజమండ్రి వెళ్లేవిషయమే గదూ!” అన్నాను. వాళ్ళబాబాయి కొడుక్కి పెళ్ళి ముహూర్తం నిశ్చయం చేశారు. ఇంకా పది రోజులుంది గాబట్టి శ్రీమతి నాకు జ్ఞాపకం చేసింది!

“అవును. వారంరోజులకు ముందుగానే మనల్ని రమ్మనిచెప్పి, వెళ్ళా[illegible]గదండీ—బాబాయి!...అందుకే ప్రయాణం యెప్పుడు నిశ్చయంచేశారూ అని అడుగుతున్నా...” అంది శారద.

“ఇదిగో, చూడు—శారదా! మా కంపెనీ మేనేజరు పచ్చికసాయివాడు...ఇంకో నెల వరకూ—యెవరికీ, సెలవులు—ఒక్కరోజయినాసరే—ఇవ్వబోవడం లేదని బల్లగుద్ది చెప్పేశాడు...ఈ పరిస్థితులలో—రాజమండ్రికి నేనెలా రాగలను?—కాబట్టి, నువ్వూ, అబ్బాయీ వెళ్ళిరండి!”

నిమిషంపాటు శ్రీమతి ముఖం విచారపూరితమై, పాలిపోయింది. తర్వాత—నిట్టూర్చి—“సరే—మీ యిష్టం! ఆడదాన్ని... నేనేంచెప్పగలను మీకు?” అంది.

మరునటిరోజు శారదా, మోహను రాజమండ్రికి ప్రయాణమయ్యారు...వాళ్ళను బండిలో సాగనంపి వచ్చాను.

నిజంచెప్పాలి, మరి—మామూలుగా, పండుగదినాల్లోగానీ, ఏదైనా విశేషమున్న రోజుల్లోమాత్రమే శారద తన ఆభరణాలను అలంకరించుకునేది. కాబట్టి, రాజమండ్రి ప్రయాణమవుతూ—ఆ (నకిలీ) బంగారు గొలుసునుగూడా—మిగతా నగలతో పాటు అలంకరించుకుంది...కాని, బండి కదిలేటంతవరకూగూడా—ఆమె ముఖంలో, ఏ సందేహాలకూ, అనుమానాలకూ చోటున్నట్టు నాకు అనిపించలేదు.

*   *   *

ఇరవై రాత్రిళ్లు గడిచిపోయాయి...

మా శ్రీమతీ, అబ్బాయీ—యింటికి తిరిగి చేరారు...

పెళ్ళిబాగానే జరిగిందట...నేను రాలే

దని వాళ్ళబాబాయి కొత్తకొప్పడ్డాడట... బాగుందనుకున్నాను...

ఆ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక-వాడుకగా—శారద నాకు కాఫీ అందించింది...కాఫీఅందుకోబోతూ—అందంగా వున్న నా అర్ధాంగిముఖాన్ని చిరునవ్వుతో పలకరించాను. ఆవిడ అర్ధనిమీలిత నేత్రాలతో ఆప్యాయంగా జవాబిచ్చింది.

"ఇంకా ప్రయాణపు విశేషాలు ఏమైనా వున్నాయా?" అంటూన్నంతలో నాచూపు శ్రీమతి కంఠంచుట్టూ దేన్నో వెదికింది. కాని కనిపించలేదు. అది నేను బహూకరించిన (నకిలీ) బంగారు గొలుసు!

"బంగారు గొలుసేదీ?" అని ప్రశ్నించాను...నా కంఠంలో కొంత కర్కశత్వం వినిపించింది గాబోలు; నా నేత్రాలనించి రోషారుణిమ బయటపడింది కాబోలు!

శారద బిత్తరపోయింది. ఆమె ముఖంలో వివర్ణత వర్ణించలేనంతగా అల్లుకుంది. అది యేదో అపాయ సూచన అని నాకు తెలుసునని ఆమెకు తెలీదు. ఆమె మౌనం వహించింది. ఆ మౌనం అంగీకార సూచకమేగాక అనుమానాస్పదం అనికూడా నాఅంతరాత్మ అనుమానించింది.

"గొలుసేది అని అడుగుతుంటే వినబడ్డంలా? ఏమిటి విషయం?"—భర్త అనే ఘోరమైన అధికారాన్ని ఈసారి గర్వంగా ప్రదర్శించాను.

శారద ముఖమెత్తి చూసింది. "చెపుతాను. కోపగించుకోరుగదా?"— అని దోషిలా పలకరించింది.

"కోపం దేనికి?— నమ్మతగ్గదైతే?—" నవ్వంలో మిరప్పొడి కలిపి పిల్చినట్టు—నా శరీరం మండింది.

"నామాటల్ని మీరు నమ్మగలరనే నమ్మకంతోనే నేను నిజంచెపుతున్నా. ఆ బంగారు గొలుసు పోయింది..." (ఇక్కడ నాశరీరం రోమాంచితమైంది.) "పెళ్ళిజరుగుతున్న సమయంలో మా బాబాయి మూడో కూతురు జలజ— నా మెళ్ళోని గొలుసును వేసుకోవడానికిమ్మని అడిగింది. ఏదో—పసిపిల్ల ముచ్చటపడిందని దాని మెళ్ళో వేశాను...తీరాకొంతసేపటి తర్వాత చూస్తే ఆగొలుసు దాని మెళ్ళోలేదు. ఏదని అడిగితే ఎవరుతీసుకున్నారో నాకు తెలీదని ఏడ్పుముఖంపెట్టింది. బాబాయి దగ్గర చెప్పాను. ఆపిల్లని నాలుగుకొట్టి, తర్వాత ఇంకోవారం రోజులలో అలాటి గొలుసును—బంగారం కొని కంసాలిచేత చేయించి పంపుతానని నాకు మాటిచ్చాడు. అదీ సంగతి..."

అంతా విన్న తర్వాత కొంతసేపటివరకూ నా మనస్సు మూగబోయింది. నాహృదయం చైతన్యం తప్పింది ... అది నాకు సరిగా తెలీదుగూడా!

"ఇప్పటికైనా నమ్ముతారా నామాటల్ని!" అని శారద నన్ను పలకరించేంత వరకూ నాకు లోకమే గుర్తులోలేదు...హరి భగవంతుడా! ఎంత ఉపకారివిరా! ఆయాసపడి అగచాట్లు పడి, ఆప్యాయతతో నా అర్ధాంగికి కొని పెట్టిన వద్దనిమిది (పదులూ గాదు, వందలూ గాదు) రూపాయల బంగారు (పూత) గొలుసును తొలగింపచేసి-ఆఖరికి వాళ్ళ బాబాయి చేత (అసలు) బంగారు గొలుసును కొనిపెట్టదలిచావురా! ఈ నష్టాన్ని నష్టపరిచి—లాభాన్ని లభింపచేసిన నీకు ఎన్ని (కోట్లయినాసరే) నమస్కారాలు పెట్టినా చాలదు గాబోలు!...థేంక్ గాడ్!...

నానుండి నిట్టూర్పు విడివడడం గమనించి—శ్రీమతి తనొక నిట్టూర్పు విడిచింది. (కూడి రక్తసంబంధం గదా, మరి!)

"శారదా! ఒకమాట! అది నీసొత్తు! నువ్వే పోగొట్టుకున్నావ్! అయినా అడగవలసిన బాధ్యత వుందిగాబట్టి అడిగాను. నువ్వో చెప్పావు! అంతేగాని—పోయిన సొమ్ము యెలాగో పోయింది అనుకో!—మీ బాబాయిమాటలు నువ్వు నమ్మగలిగితే, ఇందులో నాకే అభ్యంతరమూ లేదు..."అని పెదిమలు విరిచి వూరుకున్నాను.

క్షమించడం మానవ సుగుణం అని నీతివంతులు నీతికథల్లో రాశారు. ఆ కథలపై అభిమానంకొద్దీ—నేను శారదను క్షమించానని ఆమె సంబరపడింది...ఆ సంబరంలో నన్ను ...ఇష్! అవన్నీ ఇక్కడ రాయకూడదు.

పెద్దలు వూరికే అన్నారా—'అంతా మనమంచికే' అని!

* * *

"మీ పేరేనా—శివరాం!" అనే పిలుపు విని, ఉలిక్కిపడి—రాస్తున్నకలం అవతల పెట్టి—ముఖంపైకెత్తి-ఎదురుగా చూశాను. పోస్టుజవాను చిరునవ్వుతో పలకరించాడు.

"అవును. నేనే! ఏమిటి విషయం?" అన్నాను.

"మీకు ఏదో కవరువచ్చిందండి!"—అని అతనన్నమాటలు నా చెవుల్లో సరిగా వినిపించలేదు. అతను మళ్ళీచెప్పి, ఇన్స్యూర్—కవర్ నా చేతికిచ్చి, అక్నాలెడ్జిమెంటులో నా చేవ్రాలు తీసుకు వెళ్ళిపోయాడు...

కవరు విప్పాను...అందులో ఒక వుత్తరమూ — మూడు వందరూపాయలనోట్లూ వున్నాయి...ఆ వుత్తరంలో—

"శ్రీ శివరాంగారికి— నేను జేబుదొంగని—కాని, లోకంయెరిగినవాణ్ణి!...అప్పటి పరిస్థితుల్ని బట్టి—మీసొమ్ము కాజేయవలసి వచ్చింది. 'పర్స్'తో పాటు—నాకు చిక్కింది! మీనుండి లభించిన సొమ్మువల్ల—నాకు గుర్రప్పందేలలో పదివేలు లాభించాయి. కాని, మీస్థితి మరిచిపోలేదు... మీ జీతపు మొత్తాన్ని కాజేయడంవల్ల—మీ సంసారం జీవితంలో కలిగే ఇబ్బంది ఊహించాను. అందుకే మీ సొమ్ము రెట్టింపుగా పంపుతున్నాను. మీ చిరునామా—మీ పర్సులోనే వుండిపోవడం మంచిదయింది. నేపంపిన సొమ్మును దయచేసి స్వీకరించండి. మీ జ్ఞాపకార్థం మీ 'పర్సు' నా దగ్గరే వుండడంలో అభ్యంతరం లేదనుకుంటాను. సెలవు—

జేబుదొంగ,
జయరాం."—

ఈ ఉత్తరం సాంతంచదివి,ఆశ్చర్యపోయాను; ఆనందించాను. జేబుదొంగల్లోగూడా నిజాయితీపరులున్నట్లు—నలుగురికవర్థా చెప్పాను.

కాని, నా శ్రీమతిదగ్గరమాత్రం చెప్పలేదు. ఎందుకో నాకు తెలీదు. అయితే—చీకటివెనక వెలుగు వస్తుందన్నట్లు—నష్టాలు లాభాలూ జీవితపు వెలుగు నీడలని—నా శ్రీమతికి అప్పుడప్పుడూ బుద్ధి చెప్పేవాడిని.

నెలరోజుల తర్వాత శ్రీమతిచేతుల్లో జత బంగారు గాజులు తళ తళ లాడాయి, మరి—నాకో!

తృప్తి! అర్ధాంగికి చేసిన అపచారానికి—ఆత్మశుద్ధిగా ప్రతిఫలం ముట్టచెప్పానే తృప్తి! ★



7

[గతవారం తరువాయి]

నీలి మునుసిగ్గు దొంతరలు రానురాను తెలతెల బోయిన మేఘాల్లా చెదిరిపోయినయ్. ఆ మనసులో ఆ చూపులో ఒక కొత్తదనం, ఆశ, అనురాగం కనిపించేవి. పుల్లయ్యని చూచి చిరునవ్వుతో చిందులు త్రొక్కేది.

మొగుడు మందహాసం చేసేవాడు. తలచి వచ్చిన మగని ఇల్లంతా మనుషులు వుండటానికి పనికివచ్చేటట్లు చెయ్యాలి. ఇంట్లో ఒక దాకా, ముంతా, బిందే ఏదీ సరిగ్గాలేదు. ఇప్పుడే యిలావుంటే పెళ్ళిముందెలా వుండేదో!

పెళ్ళానికి ఇంటి పనిపాట్లలో ఏదైనా సహాయం చేద్దామని వస్తే ఈ బలేచక్కని వాని చేతకానితనానికి నీలి చిన్ననవ్వు నవ్వి ముఖంలో వింత కాంతులు వెదజల్లేది.

పుల్లయ్య తన చేతకానితనాన్ని మరచిపోయి, చిగురించిన కోరికలతో నగవుతో మురిసిపోతున్న పెళ్ళాన్ని ఊర్రూగించేవాడు.

పుల్లయ్య శరీరపోషణపట్ల నీలి శ్రద్ధ తీసుకొంటూంది. పారే నీటిలో బుడకపెట్టి పుల్లయ్య ఒళ్ళు బాగా తోముకొని నీళ్ళు పోసుకొని ఇంటికి వస్తే పెళ్ళాం-గేరాగిర జాలకు నూనెరాసి చక్కగా దువ్వుతుంది... వేళకు తిండి, కంటికి నిద్ర మనసుకు హాయి కలుగుతున్నాయి.

ఈ రోజుల్లో ఇంటిపిల్లి అయిపోతున్నాడు. రోజూ ఒకసారి పొలం పోవటం, మిగతాకాల మంతా పెళ్ళాందగ్గర కూర్చోవటం. ఊళ్ళో తలోలా అనుకుంటున్నారు. నవ్వుకున్నారు-వేళాకోళం చేశారు. గరిడీకి రాలేదని చాలామంది విసుక్కుంటున్నారు. ఒకవేళ వెళ్ళినా ఎంతసేపో వుండేవాడు కాదు.

"కొత్త రబ్బసం. అందులోనూ ముదిరిపోనాక పెళ్లం వచ్చింది. బెల్లం కాకపోతాదా?" అంటున్నారు.

పుల్లయ్య గరిడీనించి వస్తూ ఈ మాటలు విన్నాడు. నలుగురూ పకపకనవ్వుతున్నారు. కోపంవచ్చింది. గబగబ వెళ్ళి గడపలో కూర్చుండిపోయాడు. పెళ్ళాం కులుకు పలుకుల్లోని తలపులేవో వలపులేవో అర్థం చేసుకోక ముఖం ముడుచుకున్నాడు.

పెళ్ళాం కంగించి కవ్వించింది. అలా కూర్చునే చేతులు త్రిప్పుతూ అన్నాడు: "నాను పెళ్ళొద్దంటే, సేసుకో అని వేళాకోళం సేసేవోరు. సేసుకొన్నానా? యిప్పుడూ యేళాకోళమే-నోరున్నాదని!"

నీలి చిన్ననవ్వు నవ్వి ఆ అమాయకమైన ముఖం వెలిగించి అన్నది: "అందుకేనా అలాగున్నావ్! ఆ లెందుకన్నారు? పతేవోడి వని అభిమానంతోటే అన్నారు. నవ్వుతాలు నవ్వుతాలుగా తీసుకోవాలి గానీ, మనలో లోటుంచుకుని...పంతాలు, కోపాలు తప్పగాదా?"

పుల్లయ్య మొగమెత్తి ఆ మెరిసే కళ్ళవేపు చూశాడు. ఇంకా ఆ చూపు తన పొరపాటును ఎత్తిపొడుస్తున్నట్లనిపించింది. తన పంతాలు ఎలాంటివో శోభనంనాటిరాత్రే తెలిసిపోయింది. ఆమెకంటె తను గొప్పవాడినని అనుకోలేకపోతున్నాడు. ఏదో భయం, భక్తి, అభిమానం, అనురాగం...చివరకు గర్వం, తన మనసులో గిరగిరలాడి పోతున్నాయి!"

దీపావళి దాటింది; వచ్చింది నాగులచవితి. ఊరంతా సందడిగావున్నది. రోడ్డుపక్కన పుట్టలోపోసిన పాలు బాగా ఇంకిపోయాయి. నాగన్న నోటిలో గుడ్లుపడ్డాయి. మధ్యమధ్య టపాకాయల సందడి...ముగ్గూ పసుపూ పుట్టను కప్పివేశాయి.

ఇంటికి వచ్చారు. ముసలమ్మ మనవరాలుకు కొడుకుపుట్టే నాగరాజని పేరుపెట్టానని మొక్కుకుంది. పుల్లయ్య విన్నాడు-భగ్గుమన్నాడు. "నా కొడుకు పేరా? మా అయ్య

పుట్టుకొస్తాడు. మా అయ్య మీసాలు తిప్పిన నాయుడు? నా కొడుకూ అలాంటోడే అవ్వాలి. ఆడు బుసకొట్టే నాగన్న కొడు."

"తప్పు తప్పు" అంది ముసలమ్మ.

"తప్పూ లేదూ గిప్పూ లేదూ. నా కొడుకు పేరు మల్లునాయుడే."

ఇంకా ముసలమ్మకీ, పుల్లయ్యకీ వాదన సాగుతోంది. పకపకా నవ్వుతూ నీలి పక్కకొచ్చింది.

"చెట్టున కాయే కాయంది...ఎందుకలా అయిపోతారు? రెండు పేరు పెట్టుకుందురు గాని...పేరుల్లో యేవుంది?"

"లేదూ? మా అయ్య పేరు పెట్టకపోతే పచ్చి పరాన ఉన్న మా అయ్యకు కోపం రాదా?"

"వస్తాది! ముమ్మాటికీ వస్తాది..." అంటూ ఏదో కొత్త నోరు కలిసింది.

"ముద్దోడా నిజం సెప్పావురా!" అని పుల్లయ్య అంగటికి వెళ్లాడు.

"చేతిలో కర్ర—పొడుగుపాటి మనిషి. ఎముకలు కన్పిస్తున్నా, ఒకప్పుడు బలంగా వుండేవాడని చెప్పొచ్చు. పుల్లయ్య ఇంకా వాడితో మాటాడుతూంటే, నీలి అప్పుడే వాకిట విస్తరాకు వేసింది. గుడ్డివెంకన్న "కన్నోరింటిలో పేదాగోదాకి గంజిపోసి రచ్చించావు. నీ యింట్లోనే అన్నం పెట్టున్నావు తల్లీ! ఏదైనా మనిషి మిగల్డు గానీ, మాట మిగిలిపోతుంది!"

భోంచేస్తూంటే ఇంకో ముసలిగొంతుక: "యెంకడి పని పండింది—అదృష్టం—".

"ఏవే ముండా! నీ లోబం కాలా... వడ్డింగినా, నీలో నలుసు సావనేదు—." అందుకున్నాడు గుడ్డివెంకన్న!

"ఊరుకో! రా...గన్నెమ్మ!...నువ్వు యీ ప్రక్కన కూర్చో." నీలి యింకో విస్తరి వేసింది.

ఇలా యిచ్చేయి తల్లీ! ఒకపూటే యింత మెక్కి బదులు రెండు పూటలకు సర్దుకుంటాను..."

"గంపెడుడబ్బు, గుంపెడుభూమీ—ఉంచుకొని, కాకికి సెయ్యి దులపకుండా, నివ్వు తినకుండా బతికినావు,—ఏం ఆయ్యావే? తినేముండా! తిన్నదే దక్కింది," అందుకున్నాడు గుడ్డివెంకన్న.

గన్నెమ్మ అన్నం మూటకట్టుకుని వెళ్లిపోయింది.

గుడ్డివెంకన్న తింటూనే మాటలు లంకించుకున్నాడు.

"ఓరీ నాయనా! పుల్లయ్యా! గుర్రానికి బారెడు తోక ఉంటాది—రెయ్యికి జానెడు మీసం వుంటాది—నాభం? ఈ మనుషులకీ ఎందుకొచ్చిన గర్వాలురా? ఆడున్నాడే ఆ రాజిగాడు—ఇంకా నామీద కసితీరనేలేదు—మూస్తున్నాను ... సింహం ఉందే...ముసలైనా...జబ్బుదైనా ... గడ్డిపరకలు మేస్తాదిరా? గొడ్డు కనిపిస్తే గుడ్డిదాతాదిరా?"

"పో పోరా! దొంగ నాయాలా! కళ్ళు పోకపోతే...నివ్వా! ఈ చుట్టుపట్ల వూళ్ళు తగలెట్టేద్దువు!"

"నాయనా! గొడ్డు గోతిలో పడితే తలో కమాటంటారు లే!"

"నువ్వా! కళ్లులేని సింహానివి—కోరలు తీసిన పామువి — యెదవ...కుటుంబాలనే కాల్చేశావు నీ పొగరుతోని! ఎలాంటోడికి అలాంటి గతే పట్టాదిలే..." పుల్లయ్య కోపంగా అంటూ లేచిపోయాడు.

నీలి చప్పున అందుకుంది. "తిండిపెట్టి తిట్టావా! తప్పు తప్పు!" వెంకన్న దగ్గరగా వెళ్ళి, "నీతో సరసం ఆడుతున్నాడు. ఏం అనుకోకయ్యా!"

ముసలాడు నవ్వాడు. "తల్లీ! ఆ రోజుల్లో నేనొక పులిని...నన్ను మరపించేడు గరిడీలో పుల్లయ్య. అయితే నాను పెజల్లో చెడ్డోడి నయ్యాను. నీ మొగుడు సెభాష్ అనిపించుకున్నాడు. కలకాలం నీ పసుపు కుంకుమతో నీ ధర్మం కొసి, ఇద్దరూ హాయిగా బతుకుతారమ్మా?"

"పో పోరా! నీ దీవెన లెవరికొక్కవాల? దొంగోడా?' పుల్లయ్య అందుకున్నాడు.

"నువ్వు పెలమోడివి...నాను గొల్లోడిని."

"జాతు లెందుకు తెస్తావయ్యా! ఆకాశం క్రింద ఉన్నాలంతా ఒకటే జాతి," అంది నీలి చప్పున.

"మాతల్లి! సల్లని సిందురిడి నాగ నీశాంతమే నీ మొగుడి కోపాన్ని మాయంసేస్తాది......" అంటూ లేచి, కర్ర తడుముకుని వెళ్ళిపోతూ; "అమ్మా!" అన్నాడు. గొంతుక గుర గురలాడిపోయింది. కళ్ళు గుడ్డివైతే నీళ్ళెందుకుండవ్...పరిస్థితి అర్థం చేసుకున్న నీలి ముందుకు నడిచింది. నడుస్తూనే వెంకన్న అన్నాడు. "అసలు సంగతి యీనాటికీ యెవరికీ తెలీదమ్మా......?" ఉధృతంగా యేడుపు వచ్చేసింది. "ఏడవకయ్యా! మన చేతిలో యేవీ లేదు. నరులకి తెలియకపోయినా దేముడికి అందరి మంచి చెడ్డలూ తెలుస్తాయ్..."

"నాకూతురా, సిన్నదానివైనా నిజం సెప్పావు!"

ప్రొద్దు ప్రక్కకు తిరిగింది. పసుపులు పూసుకున్న ముత్తైదువులు, ఆచారాన్ని బట్టి పొలాలకి జట్టులు జట్టులుగా బయలుదేరారు. పసుపువర్ణం దేరుతున్న చేలు, తల లూగిస్తూ పలుకరించాయి. గాలికి వంగుతున్న వెన్నులు చిన్న అలజడి శబ్దం చేస్తున్నయ్. కోతలు మొదలు పెట్టడానికి ఇంకెన్ని రోజులో లేవు. విరామం ఎరుగని పని రోజులు దగ్గరపడుతున్నయ్. వయసులోవున్న ముత్తైదువలు వేరే మాటలు ఆడుకున్నారు. వయసుమళ్ళిన వారు పంటనాణెం పరీక్షించుకున్నారు. పుట్టికి యెంత బియ్యం రాలుతుందో? తవుడు పసువులకి యెన్నిరోజులొస్తుందో—బుగతకి అంబారం చెల్లించగా ఎంత మిగులుతుందో మిగిలిన దానిలో కంబారి, యేరీజీ, చాకలి, మంగలికీ పోను మిగిలేదంతో...ఆమిగిలిందాంతో, యేడాదంతా యెలాగడపటమో—ఇలా రకరకాల అంచనాలు వేస్తున్నారు. విచారంతో తిరిగివచ్చినవాళ్ళూ ఉన్నారు.

నీలికూడా వెళ్ళివచ్చింది. ఆమె ఇలా ఏవీ అనుకోలేదు. ఒళ్ళు గట్టిగా ఉంటే రెక్కల కష్టంమీద బతకలేమా అన్నధీమా ఆమెది.

రాగానే పుల్లయ్య పెళ్లాన్ని "కాళ్ళ

★ దగాపడిన తమ్ముడు ★

కట్టలేదా?" అని అడిగాడు.

నీలి సమాధానంగా చిరునవ్వు నవ్వబోయింది. పుల్లయ్య ముఖంలో ఏదో ద్వేషం స్ఫుటంగా కనిపించటంతో నీలి దగ్గరగా జరిగి, "చెప్పు ఎందు కలావున్నావు?" అని అడిగింది.

పుల్లయ్య ఎగిరిపడ్డాడు. "ఆ పాపిష్టాడికి ఆ పాపిష్టి ముండకీ, తిండిపెట్టి నీ కడుపు మాడ్చుకోమని ఎవరు చెప్పారో నీకు?"

"ఎవరు పాపిష్టోలు?" అంది నీలి నవ్వుతూ.

"కారూ? అది డబ్బు ముకం సూసి మొగుణ్ణి సంపింది. ఆడు దొంగయెదవ..."

"అంతేనా?" నీలి మందహాసం చేసి మొగుడి నడుమును చేతులతో చుట్టివేసి: "సూడు!" అంది.

"ఏం సూస్తాను? ఆడికి కళ్ళుపోయినా పౌరుషం చావదు. దానిని నడ్డివంగినా మమకారంపోదు!"

"మనకి లేదా? అందరు మనుషులూ ఒకలానే వుంటారా? నీ కాళ్ళలాగ నీ సేతులున్నాయా? అన్నీ కాళ్ళయితే మనిషి బతకగలడా? నువ్వు యెందుకూరికే ఒకరిని చూసి అసహ్యపడతావు? అసహ్యపడితే అయినన్న తక్కువంటారు...సూడు!?

పుల్లయ్య ముఖం భార్యవైపు తిప్పాడు. ఆమె ప్రశాంతంగా ముఖంతో మాటలు పలకబోస్తోంది... "సూతిలాగ సూరమ్మ వుండేది. చేదలాగ వెంకన్న తోడుకొనేవాడు. అది సచ్చాక...పాపం యేనుగలాంటి వాడు పీనుగయ్యాడా? గన్నమ్మ అంత బతుకు బతికింది...అన్న మోరామా అని అడుక్కుంటోందా? నీకు తెలీదు ... కడుపు సంవద్రం తెల్లారితే పరగడుపే— నాలిక దాటితే నరకం. మట్టికుండలో ఒండి చర్మంకుండలో పడేసుకోవటమే...చెయ్యి కింద ఉండటంకంటే మీద వుండటం అదృష్టం కాదా?...అలాగ అయిపోకు!"

పుల్లయ్య వెంటనేమాట్లాడలేకపోయాడు. నీలి మొగుణ్ణి అదిమి పట్టుకుంది. పుల్లయ్య మనసు రానురాను పెళ్ళం మాటలు తలపుకు రాగా వెన్నలా కరగజొచ్చింది. ఆమెను గట్టిగా బాహువుల్లో బంధించబోయాడు. ఇంతలో ఆమె మెల్లగా మాటాడుతోంది. "మామమ్మ సెప్పింది— ఎగిరిన దూది గాలిలో, యెంతసేపో వుండదని నువ్వు అలాగ వూరికినే యెగిరిపోకు. నీ కాలికి దెబ్బ తగిలితే నీ సెయ్యి వూరుకుంటుందా? అలాగే మన సుట్టుపట్ల ఉన్నోళ్ళు ఆకలని యేడుస్తూంటే వూరుకోమంటావా? సెప్పు?"...

ఆమె భర్తను మరీ గట్టిగా అదిమిపట్టి ప్రశ్నించింది: పుల్లయ్య శరీరమంతా గగుర్పాటు జెంది జవాబియ్యలేక ఆమెతలను తన వక్షానికి అదిమిపట్టాడు. కళ్ళల్లో నీరు వూరినట్లుకాగా అభిమానం అంతా మౌనంగా ఆమెపై ప్రసరింపచేశాడు. నీళ్ళు నిండిన యిద్దరికళ్ళూ ఏకమైనాయ్!

8

గుడ్డి వెంకన్న అసలు పేరు వెంకయ్య. చిన్నప్పుడే తండ్రి పోతే, తల్లి కొడుకుని కన్నవారింట్లో వదిలి, ఇంకో మనువుకి వెళ్ళిపోయింది. మారుమనువుకి వెళ్ళి మరేం సుఖపడలేదు. త్రాగుబోతు మొగుడి తన్నులకి ఒళ్ళు చితికిపోయింది. విచారంతో యెన్నాళ్ళో వుండలేదు. కొడుకు లేబ్రాయంలోనే లోకం విడిచిపెట్టింది. వెంకన్న తాతకి పెద మేకలమంద ఉండేది. చిన్నప్పుడే తాతని నానా తిప్పలూ పెట్టేవాడు. మందలో కొత్తగా పుట్టిన మేకపిల్లల్లో మూడోవంతైనా మాయమౌతూండేవి. పిల్లల్ని సగానికి సగంధరకి అమ్మేవాడు వెంకన్న. ఆరాత్రే కొన్నవాళ్ళదగ్గరనుంచి ఆ పిల్ల సాధారణంగా మాయమైపోయేది. అమ్మిన డబ్బులో పదోవంతైనా తను పేదారోదా అనుకొనేవాళ్ళకు చేరేది. "మీసాలు సరిగ్గా మొలవకుండానే ఇలా చేస్తున్నాడు కదా - ఇంకా పెద్దయితే వీడిని పట్టలేం - బిడ్డయినా, గొడ్డయినా, పుట్టాక విడిచి పెట్టామా? ఆడపిల్ల అయ్యుంటే- ఒక బిడదు తీసేసును అల్లుడు—ఎంతైనా మొగోడు— మారెడు గుడ్డ, ముద్దెడు అన్నం తెచ్చుకోలేడా?" అని తాత తిమాయించుకునేవాడు.

యౌవనం ఉబుక్కొని వచ్చింది. కండలు తిరిగిన జవాను. రాళ్ళతో కుస్తీలు పట్టి చెట్లని పీకేసే బలం. అందమైన ముఖం! దొంగవెధవైనా బీదా బిక్కి అంటే వెన్నలా అయిపోతాడని, తాతకు మనుమడంటే లోలోపల గర్వం ఉండేది. గరిడీలో ఘటికుడయ్యాడు. మీసాలు తిప్పి తొడ చరిచే అహంభావం వచ్చింది. మేనమామ వీడితో పడలేక ఆస్తి పంచుకొని వేరే వెళ్ళిపోయాడు. మిగిలిన కొద్ది మేకలతో మంద సాగలేదు. ముసలాడు మనవణ్ణి తిడుతూనే గంజిపోసేవాడు. కానీ ఒకోసారి తల్లీతండ్రీ లేనోడని ఏడ్చేసేవాడు. వెంకన్నకు మాత్రం ఆ విచారం ఒకనాడూ లేదు. అసలు విచారం అంటే ఏంటో ఎరగడు. తాతయ్య చచ్చిపోయినప్పుడు మాత్రం ఏడ్చాడు. ఆమరుచటిరోజువరకు ఆకలి వెయ్యలేదు. ఆకలివేసేసరికి, "తాతా గంజిపోసేరా!" అన్నాడు అప్రయత్నంగా! కానీ మళ్ళీ ఆయింట్లో వుండలేక వీధిలో పడ్డాడు. ఎవరూ తనను సరిగ్గా పలకరించరు. అందరూ దూరాన్నవున్న తన్ను చూసి ఇళ్లలోకి వెళ్ళిపోతున్నారు. పిల్లలు కూడా తనని చూసి భయపడుతున్నారు. వీధికుక్కలూ పక్కకు వెళ్ళిపోతున్నాయ్!

ఒక్కసారి తనెంత చెడ్డవాడినా అనుకున్నాడు. దొంగతనాలు చేశాడు! నలుగురినీ భయపెట్టాడు—తిట్టాడు—కొట్టాడు. డబ్బులేనప్పుడు దారికాసాడు. మర్యాదగా అడిగి ఉన్నదంతా పుచ్చుకొనేవాడు- ఇవ్వనివాళ్ళ వీపులు చితక్కొట్టేవాడు. అయితే ఇదంతా తను యెలా చెయ్యగలిగాననుకున్నాడు. తనాక బంగారుపళ్లెం— గోడలా తాత అండవుండేది.—అది యిప్పుడు లేదు—అంచేత కామోసు— తనకేమి విలువలేదు?

తను చెడవాడవ్వాలి! విధిలేదు. మందలేదు—మసానులేదు. తిండిలేదు. డబ్బులేదు. గిబ్బులేదు! ఈ లోకంలో తనకు తనే! ఏడ్చినా ఏడ్వాలి. తనెందుకేడ్వాలి. తను కష్టపడడం నేర్చుకోలేదు—"సరే వచ్చేదేదో వచ్చింది-జీడిమరక పోతాదా? కానీ—యీ పెజల్లో సెడ్డాడిని అయ్యే అయ్యాను—అలాగే వుంటాను—మనిషి ఛసే మాటమిగుల్తాది.—యెద్దు ఛస్తే యెముక మిగుల్తాది—ఈ సుట్టుపట్ల నాను సచ్చినా రావణాసురిడిలాగ నాపేరు ఉండిపోనీ—" నడుస్తూనే అనుకున్నాడు వెంకన్న.

మాతాత యెంత మంచోడనీ యిదే తొలిసారి అనుకోవటం! దుఃఖం ముంచుకు వచ్చేసింది. కాని కళ్లల్లో నీరురాలేదు. ముందుకు సాగలేక ఎదురుగా ఉన్న సూరయ్య ఇంటి అరుగుమీద కూర్చుండిపోయి నేలవేపు చూస్తున్నాడు. తాత కనిపిస్తున్నాడు— తనవేపు చూసి యేడుస్తున్నట్లనిపించింది- ఏకాకి తను!

సూరయ్య ఇల్లు పెద్దదే. పదెకరాల పల్లపుభూమి. చక్కనైన చుక్కలా ఒకే ఒక కూతురు సూరమ్మ. సూరమ్మకు అందానికి తగ్గ మాటలతీరువుంది. వయసు వచ్చినా తండ్రి మమకారంచేత ఇంకా ఇంకా పెళ్ళి చెయ్యలేదు. ఏదో ఇల్లరికం అల్లుడికోసం తాపత్రయ పడుతున్నాడు.

వెంకన్న వేపు చూసి "పాపం!" అంది. వెంకన్న వినిపించుకోలేదు "కడుపు అంటుకపోయింది అన్నం పెట్టేదా?" నగరొక్కన కోయిల గొంతుకలావుంది. ముఖం పక్కకు తిప్పాడు. అమందహాసం చేస్తున్న ముద్దు మోము చూడగానే, తనలో సంతోషం గెంతులు వేసుకవచ్చింది. అంతలో కల్లోల గౌతమి పొంగిపారింది.

నూరమ్మతల్లి లోనుంచే కేక వేసింది. ఓలమ్మో! కుక్కనోట్లో కర్రెట్టకే—భౌ భౌ మంటాది!"

తనుకుక్కా! తనకా విశ్వాసం ఎక్కడుంది? మళ్ళీ తనను యీ రైతు భార్య అవమాన పరిచిందనుకున్నాడు. పుట్టెడు అప్పైనా కొరియిచ్చుకొని పిప్పికూట లెవడు పడ్డాడు! నాలాంటి మనిషి అర్థితోడు. వాడిలాంటి మనిషి నాను—"

"ఏవమ్మోతల్లి! ఏవన్నావ్" అని లేచాడు.

వెంకన్న వైఖరి చూసి ఆమె ముఖంలో లేని నవ్వు తెచ్చుకొని "ముసలోడు యెంత మంచోడు వెంకన్నా!"

వెంకన్నమనసు మళ్ళీ తాతవైపు తిరిగి పోయింది.

"అవునమ్మా! ఆడు బతికున్నాళ్ళు నానా హింసలు పెట్టాను. నానుంచి ఆడు ఊరంతా పెద్దయి పోయినాడు."

వెంకన్న వస్తున్న యేడుపును ఆపుకోవటంలో మరి మాటాడలేక పోయాడు. ఇంతలో పెరటి వరండాలో వడ్డించి నూరమ్మ రమ్మంది. తల్లి మాటాడలేదు. వెంకన్న వద్దని వెళ్ళిపోబోతూంటే ఆమె తన కళ్ళల్లోకి నిదానించి చూసింది. తొలిసారి తనజీవితంలో నరాలు పొంగి కంపించినయ్.

కాలు కదిపినా ముందుకు పోలేదు. ఆమెలోని యేదో మహత్తరశక్తి తనను కట్టేసి ఆమె వేపే లాగుకుంటోంది. మళ్ళీ ముఖం తిప్పాడు. ఆమెతనను గెలుచుకున్నట్లు చిరునగవు విసరింది. ఆమెయేమీ అనలేదు. ఇంకా అలానే నిల్చుంది. వెంకన్న యెదురీత యీదలేకపోయాడు. వెళ్ళి విస్తరిముందు కూర్చున్నాడు. పశువులసాలకు తల్లి వెళ్ళింది. ఎదురుగా నిల్చున్న నూరమ్మవేపుకు చూడటానికి సిగ్గువేసింది. అసలు తినడానికే సిగ్గువేసింది. ఒక్కసారైనా తలెత్తకుండా వుండలేకపోయాడు! తన కండల్ని, శరీర పొందికను చూసి మురిసిపోతూందని తెలుసుకున్నాడు."

భీమబలుడు—యౌవనం బలిసిన ఆడది చూసి చలించిపోయింది. అంతే. ఒకేమాట అంది, "నువ్వెంత మంచోడివి!"

వెంకన్న ఆమాట విని అదిరిపోయాడు. ఈ లోకంలో తనని మంచోడని అన్నవాళ్లున్నారే! కూటికిలేని పేద తనొక్కడే? సిరిగల ఇంటి యీ చక్కనిచుక్క రొక్కడే?

నోటిలోనికి ముద్ద పోక్క లేదు. ముఖం కొద్దిగా మీదికి లేచింది. తొరగా చూశాడు. జవ్వని నరాల బిగువుతో నాట్యం ఆడినట్లుంది.

ఒళ్ళు పులకరించింది. ఎటుచూసినా— అందం...ఆనందం! ఆమె ఒళ్ళంతా అందమే...చప్పున లేచి ఏదో చేసేద్దామనుకున్నాడు. లేచిపోయాడు.

"నూరీ! నాయంత సెడ్డోడు ఎవ్వడూ లేడూ?"

అకే వెళ్ళిపోవటం...తిరిగి చూడలేదు. తనలో పెనుగాలి వీచింది...ఎప్పటికీ అణగారలేదు.

గూడులేని పిట్టలా తిరిగాడు. నూరమ్మ కబురుపెట్టింది. ఎందుకో భయం వేసింది. డబ్బు పంపించింది. అందుకున్నాడు. మళ్ళీ "ఆడదానిడబ్బు నాకొద్దు" అని ఇచ్చేశాడు. ఎక్కడికి వెళ్లిపోయాడో యేంటో మూడు పక్షాలు దాటేవరకూ ఎవరికీ కనపడలేదు.

తిరిగి గౌరీపున్నమనాటికి వచ్చాడు. ఆకా

(41- వ పేజీ చూడండి)



'కలువ నెలరాజు గలసె'

చిత్రకారుడు: జి. రామమోహన్, సికింద్రాబాద్.

లతాబంధము

ఎం. ఎస్. ప్రకాశరావు

సుందరరావు తండ్రి అగ్నిహోత్రంలాంటి మనిషి. రవంత ఆచారము, అంతకన్న ఎక్కువ ఛాందసమూ, యీ రెంటినిమించిన ముక్కోపమూ ఆయన స్వభావంలో కొట్టొచ్చినట్లు కనబడతాయి. ఆయనకి సంప్రదాయాలు, పూర్వాచారాల మీద ధృడమయిన విశ్వాసం వుంది. అది సాధారణంగా అచంచలమయినది. ఒకవేళ ఖర్మంజాలక ఆయన వేటిపయినయినా తన అభిప్రాయం మార్చుకున్నాడో, అది ఆయన ఛాందసంలాగే ప్రమాద హేతువే నన్న విషయం గ్రహించడానికి సుందరరావు కాసే కాలం పట్టలేదు. ఎందుకంటే 'ఆడదానికి, నా మొహం చదువెందుకయ్యా' అని ఆయన చాలా కాలం బల్లగుద్ది వాదించడమే కాకుండా, అలా చదివించిన తండ్రులను దారుణంగా ఎద్దేవా చేయడం అతనికి తెలుసు.

అటువంటి వ్యక్తి ఒకసారి వో స్నేహితుని ఇంటికి వెళ్ళడం జరిగింది. ఆ యింటి కోడలు పల్లెటూరి మనిషి; తలుపుతీసి పరాయి మగవాడిని చూచి, ఖంగారు పడిపోయి, భడీల్న ఆయనముఖంమీద నే తలుపు వేసేసి "స్నానం చేస్తున్నారు. ఆలా అరుగు మీద కూర్చోండి" అని లోపలినుంచే చెప్పిపోయింది.

ఆనాటినుంచీ చదువురాని ఆడదంటే ఆయనకి అగ్రహం వచ్చి, "మాకోడలు చదువుకున్నదే కావాలి" అని పట్టుబట్టి, వలుగురితోనూ చకచకా "కీన్ కీన్" అని ఇంగ్లీషులో కూడా మాట్లాడే లతని చూసి ముచ్చటపడిపోయి, "ఏమంటావురా అబ్బీ?" అని సుందరాన్ని అడిగేశారు. ఏ కళ నున్నాడో ఏమో 'ఊ' అనేశాడతను. ఆతరువాతే తాను చేసిన పొరబాటు తెలుసుకుని చాలా గాభరా పడిపోయి వేళ్లు కొరికేసుకున్నాడు. అతనికి లత అంటే కోపమేమీ లేదు. అసలు యీ పెళ్లనేగొడవంటేనే భయం. పెళ్లంటే సంసారం. సంసార మంటే ఆదివారం ప్రొద్దున్నే సుబ్బయ్య కొట్లో కందిపప్పు బేరం చెయ్యడమన్నమాట, ఏవో పుస్తకాలు చదువుకుంటూ మీన మేషాలు లెక్కబెట్టే తనలాంటి పడకకుర్చీ రాయుడికీ బెడదంతా ఏమిటి? ఒకసారి వొప్పుకున్నాక కాదంటే తండ్రి తంతాడేమోనని భయం. అంటే ఆయన నిజంగా నడిమీద దుడ్డు బజాయిస్తాడని కాదు. నిజానికాయన వాక్ప్రహారాలకంటే దుడ్డుప్రహారమే చాలానయం. అంచేతనే ఏంచేయాలో తెలియక గిలగిలలాడేడు సుందరం. ఏం చేయడానికి తోచక అలా లైబ్రరీ కేసి వెళ్ళాడు ఒకనాడు.

అక్కడ అతనికి నచ్చిన పుస్తక మొక్కటిలేదు. ఏమూల చూసినా శరత్ పుస్తకాలే. చివరికి శరత్ కథల పుస్తకమొకటి తీశాడు. రెండు పుటలు చదివాడో లేదో "అరే, మీకూ శరత్ పుస్తకాలంటే ఇష్టం లాగుందే?" అంటూ వచ్చింది లత. పెళ్ళి కాని పిల్ల తాను పెళ్ళి చేసుకోబోయే కుర్రవానితో ఆవిధంగా మాట్లాడేసేయడం ఆచారాలకీ, సంప్రదాయాలకి విరుద్ధంగా అనిపించింది సుందరానికి. అయితే ఆ మాట పైకనలేదతను.

"ఆఁ ఏమన్నారూ? అవును అవును శరత్! ఇదిగో ఇది శరత్ పుస్తకమే. నేను కొదిగా చదివాను" ఛస్! తనంత నీళ్లెందుకు కారిపోయాడో అతని కర్థం కాలేదు.

"ఏమేమిటి? శ్రీకాంత్?"

"ఉహూఁ"

"పోనీ శేష ప్రశ్న?"

"అబ్బే లేదు"

"దేవదాసు? విప్రదాసు?" వో అరడజను పేర్లు చెప్పిందామె. అవి అతను వినలేదు కూడాను.

"అబ్బెబ్బే, ఆవేవీ చదవలేదు"

"మరిమీరు చదివిందేమిటి?" ఆఖరున 'నా మొహం' అనడం కొద్దిలో తప్పించుకుంది.

"పరిణీత...ఇంకా...ప్చ్...పేరు జ్ఞాపకం లేదు." వాడెవడో తండ్రి పోయాక యాత్రలకని కాశీవెళ్లి అక్కడ వో అమ్మాయిని పెళ్ళి చేసుకుని వస్తాడు. తీరా ఆ అమ్మాయి కులట కూతురని తెలిశాక___"

"సరే, సరే సరయూ. మరి మీరు సాధారణంగా చదివే పుస్తకాలు ఏమిటి?"

'టట్! టట్! క్రాస్ ఎగ్జామినేషను మొదలు పెట్టింది లాయరు విశాలాక్షి లాగ' అని చాలా విసుక్కున్నాడు.

"వుడ్ హౌస్" అని సమాధానం ఇచ్చాడు.

"హో!" అని వూరుకుంది లత.

"అగాతా క్రిస్టీ" అన్నాడతి వుత్సాహంగా.

"హ్హూఁ!" అంది లత.

అంతవరకు తనుచదివిన పుస్తకాల్ని తలుచుకుని మురిసిపోతున్న సుందరం ఆమె 'హూ!'ను విని ఖంగారుపడి చూశాడామె వేపు. ఆమె కుడిచేయి ఆ బల్లమీదున్న సిరాబుడ్డిపై వున్నది. ఏ నిమిషాన్నయినా అది కాస్తా తన నెత్తిమీద ధాంమంటుందేమోనని అరనిమిషం అనుమానించి కూర్చున్న కుర్చీలో కొద్దిగా తలవంచాడు ఎందుకయినా మంచిదని. అంతపని ఆమె చేయలేదు.

"మీరు శ్రీనివాసరావు నెరుగుదురా?" అని అడిగింది.

అనుకోకుండా యీ ప్రశ్న రావడంతో కుర్చీక్రింద అప్పుడే ఫిరంగేదో పేలినట్లు ఖంగారుపడి గాలిలోకి వో గెంతు వేశాడు.

"ఎరక్కపోవడమేమిటి? అతను నా ప్రాణస్నేహితుడు." కొంచెం తమాయించుకుని సమాధానం ఇచ్చాడు.

"అనుకున్నా. ఇకముందయినా అతని స్నేహం తగ్గించండి. అసహ్యమయిన అలవాట్లు అతనిదగ్గర చాలావున్నాయి." అని విసురుగా వెళ్లిపోయింది.

ఈ పద్ధతి అతని కెంతమాత్రమూ నచ్చలేదు. "మైగాడ్! కీట్సు, బైరన్, లేకపోతే ఏ కళాపూర్ణోదయమో చదవమని ఇంక వేధిస్తుందిలా వుంది!" అని గాభరాపడిపోయాడు. అందం, ప్రేమ, లాంటి అవకతవక విషయాలమీద వ్రాస్తో, అర్థాయుష్షులోనే 'హరీ' అన్న కీట్సు వ్రాతలు అతని కెప్పుడూ పచ్చాముదం త్రాగినట్లే వుండేవి. శ్రీనివాసరావు పినతల్లిలాంటిదే లత కూడాను. వాళ్ళకి ఎదురు చెప్పే ధైర్యం, ఇతరుల మాటలకేంగాని, తనకిమాత్రం లేదు. ఈ లత నే రెండేళ్లక్రితం శ్రీనివాసరావు మెడకి తగిలించాలని అతని పినతల్లి ప్రయత్నించింది.



ఆఖరు నిమిషంలో అదృష్ట వశాత్తూ తప్పించుకుని బైటపడ్డాడు శ్రీనివాసు. శ్రీనివాసరావులాంటి తెలివయినవాళ్లే యీమె బారి నుండి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూవుంటే తను వోపూల్ లాగ ఆబంధంలో చిక్కుకోడమేమిటి?

"హుఁ. ఆ శీనిగాడే సరయిన మనిషి. వాడినే అడగాలి సలహా," అని నిశ్చయించేసుకునిపట్నం ఉడాయించేశాడు, పెళ్ళికి శెలవుపెట్టి, తిరిగి వస్తానని వంక పెట్టి.

శీనిగాడే సరయినమనిషి అనుకోడంలో సుందరం పొరపాటేం చేయలేదు. ఎందుచేతనంటే లతసంగతి శ్రీనివాసుకి బాగా తెలుసు. ఎదుటివ్యక్తి ముడేసుకుని పోయేలాగ చూసే ఆమె చూపు వతను మరచిపోలేదు. "డామినీరింగ్ డేమ్" అని ఆమెకి పేరుపెట్టాడ తను. అందుకనే "లతకి వేరే సంబంధం నిశ్చయమయిందిట" అని అతని పినతల్లి. శేషమ్మగారువ్రాసేసరి కతనికి బ్రహ్మానందమయిపోయింది. శ్రీలత ఇకముందుసర్క్యులేషన్‌లో వుండబోదన్నవార్తకంటె శుభవార్త అతనికింకొకటిలేదు. "ఎవడో పూర్ ఫెలో !" అనుకున్నాడు. కాని ఆపూర్ ఫెలో యేవోకనా డమాంతంగా వచ్చేసి, "త్వమేవశరణం గచ్ఛామి" అని కాళ్లమీద పడేసరికి తెల్లబోయాడు శ్రీనివాసు.

"టట్ ! టట్ ! వెంకటసూర్య శ్రీరామచంద్రబాలా త్రిపుర సుందరరావూ! ఏమిటయ్యా ప్రమాదం?" అని ప్రశ్నించాడు.

"హుఁ! మా నాన్నచాదస్తం నాకి హనుమంతుడి తోకలాంటి పేరుపెట్టడంతో ఆగలేదు. ఇప్పుడు నేనో ప్రమాదంలో ఇరుక్కున్నాను,"

"నువ్వలా ఇరుక్కోడం దెప్పుడు?"

"అదివేరు. ఇప్పుడు మీ లతని నాకు కట్టబెట్టడానికి నిశ్చయించారు." సుందరరావు తన ముక్కుమీద వొకటిచ్చుకున్నా కూడా అంత ఖంగారుపడేవాడు కాదు శ్రీనివాసు.

★ లతాబంధము ★

పైగా సుందరం అంత తేలికగా 'మీ లత' అనటం అతనికి నచ్చలేదు. ఆ విషయంలో గట్టిగా సుందరాన్ని మందలించే వుండేవాడు కాని ప్రస్తుతాని కంతకంటె ముఖ్యమైన విషయా లుండటం వల్ల ఆ మందలింపుని వాయిదా వేశాడు. లతకింకో సంబంధం నిశ్చయ మయిందని పినతల్లి వ్రాస్తే తాను సంతోషించాడు. కాని ఆ ఫూల్ ఫెలో తన ప్రాణస్నేహితుడు సుందరమే అని తెలియగానే అతను బాధపడకుండా వుండలేకపోయాడు. నిజంగా సుందరం వయస్సు తన వయస్సు వొకటే అయినా, అతను సుందరాన్నెప్పుడూ చంటిపిల్లవాడిని సాకినట్లు సాకేవాడు. ఇప్పుడు కొంతకోపం కూడా వచ్చింది.

"ఛస్! నువ్వు వట్టి ఫూల్ ఫెలోయి! దీని కెలా అంగీకరించావు?"

"ఏదో లే అంతా అలా జరిగిపోయింది. విషయం తెలిసిందంటే—?"

"అన్నిటికీ అన్నీ అడ్డంకులూ చెబుతున్నావు. నాకు తోచిన మంచి సలహా చెప్పనా? నిక్షేపం లా ఆ అమ్మాయిని—"

"ఏమిటీ!" ఆతులా అల్లాడిపోయాడు సుందరరావు.



మీనత్రయము
చిత్రకారుడు: పి. నాగేశ్వరరావు—కోసూరు.

మా బాబువి కదూ! నన్నిందులోనుండి బైట పడేశావంటే నేను కొత్తగా కుట్టించుకున్న సూటు కాస్తా నీకిచ్చేస్తాను. ఇంపోర్టెడ్ గేబర్డీన్, చాకలెట్ కలర్" అని బతిమాలాడు సుందరం.

"దానికేముంది? అభిప్రాయం మార్చుకున్నట్లు మీ నాన్నకి వ్రాసేయ్"

"పూఫ్! ఇలాంటి చచ్చు సలహా ఇచ్చేవాడు లేకనే, నీదగ్గరకొచ్చింది? మా నాన్న సంగతి నీకు తెలియదేమో? ఆయనకి కోపం వస్తే కొడుకూ లేడూ, ఎవడూ లేడు. అందర్నీ ఒకలాగే కడిగేస్తాడు"

"పోనీ, నీ పెళ్ళి సమయానికి వో టెలిగ్రాం పంపిస్తా నీకు తక్షణం బయలు దేరి రావలసిందని"

"అల్సే అదీ లాభంలేదు. ఈ టెలిగ్రాం పద్ధతి స్టేల్ అయిపోయింది. పైగా మీ పిన్నికి

"అవును, ఆ అమ్మాయికి నీలాంటి మెతని వాడు భర్త అవుతేనే ఆ సంసారం ఏగొడవా లేకుండా వుంటుంది"

"అవునవును, 'ఎస్ డార్లింగ్, నో డార్లింగ్!' అంటూ వెనకాల పనస పాడుతూ ఉండచ్చు కూడాను. తన దాకా వస్తేనే కాని ఎవడికీ తెలియదుట. నువ్వెందుకు చేసుకోలేదా అమ్మాయిని? పైగా నేనీ పరిస్థితిలో పడడానికి సగం బాధ్యత నీదే."

"నాదా?"

"అవును ముమ్మాటికీ నీదే. రెండేండ్ల క్రితం నువ్వలా తప్పించుకుని రాకపోతే ఇప్పుడు నాకీపాట్లు వచ్చేవి కావు. రోజూ ఉదయం ఆరు గంటలకే సనసానోయ్ అంటూ ఆవిడ వొకవేళ సంగీతం ప్రారంభిస్తే నేను మాత్రం భరించగలననుకున్నావా?"

ఆమాట నిజమే ననిపించింది శ్రీని

వాసుకి. సుందరరావుని చూస్తే జాలి కూడా వేసిందతనికి. ఆరుగంటలకే ననవానోయ్ అని సంగీతం పాడటంలో తప్పలేదు. ఆ వెనుకనున్న కట్టుబాట్లే భరింపరానివి. తన పినతల్లిలాగా లతకూడా కొన్ని కట్టుబాట్లకి లోనయి, జీవితం ఒకవిధమయిన క్రమశిక్షణకి అలవాటు పడాలంటుంది. వాళ్లదృష్టిలో డిటెక్టివ్ పుస్తకాలు చదివేవాడు కూడా హంతకుడితో సమానం. డిటెక్టివ్ కథలు వ్రాయడంలోగాని, చదవడంలోగాని ఆదర్శమేమీ లేదు. అందుకనే డిటెక్టివ్ కథలు తను వ్రాస్తాడని 'నీ బ్రతుక్కి ఆదర్శమంటూ ఏం లేదేమిట్రా?' అని శేషమ్మగారు తరుచు ప్రశ్నించింది. ఆదర్శాలకీ ఆచరణలకీ మధ్య అఖాతం వుందని అతనికి తెలుసు. ఆచరణకి కాని ఆదర్శాలు అడుక్కు తినడానికా అని అతని అభిప్రాయం. అతనికున్న ఆదర్శమల్లా తనవల్ల సమాజానికి కాని, ఇతర వ్యక్తులకు కాని ఎటువంటి కష్టం కలుగకుండా వుండేచాలు. అందుకనే తన త్రోవని తాను ఏదో పుస్తకాలు కాలక్షేపానికి చదువుకుంటూ కూర్చుంటాడు. అది చూసి వట్టి బద్ధకస్తుడంటుంది పిన్ని. అందుకనే అందరినుండీ దూరంగా వచ్చేశాడు తాను. సుందరం కూడా తనలాంటివాడే. అతని ప్రమాదాన్ని సానుభూతితో ఆలోచించకుండా వుండలేకపోయాడు. కాని అతను దీనికి ముందు అంగీకరించేశాడు. ఆ లతచేతే 'నాకు పీడువద్దు మొర్రో' అనిపించాలి. ఆమెచేత మొర్రో అనిపించడం ఎంత ఆనందం కలిగించే విషయమయినా, అదెలా సాధ్యం?

"ప్చ్! నా బుర్రకి మించిన సమస్య నా నెత్తిన పెట్టావు," అని చివరికి నసిగాడు.

"అయితే మనస్నేహానికి తిలోదకాలు ఇచ్చుగోవలసిందే. ఆవిడ నన్ను నీతో స్నేహం చేయవద్దని శాసించింది."

"స్! నువ్వు నంబర్ వొన్ బద్దుద్దాయివి. ఆవిడతో నా సంగతి ఎందుకు చెప్పావ్?"

"ఇది బాగుంది. నేను చెప్పేదేమిటి? ఆవిడే అడిగేసింది. ఒకనాడు ఏమయిందనుకున్నావు—"

"టట్! టట్! నాకు నీకథలు వినే వోపిక లేదు."

"ఇది కథకాదు. జరిగిన విషయం. నువ్వడిగావు కనుక చెబుతున్నాను."

"అయితే అదేదో మూడుముక్కల్లో ముద్దుటగా చెప్పు; వెనకటికెవడో రామాయణమంతా 'కట్టె, కొట్టె, తెచ్చె' అని మూడు ముక్కల్లో చెప్పేసినట్లు."

"ఎవడో మాటలు రానివాడలా కూశాడు. నాకుమాత్రం చేతకాదు. అడ్డు చెప్పకవిను." శ్రీనివాసు అంతా విన్నాడు.

"హూఁ ఆమెకున్న రోగమే అది. మూడుముళ్ళూ ఇంకా పడకుండానే అప్పుడే పోలోమని సలహాలిచ్చెయ్యడం మొదలు పెట్టింది. 'అసహ్యమయిన అలవాట్లు అతనికి చాలా వున్నాయి'ట. అవు నవును తనకి చాలా తెలుసుకదూ? "హూఁ అని చిటపటలాడిపోయాడు శ్రీనివాసు' పొపులో ఆవగింజలాగ.

"ఛస్! ఈ ఆడవాళ్లంతా ఇంతే" అని తిరిగి వోసారి విసుక్కున్నాడు. కాని ఇంతలోనే అతనికి ఛటుక్కున గుర్తొచ్చింది. తనెంత విసుక్కున్నా సుందరం సమస్య ఇంకా పరిష్కారము కాకుండానే వుందని. ఈ సమయంలో కావలసింది పోపులో ఆవగింజ కాదు.

"ఆ అమ్మాయి 'హూఁ' అని ఎప్పుడు హుంకా చేసిందోయ్? వుడ్‌హౌస్ అన్నప్పుడా, అగాతాక్రిస్టీ అన్నప్పుడా?"

"అగాతాక్రిసి" అన్నాడు సుందరం.

"నీకు బాగా గుర్తుందా?"

"వో! బోల్డంత. కావాలంటే ఆవేళ సంఘటన తిరిగి మొదటినుంచి చెబుతాను."

"నో. థాంక్స్. నువ్వు కాస్త నోరు ముయ్యి" అన్నాడు శ్రీనివాసు.

హఠాత్తుగా కూర్చున్న కుర్చీలోంచి ఎగిరి గంతేశాడతను. ఆకతాయి కుర్రాళ్లు కుర్చీమీద వేసిన పల్లేరుముళ్లు చూసుగోకుండా, కూర్చున్న బడిపంతులు కూడా అంతగా ఎగిరి వుండడు. అంతటితో వూరుకోక 'యురేకా' అంటూ గంతులేశాడు.

"వాట్?" అన్నాడు సుందరం.

"యురేకా! యురేకా!!" రట్టించాడు శీను.

"ఆ ప్రేమేడితాల్ని అటుంచి అసలు సంగతికి రావయ్యా నన్ను చంపక."

"అయితే విను. మెరుపులాంటి ఆలోచన వచ్చేసింది. ఆ అమ్మాయికి డిటెక్టివ్ కథలంటే మహాకోపం. దూపిన్నికి అంతేలే. నేనా కథలు వ్రాస్తానని నాబుర్రని క్షౌరం చేయించినంత పనిచేసింది. అంచేత నీవొకడిటెక్టివ్ కథ వ్రాసేయ్. దాంట్లో అరడజను హత్యలూ, ఒకడజను కిడ్నేపింగులూ, ఇంకా భూతగృహాలూ, ప్రేతస్థలాలూ, మొదలయిన వాటితో భయానకంగా వుండాలి. షిఫాను చీరలు, గులాబిచెక్కిళ్ళూ, మనోరంజితాలూ మచ్చుకయినా కనబడకూడదు. తెలిసిందా? అది చూసి 'బాబోయ్, యీహంతకుడు నాకు వద్ద'ని లత సన్నాయిమేళాల్ని వెనుకకు పంపించేసి తాను పలాయనం పటిస్తుంది. ఏమంటావ్?" సగర్వంగా అడిగాడు శ్రీనివాసు.

ఒకనిమిషం అర్థంకాక వెర్రిగాచూశాడు సుందరం. తరువాత దాని మతలబు అతనికర్థమయింది.

"శీ—శీ—శీనూ!" అతికష్టం మీద మాట్లాడగలిగాడు సుందరం.

"శీనూ! నీ మేధస్సు అమోఘం!" అన్నాడు సంతోషంగా. కాని వెంటనే సందేహం వచ్చింది. "ఇది తప్పకుండా పనిచేస్తుందంటావా?"

"అందుకు సందేహమా?" ధైర్యం చెప్పాడు శీను.

"వెరీగుడ్. థేంక్స్ శీనూ! థేంక్స్! నువ్వన్నట్లే జరిగితే నేనీమధ్య కుట్టించుకున్న సూటు-ఇంపోర్టెడ్ గేబర్ డీన్, ఛాక్ లెట్ రంగు-నీకిచ్చేస్తాను" అంటూ అతిసంతోషంగా బైటకి పరిగెత్తాడు. అప్పుడేజైల్లోంచి బైటపడ్డ ఖైదీ కూడా అంత ఆనందంగా వుండడు.

"అమ్మయ్య, ఇప్పటికి దయింది" అని తృప్తిగా పడకకుర్చీలో కూలబడ్డాడు శ్రీనివాసులు. కాని ఇంతలోనే దూసుకుంటూ లోపలికి వచ్చేశాడు సుందరం.

"శీనూ! నువ్వు చెప్పిందంతా బాగుంది కాని నాకు వ్రాయడం చేతకాదే? వూఫ్! భయానకమయిన పెద్ద డిటెక్టివ్ కథ అటుంచి వట్టి...అనగా అనగా రాజు కథకూడా వ్రాయలేను. వీళ్ళు తిస్నారవ్వాలా బొడ్డూ! ఈ కథకులుగాళ్ళంతా ఎలా వ్రాయగల్రో! అందుకనే ఆజాతిలో నాకు తెలిసినవాళ్లందరికీ బట తలే."

అప్పుడప్పుడే అక్కడక్కడ నున్నబడుతూన్న తన తలని తడుముకున్నాడు శ్రీనివాసరావు.

ఛవ్! నువ్వొక పెద్ద—ఊఁ సరేలే. ఆ వ్రాసేదేదో నేనే వ్రాసేసి నీ పేర పంపించేస్తా పత్రికకి. వైవాహికములందు అబద్ధపుపనులు చేయవచ్చు."

"ఓ! థేంక్స్! నిజంగా, నేను కొత్తగా కుట్టించుకున్న సూటు—"

★ లతాబంధము ★

"—ఇంపోర్టెడ్ గేబర్డీన్, ఛాక్లెట్ రంగు. తీసిగెల్లి సముద్రంలోపారేయ్. నాకు మాత్రం వద్దు."

*　　*　　*

రెండురోజుల తరువాత గొప్ప డిటెక్టివ్ కథ నొకదాన్ని వ్రాసేశాడు శ్రీనివాసరావు. అందులో ఏ పేజిలోనయినాసరే అర్ధరాత్రి వొంటరిగా బైటకి వెడితే బుర్ర ధామ్మనాల్సిందే. అంతమంచికథ తన పేరులో కాకుండా ఆ సుందరం పేరులో ప్రచురించబడుతుందే అని బాధపడ్డాడతను. అది తనపేరిట పంపుకుంటే, ఆర్థర్ కానన్ డాయిల్, షెర్లాక్ హోమ్సులలాగ, తన పేరు, తన సతీషచంద్రుని పేరూ ఆ చంద్రార్కం భూమిమీద నిలిచిపోవూ? అయినా స్నేహితునికోసం తానీ త్యాగం చేయవలసిందే. తన మిత్రుడు దీనిని తన ముషి సూటుతో—ఎంత ఇంపోర్టెడ్ గేబర్డీనయితే నేం-పోల్చి వేయడం సద్బు లేదతనికి. బరువైన హృదయంతో కథని పంపించేశాడు. కొద్ది రోజులలో నే అది ప్రచురించబడింది. అది చదివిన తరువాత కొంతమంది సుందరంతో స్నేహం మానేశారు. ఆడవాళ్లు ఆమడదూరం పారిపోయేవారు. ఆ కథ యొక్క ప్రభావం అంత ఘోరంగావుంది. ఇదంతా చూసి సంతృప్తి చెందాడు శ్రీనివాసరావు. ఉండవలసిన విధంగా అట్మాస్ఫియర్ వుందని సంతోషించాడు. ఇక ఏ నిమిషానికయినా సుందరం తన సూటు పట్టుకుని తయారవుతాడని వూహించుకున్నాడు. అతని వూహకూడా అంత అబద్ధం కాలేదు. సుందరం వచ్చాడు. కాని సూటుమాత్రం తీసుకుని కాదు.

"శ్రీనివాసరావూ! నీ వ్యూహోన్నంతటినీ తునాతునకలు చేసేసిందా లత. అది అల్లాటప్పయ్య లత కాదోయ్. మహా గట్టి లత. నా పీకకి వురపడిందా లత," అని వలవల వాపోయాడు.

"టట్! టట్! నాన్సెన్సు. నీలాంటి హంతకుడిని—"

"ఇదిగో యీ వుత్తరం చదువుకో ఆమె వ్రాసింది-" అంటూ వో వుత్తరాన్ని శ్రీనివాసుమీద పడేశాడు.

ఉభయ కుశలోపరులూ, ఉపోద్ఘాతాలూ అయాక ఆ వుత్తరంలో:

"మీరు వ్రాసిన కథ చదివాను. అది మీరు వ్రాసిందే అయితే చాలా విచారించాల్సిందే. అయినా, ఆ వ్రాత, అది చూస్తే శ్రీనివాసరావు వ్రాసి, శేషమ్మగారికి భయపడి మీపేర పెట్టినట్లు కనబడుతోంది. అతని మోరల్సు అంతవరకే. పైగా సతీష చంద్రుడు అతని డిటెక్టివ్ అని విన్నాను. అలా కాక అది మీరే వ్రాసినా అంత ఫరవాలేదు. వ్రాయడం చేత నవడం ప్రధానం. కథావస్తువు తరువాత చూసుగోవచ్చు..."

"భేష్! సైతాను నయినా సరే, పొగడవలసిన చోట పొగిడి తీరాల్సిందే. సతీషచంద్రుని పేరునిబట్టి అది నే వ్రాశానని పసిగట్టేసింది. గొప్ప పరిశోధన." మెచ్చుకున్నాడు శ్రీనివాసు, తన మోరల్సుగురించి ప్రస్తావించిన విషయం విస్మరించి.

"అందులో పొగడవలసినదేమీ నాకు కనబడటంలేదు. ఏం వ్రాసిందో చూశావుగా? తాను వచ్చాక నా పీలక పుచ్చుకుని, అమ్మాయి, అబ్బాయి కథలు వ్రాయిస్తుందిట.

"దాంట్లో భయపడవలసిందేమీ లేదే? నీకు కథలు వ్రాయడం రాదుగా? ఇంక నీ పిలక పట్టుకుని ఏం చేస్తుందావిడ?"

"అబ్బబ్బ! పిలక నేది పట్టుకున్నాక, ఒక్క కథలు వ్రాయడమేనా, వుంటా? మన కిష్టంలేనివి వందపనులు చేయమనవచ్చు. దెబ్బలాట నేనూ ఆడగల్ను. కావాలంటే ఆవిడ పిలక నేనూపట్టుగోగల్ను. కాని ఇంట్లో రోజూ యీ ప్రహసనాలు ఆడి ఇరుగుపొరుగు వాళ్ళకి టికట్టు లేకుండా వినోదం కలిగించడం నాకిష్టంలేదు. అందుచేత నే మన పిలకపట్టుగోడానికి ఆమె కన్ని కారణాలున్నప్పుడు ఆ పిలకని ఆమె కెందుకందివ్వాలీ అంట?" కుతకుత వుడికి పోయాడు సుందరం.

"అయినా పెళ్ళి కాకుండానే ఇంత బరితెగించి నీకు వుత్తరాలు వ్రాస్తోందని మీ నాన్నకి తెలియజెయ్యి."

"ఈ సంగతాయనకి తెలుసు. కోపగించి జంధ్యం తెంపుగోడానికి మారుగా ఆయన ఘొల్లున నవ్వారు. ఆడపిల్ల అంటే అలా వుండాలిట! షైఫుక్!"

"మా పిన్నీ అచ్చంగా అలా నే అంటుంది. మత సంప్రదాయాలు కాపాడ

(30-వ పేజీ చూడండి)

చెపుతా...చెపుతా...

(నాటిక)

సీతారామయ్య: చెపుతా...చెపుతా...

పున్నమ్మ: చెపుతా, చెపుతా అని చెప్పడంతప్ప చెప్పవలసినదిమాత్రం చెప్పరు...

సీతా: చెపుతా...

పున్న: ఏం చెపుతారో...ముందు కాస్త నాకు చెప్పండి...

సీతా: చెపుతా నని చెప్పానుగా...

పున్న: నిజంగా నేనా?

సీతా: ఆ...అయినా ఏమిటంటా తొందర ఇప్పుడు?

పున్న: ఏమిటా తొందరని తాపీగా కూర్చుని అడుగుతున్నారా? తొందర కాదుటండీ...పిల్ల ఎదిగికూర్చుంటేను. దానితోటిది మా అన్నయ్యకూతురికి పెళ్ళయింది. మా పిన్ని మనుమరాలికి పెళ్ళయి బిడ్డనికూడా కన్నది. వాళ్లని చూసినప్పుడల్లా అది ఇంత ముఖం చేసుకుని కుళ్ళిపోతోంది...ఇంకా..

సీత: దానికన్న తొందర నీకు ఎక్కువైంది...

పున్న: అదీ ఇంక నామీద విరుచుకు పడడం...ఆడపిల్ల తల్లికి తొందర ఉండడం కూడా ఆశ్చర్యమేనా? నేనింకా తొందర పడడంలేదని మా అమ్మా, పిన్నీ అందరూ నన్ను తిట్టిపోస్తుంటే, నేను తొందరపడుతున్నానని మీరు సాధించండి. నాకెందుకమ్మా ఈ సంసారం...నేను చెయ్యలేను. ఏ నుయ్యో గొయ్యో...

సీతా: చెపుతా...

పున్న: ఏం చెపుతారూ? చెప్పండి...

సీతా: నువ్వు ఏమిచెప్పమంటే అదే చెపుతాను.

పున్న: నిజంగా? నామీద ఒట్టు?

సీతా: ఏమిటిచెయ్యాలో చెప్పు...ఏం చెప్పాలో చెప్పు...

పున్న: ఏం బరువులు మొయ్యనక్కరలేదు. మీరు చెయ్యవలసిందలా ఏంలేదు... నర్సాపురంనుంచి మా కామమ్మవదినే, మొగుడూ వచ్చారు. వాళ్ళ కుర్రాడు శుభ్రంగా వుంటాడు. మన పిల్లకి యీడూ జోడూ అని మా అమ్మ పిన్నీ ఇద్దరూ చెపుతున్నారు.

సీతా: మీ అమ్మను పిన్నిని కుదర్చమను సంబంధం...

పున్న: మీరున్నారుగా, మీ రుండగా వాళ్ళు మాట్లాడితే ఏం బాగుంటుంది? వాళ్లు చక్కగా ఘోస్తపరుచుకుని వస్తారు. ఎటువంటి వ్యవహారమయినా ఒక్కొక్కళ్లు నలుగురేసి మగవాళ్ళపెట్టు...

సీతా: అందుకే వాళ్ళనే ఘోస్తపరచమను యీ సంబంధం కూడా.

పున్న: ముందు కాస్త ఆరంభం చెయ్యండి మీరు. మిగతాది వాళ్ళు పూర్తిచేస్తారు.

సీతా: మొదటినుంచి చివరిదాకా మీ అమ్మనీ పిన్నినీ చెయ్యమందూ...

పున్న: మళ్ళీ అన్నమాటే అంటారేం? మీరు కాస్త వున్నాననిపించండి...మిగతా వ్యవహారం మేం ముగురం చేసుకుపోతాం. ఇంతకీ చెప్పవచ్చిం దేమిటంటే వాళ్ళ మగడూ పెళ్లాం మన యింటికి వస్తారు. నాలుగు గంటల రైలుకు వెడతారుట. రెండు గంటలకే బయలుదేరి వచ్చి మనింటిదగ్గర

కపిల చినవెంకటరావు

కాసేపు కూర్చుని ఇక్కడినుంచి రైలుకు వెడతారుట. ఆ వచ్చినప్పుడు నేను చెప్పమన్న నాలుగు ముక్కలూ వాళ్ళతో చెప్పాలి మీరు.

సీతా: చెపుతా...ఏం చెప్పాలో కాస్త చెప్పు.

పున్న: ఇదీ వరస. ఎన్నిమాట్లు చెప్పానండి మీకు. కామమ్మ మొగుడు ఒకమాదిరి వాడేగాని, కామమ్మమాత్రం మహాగడుసుది. మనం మనపిల్లని ఇస్తామని ప్రాధేయ పడినటు కాకుండా చెప్పిచూడండి. దానికి కాస్త ఉన్నవాళ్లి సంబంధం లేవాలనివుంది. మన సంబంధం అంటే గంగేసి చేసుకుంటుంది.

సీతా: కుర్రవాడు ఒప్పుకోవద్దూ?

పున్న: కామమ్మ మాటకు కుర్రవాడు ఎదురు చెప్పడు.

* * *

కామమ్మ: వదినగారూ, పున్నమ్మవదినెగారూ, ఓ పున్నమ్మ వదినెగారూ...

పున్న: ఆఁ వచ్చారు...జ్ఞాపకం పెట్టుకోండి...ఆఁ ఆఁ వచ్చే ... వచ్చె...

ఏమమ్మా కామమ్మవదినే నన్ను వదినెగారు, వదినెగారు అని మరీ మరీ మన్నిస్తున్నావే, నిన్ను కూడా నేను వదినెగారనాలా? రండి అన్నగారూ...మా వదినె మహతెలుగు మీరిపోయింది. తిన్నగా మిచ్చారా? కాళ్ళు కడుక్కోండి. ఇదిగో వమ్మలేన్న, ఇదిగో, వెంకటసూరయ్య అన్నగారువచ్చారు. ఇలారండి. ఒక్కమాట.

సీతా: ఆఁ ఆఁ ఏమండోయ్ బావగారు! ఏమి అక్కగారు ఎక్కణ్ణుంచి రాక? కాళ్లు కడుక్కున్నారు తుండుగుడ్డ తెచ్చి ఇవ్వవే. రండి. కూర్చోండి.

పున్న: రా, వదినే ఇలారా. కుర్చీలో కూర్చోరూ అన్నయ్యగారూ; వదినే నీకు కూడా కుర్చీ వెయ్యాలా మా అన్నయ్య సరసని దొరా దొరసానీలాగ.

కామ: చాల్లే...ఎవరైనా వింటే నవ్విపోతారు.

సీతా: బావగారికి ఫలహారం తెచ్చిపెట్టవే. మా అక్కగారు నాతోటి పాటే గాని...

పున్న: ఏం మీపాటుకేం తక్కువ వచ్చింది? అట్లాఅయితే మా అన్నగారు నాతోటిపాటే.

కామ: మాకు ఫలహారాలు వద్దమ్మా... ఇప్పుడే ఫలహారం చేసివచ్చాము. నామాట ఎలావున్నా అసలు తినరు.

పున్న: మా వదినె చేతివంట తింటే అరగదాండి అన్నయ్యగారూ...?

కామ: మీ అన్నయ్యదేమిటి, మీ అందరిదీ ఏమిటి...బకాసురుడి ఆకలి వదినే... అరక్కపోవడమేమిటి? అవునుగాని, పున్నమ్మా, ఈ కాసులపేరు మళ్లీ చేయించుకున్నావా?

పున్న: ఆఁ...నా పాతది పిల్లకిచ్చేశాను,

సీతా: అన్నటు మర్చిపోయినాను... ఒక్కక్షణంలో వస్తా...కూర్చోండి...

పున్న: వాకిటితలుపు వేసివస్తా...వదినే.

—అవతల ఇంట్లోకి వెళ్ళి—

పున్న: ఏం వాళ్ళని రమ్మనిచెప్పానా? నే చెప్పింది చెపుతారా?

సీతా: చెపుతా...చెపుతా...

పున్న: చెప్పితీరాలి......చెప్పి ఒప్పించాలి...

సీతా: చెపుతా...చెపుతా

పున్న: చెపుతా, చెపుతా అని పుణ్య

★ చెపుతా...చెపుతా... ★

కాలం కాస్తా మించపెట్టకండి...యీ వేళ పంచమీ పునర్వసూనుట... సాయంకాలం మూడింటికల్లా వర్జ్యంట. పంచాంగం బ్రాహ్మడు చెప్పారు. మీరు వారిద్దరితోనూ చెప్పి అవుననిపించేసుకుంటే...

సీతా : చెపుతా...చెపుతా...

పున్న : మళ్ళీ పుష్కరాలు మాఘమి మ్ముంచుకు వస్తున్నవి. యీ వేళ నిష్కర్ష చేసుకోవాలి. మా అమ్మ పిన్ని చెప్పారు.

సీతా : చెపుతా...చెపుతా...

పున్న : ఆమాటమీదనే ఉండండి. వాళ్ళి ద్దరినీ ఇల్లా రమ్మంటాను. ఏమమ్మోయ్... కామమ్మవదినే మీ యిద్దరూ ఒక్కమాటు ఇల్లా వద్దురూ...యీయన మీతో ఏమిటో చెప్పాలిట...

కామ : ఏమిటమ్మోయ్! అంత మా యిద్దరితోటే మీ ఆయన చెప్పే విశేషం. ఇదిగో వింటున్నారా... వారు మనతో టి ఏమిటో చేప్పాలిట... వనికిపాట్లా ఏమిటి! అప్పుడే నిద్రపోతున్నారండీ...?

వెంక : ఏం చెప్పాలి బావగారు మనతోటి ...మన యిద్దరితోటి...?

కామ : విందాం పదండి...ఏమిటయ్యా పున్నమ్మవదినే, ఆ చెప్పేసంగతి?

పున్న : రండి వదినే...ఇలా కూర్చో.. అన్నగారూ, మీరు అల్లా కూర్చోండి...

వెంకట : ఏమిటి బావగారు విశేషం, మాకు బయలుదేరి వెళ్ళే వేళ అయినట్టుంది. మా రైలు నాలుగుగంటలకే అయితే, మరి మేమూ కాస్త వ్యవధివుండగా చేరుకోవద్దూ..

పున్న : అప్పుడే ప్రయాణ సన్నాహం చేస్తూంది మావదినె...మా ఇంట్లో రెండు గడియలైనా కాలు నిలపకూడదా ఏమిటి?

కామ : అదేంమాట వదినే, నేను ఇందాకనే చెప్పితినికదా...ఆగటానికి వీలులేదని.. రేపో యెల్లుండో కుర్రవాణ్ణి చదువుకు పంపించేసెయ్యాలి. ఆడపిల్లని దానింటికి దాన్ని పంపెయ్యాలి...సప్తమి దాటిపోతే మళ్ళీ అష్టమి నవములు పనికిరావయ్యె.

పున్న : పిల్లవాడు ఏంచదువు పూర్తిచేశాడేమిటి వదినే...

వెంకట : బి. ఎ. ఆనర్సు పూర్తిచేశాడు. పైకి చదువుతాడట. కాస్త ఏదో ఉద్యోగం చూచుకోరా నాకు కాస్త తోడుగావుండరా యీసంసారం ఒక్కరెక్కమీద యీడ్చలేనురా అంటే వినడు...

పున్న : బి. ఏ. ఆనర్సు పరీక్షయి నాదా! అంటే ఇనస్పెక్టరు పని ఇస్తారా?

కామ : ఇనస్పెక్టరు పని ఏమిటమ్మోయ్.. వాడు కలక్టరువనికి చదువుతానంటుంటేను.

పున్న : బి. ఏ. ఆనర్సయిన తర్వాత కలక్టరు పరీక్షన్నమాట.

వెంక : ఒక కలెక్టరేమిటి జడ్జీఏమిటి ఏపరీక్షయినా చదువుకోవచ్చును. వాడు ఇంజనీరు చదువుతానంటున్నాడు.

పున్న : ఇంజనీరంటే మా రమణత్తయ్య అల్లుడు చేసేపని అన్నమాట..

వెంక : ఈపరీక్షకి చదువు చెప్పించడం అంటే మాటలా? ఊరికే డబ్బు పారబొయ్యాలి. ఇంక నావల్ల కాదు బాబూ, అంటే వినడు కుర్రవాడు.

సీతా : కుర్రవాడు చదువుకున్నంతవరకు చెప్పించాలి బావగారూ...

వెంక : అల్లాఅనడం సులభమే గాని బావగారు నాకు ఇవతల స్తోమత ఉండొద్దండీ.. ఎక్కడని తెచ్చిపెట్టను?

పున్న : పిల్లవాడు ఎదిగాడా, వదినే చిన్నతనంలో ఎప్పుడో చూచాను. పాపమ్మ పెళ్ళికి...

కామ : ఎదగడమేమిటమ్మోయ్... ఇప్పుడు తండ్రిఅంతా అయినాడు. యింకా ఈయనే ఒక్కరవ్వపొట్టి వాడికన్న... వాడిది మానాన్న పోలిక...పసిమీ, కనుముక్కుతీరూ...

వెంకట : ముక్కుని కోపం చెప్పవేమి?

కామ : అదొక్కటే మీపోలిక...

పున్న : అయితే వదినే, అబ్బాయి వెనుకటి పుష్కరాలకి కాక అక్కిందటి పుష్కరాలకొక్కదూ పుట్టాడు...? ఇప్పుడు ఇరవై నాలుగన్నమాట, వయస్సు...

కామ : అవ్వే అప్పుడు పుట్టింది మాపెద్దపిల్ల...దానితర్వాత కానుపు వీడు...ఇరవై వెళ్లాయో లేదో...

పున్న : ఇరవయ్యే ... అయినా పరవాలేదు.

వెంక : దేనికి ఫరవా అమ్మోయ్...

పున్న : మీరు మాట్లాడరేమి...ఇదిగో...

సీతా : చెపుతా...చెపుతా...

వెంక : ఏమిటి బావగారు అంటున్నారు.

సీతా : చెపుతా...చెపుతా...బావగారు మీరు మీరు నాకొక్క సాయంచేసి పెట్టాలి ...చేస్తానంటే చెపుతాను.

వెంక : ఎంతమాట ... ఏమిటో చెప్పండి నావల్లనయితే చూస్తాను.

సీతా : చెపుతా...మీకు నాకూ దగ్గరదో దూరపుదో చుట్టరికం వుంది.

పున్న : దూరం ఏమిటే, మా పినతల్లి కూతురి సవతి ఆడబిడ్డ నీవూ తోడికోడళ్లు కాదువదినే?

కామ. కాదుమరీ ... మా పినతల్లిగారు బాగావుంటా...?

పున్న : లేదమ్మా పోయిన సంవత్సరానికి ఏడాది...

వెంకట : తమకు సెలవివ్వలేదు.

సీతా : చెపుతా ... చెపుతా ... మనం చాలా దగ్గిరబంధువులం ... మీవల్ల నాకు కావలసినసాయం ఏమిటంటే, నాకొక్క పెళ్లికొడుకుని వెదికి పెట్టాలి ... అయిన కుటుంబం, వీలయితే బంధువుల్లోను, మరీ ఎరిగిఉన్నవాళ్లల్లోనూ అయితే ఉత్తమ పక్షం...

కామ : వోహో...ఓహో...

వెంకట : ఆ, హాఁ...ఆఁహాఁ...

పున్న : మా పిల్లలేదు వదినే, దానికి... దానికి...

సీతా : అబ్బ, నువ్వు కాస్త ఊరుకుందూ ... నే చెపుతా...ఏమన్నానుబావగారూ...

వెంక : అయిన కుటుంబం, అన్నారు.

సీతా : ఆయిన కుటుంబం మరీ ఇంకా చెపుతా కుర్రవాడు చదువుకున్న వాడుగా వుండాలి.

వెంక : చదువూ అంటే డొక్క శుద్ధి అయితే చాలునా...లేక...

సీత : చెపుతా...డొక్కశుద్ధి ఏం చాలుతుంది...యీరోజుల్లో, కాస్త పెద్దచదువులే గాని పనికిరావు...

పున్న : పెద్దఉద్యోగానికి పనికివచ్చే పెద్ద చదువు కావాలన్న గారూ...

వెంక : అంటే, గుమాస్తాపని సరిపోతుందా...

పున్న : గుమాస్తాపనీ...గుమాస్తా అంటే మా రాజమ్మ పిన్ని కొడుకు చేసేపనీ? అందులోంచి ఇంజనీరవుతాడు...?

సీతా : నువ్వూరుకో కాస్సేపు నేచెపుతా ... బావగారూ, కుర్రవాడు అల్లరిచిల్లరి వాడుగా ఉండకూడదు.

వెంకట : అల్లాగే...వయస్సు...?

సీతా : చెపుతా...20, 21, 22...అంతకి మించకూడదు.

పున్న : అమ్మాయికి ఎన్నో ఏళ్లు లేవు వదినా...అది మొన్నటిపిల్ల...మా అమ్మమ్మ చచ్చిపోయేటప్పటికి...

సీతా : అబ్బ గొడవ ... నువ్వే ... నే చెపుతా...

వెంకట : అమ్మాయి ఏంచదువుకుందండి?

సీతా : పుచ్చుల కథ బాగా చదువుతుంది ...చాకలి పద్దువరకు భయం లేదు. ఇంకా చదువుకుంటుంది గాని నేనే మానిపించేశాను.

వెంక : అల్లాగా ? పిల్ల రూపసే అనుకుంటాను.

పున్న : అమ్మాయి మా పెత్తండ్రి కూతురి గారి ఇంటికి వెళ్ళి వారం అయింది. ఇక్కడ ఉంటే మీరు ఉభయులూ చూచుకుని ఉందురు...

వెంకట : పిల్ల రూపురేఖలు కలదే కాదండి...

సీతా : చెపుతా...అవే రూపురేఖలు... చెవిటిది కాదు, గుడ్డిది కాదు, కుంటిది కాదు, గూనిది కాదు...

వెంక : నలుపా ఎరుపా అండి...

సీతా : పచ్చని పసిమి కాదు, అల్లా అని నల్లని నలుపూ కాదు, ఛామనచాయ...

కామ : ఊఁహూ...

వెంకట : ఆఁహాఁ ... మరి సంగీతం ... చెప్పించా రనుకుంటాను...

సీతా : సంగీతం ఎందుకండి...మా పిల్లకి అదేమి నాటకాలు ఆడాలా, భాగోతాలు కట్టాలా ? సంగీతం రాదు...

కామ : ఊఁహూఁ...

వెంక : ఆఁహాఁ ... ఇంట్లో, పనిపాటలు బాగా చేస్తుంది గాబోలు...

సీతా : చెపుతా ... అది నా యింట్లో పుట్టింది. నేను లక్షాధికార్ని కాను గాని మరీ లేనివాణ్ణి కాను. పని మనుషుల్ని పెట్టి చేయించుకుంటాం...మా పిల్లకి పనిపాటలు చేసుకోవలసిన అవసరం ఏర్పడ లేదు...

కామ : ఓహో...

వెంక : ఆఁహాఁ...

సీతా : ఇంకా చెప్పవచ్చే దేమిటంటే పిల్ల ఒక్కొక్కప్పుడు కొంచెం పట్టుదల పడుతూ ఉంటుంది.

కామ : అంటే మంకుతనమా...?

సీతా : అబ్బే కాస్త పట్టుదల, అన్నాను కాదూ, ఆ పట్టుదల మనం తీర్చేస్తే అదే దారికొస్తుంది.

వెంక: ఆఁహాఁ తెలిసింది, మంకు తనం కాదు కాని, పట్టుదల అన్నమాట. అయితే కట్నకానుకలు మాట కూడా...

సీతా: చెపుతా చెపుతా నేను కట్నమూ అని అడిగితే ఇవ్వను...కట్నాలు ఇవ్వకూడదనే మతం నాది. నాకు తోచింది ఇస్తాను. ఎంత ఇవ్వ దలచుకున్నది చెప్పను...

కామ: ఓహో...

వెంక: ఆఁహాఁ...ఆస్తిపాస్తుల మాట.

సీతా: చెపుతా చెపుతా ... పిల్లవాడికి ఆస్తి వుండాలి ... బలగం ఉండకూడదు... మరి మా ఆస్తిమాట నాకు ఆస్తి ఉన్నంత ఉంది...లేనంత లేదు...

వెంక: అందరికీ అంతే కాదండి...

సీతా: అంతే అనుకోండి ... ఆ మాట ఎందుకు అనవలసి వచ్చిందంటే అవతలి వాళ్ళకి నా ఆస్తిమీద ఏమాత్రం ఆశ ఉండకూడదు.

వెంక: అల్లాగా అండి...అలా స్పష్టంగా చెప్పండి.

సీతా: చెపుతా, చెపుతా ... నాకు వున్నంత వుంది...లేనంత లేదు...

వెంక: ఆమాట ఇప్పుడే చెప్పారు...

సీతా: నా ఆస్తి అంతా నా భార్యకు వ్రాసేసి ఆవిడ ఇష్టానుసారం చేసేశాను. అంతే...నా తదనంతరం అన్నమాట...

వెంక: అంతవరకు నయమే...

సీతా: నేను బ్రతికి ఉన్నన్నాళ్ళూ నా మాట వినుకుంటూ నా భార్య బ్రతికి ఉన్నన్నాళ్ళు ఆమె మాటవినుకుంటూ జాగ్రత్తగా మా కష్టసుఖాలు చూస్తూంటే అల్లుడిపని అన్యాయం కానివ్వను. అంతకన్న నేను నా ఆస్తి పాస్తులమాట చెప్పవలసింది లేదు. ఇంతకీ ఏమిటంటే నన్ను చూచి నా గౌరవం చూచి నాతో సంబంధం చేసుకోవాలని ఉండి అడిగితే పిల్లని ఇవ్వడానికి సిద్ధమండి...

కామ: ఊఁహూఁ ... పున్నమ్మ వదినే గడియారం ఎంతయిందో చూడు. మా బండికి వేళయిపోయిందేమో...

పున్న: ఇంకా వేళవుంది వదినే... మా అన్నగారు చెప్పేది విను పూర్తిగా.. చెప్పండి

సీతా: చెపుతా...కనుక బావగారూ నా అభిప్రాయం బాగా తెలుసుకున్నారు కాదూ...

వెంకట: ఆహా పూర్తిగా తెలుసుకున్నాను...

సీతా: మరి మీ అభిప్రాయం నాకు తెలియపర్చాలి...

పున్న: అన్నగారూ, మీరూ మా వదినే సంప్రతించుకుని...

కామ: మేము సంప్రదించుకునేందుకు ఏముందమ్మా ... మీరడిగిన దాంట్లోనుకి ఏమండీ టయిము చూడండి...

వెంకట: అవును. టయిము అయిపోతున్నట్లుంది. మరి నాకు సెలవు ఇప్పించరూ బావగారూ...వెళ్ళవస్తామూ...

పున్న: ఏం వదినే...?

కామ: చెపుతా చెపుతా...ఎక్కడయినా సంబంధం ఉంటే చూడమని కాదు మీరు చెప్పింది? చెపుతా...చెపుతా...మీరు కోరిన అన్నింటికీ ఒప్పుకునేవారుంటే తప్పకుండా చెబుతా...

సీతా: ఏం బావగారూ...?

వెంకట: నేనుకూడా చెపుతా ... తప్పకుండా చెపుతా......

★

వృషపర్వుడి కుమార్తె శర్మిష్ఠ నన్నయ భారతంలో ప్రధానపాత్ర కాకపోయినప్పటికీ పరిశోధించి చూచినట్లయితే విలక్షణమైన పాత్రగా కనుపిస్తుంది. శర్మిష్ఠ రాచబిడ్డ. కన్యకా సహస్ర పరివృతయై ఉద్యానవనాలలోను, సరోవరతీరాలలోనూ ఆమె విహరించడం సహజం.

ఆమె ప్రవృత్తిని కొంత విమర్శించి చూచినట్లయితే లోకోత్తరంగా అంతఃపుర కన్యలకుండే లక్షణాలు తప్ప విభిన్నమైన ప్రాతికూల్యము ఆవిడలో కన్పించదు. పురోహితుని కుమార్తెయైన దేవయానిని నిర్దాక్షిణ్యంగా నూతిలో త్రోయడం పరికించితే ప్రతీకారేచ్ఛ ఈమె కఠిన ప్రవృత్తిగలిగినదిగా గోచరిస్తుంది. కాని కొంత సావకాశంగా విషయం పరిశీలించినట్లయితే ఇట్టి వాదనకు తావు కానరాదు. ఆమె ఒకనాడు దేవయాని సహితయై చెలులతో సరోవర తీరములో తమ తమ పరిధానంబులు పెట్టి జలక్రీడలకు ఉపక్రమించింది. ఇది మామూలే కాని సుడిగాలివల్ల చేత ప్రేరితములై అన్యోన్య పరిధానంబులు కలసిపోయినవి. ఇది దైవకృతము. జలక్రీడ చాలించి పుట్టములు ధరించుసమయమున తొందరపాటు వల్ల ఒకరి పుట్టములు ఒకరు కట్టుకోవడం తటస్థించింది. సామాన్యంగా జరిగే పొరపాటే ఇది. కాని పొరపాటువల్ల దేవయాని పుట్టము తాను ధరించుట తటస్థించినప్పటికీ, ముందుగా శర్మిష్ఠ న్యాయతను పాటించి పురోహితు కుమార్తెను నిందించలేదు. మరి దేవయానిమాత్ర మామె పరిధానమును పుచ్చుకొనక కోపించి శర్మిష్ఠను జూచి;

"లోకోత్తర చరితుండగు నా కావ్యతనూజ నీకు నారాధ్యను నే బ్రాకట భూసురకన్యక నీకట్టిన మైల కట్ట నేర్తునె." అని నిష్ఠురము లాడినది.

ఏదో ప్రమాదవశాత్తూ ఒకరి పుట్టములు ఒకరు కట్టుకొనుట తటస్థించింది. అంతేకాని అహంకారమువల్ల జరిగిన పనికాదిది; ఒకరిని కించపర్చుటకు కాదు. జలక్రీడార్థం వచ్చిన వీరందరూ బాల్యావస్థలోనివారే. విశేషించి మిత్రత్వము కలిగినవారు. వీరిలో అనుభవ నీయులు ఒక్కరూ లేరు; ప్రౌఢాంగనలు కారు. ఒకరి నొకరు తృణీకరించుటకు వీను దీయరుకదా! అందును శర్మిష్ఠ రాచబిడ్డ. కులగురువులైన ఆచార్య తనూజ అనియు, విశేషించి పూజార్హత గలదనియు యుక్తాయుక్త విచక్షణ జ్ఞానమప్పుడలవడుటకు తావులేదు.

పొరపాటువల్ల జరిగిన పనికి తన్ను నిష్ఠురముగా పలికినందుకు అట్టి స్థితిలో నెవ్వరు సైరింపరు. ఇతరులు ముల్లుపెట్టిపొడిచినప్పుడు తన ఆత్మగౌరవాన్ని విస్మరింపరుగదా! ఈ క్రింది విధంగా సమాధాన మిచ్చినది.

"మాయయ్యకు బాయక పనిచేయుచు దీవించి ప్రియము చేయుచు నుండుక మీయయ్య వెండి మహిమలు నాయొద్దన బలుక నీకు నానయు లేదే!"

నేను కట్టిన పుట్టంబు నీకుం గట్ట నెబ్బరిక మయ్యెనా? అంటూ మాటిగా ప్రశ్నించింది. కాని యిచ్చట తన రాజాధికారాన్ని కొంచెం చలాయించింది. దేవయానిని ఒక నూతిలో త్రోచి కన్యకాపరివృత యయి ఇంటికేగినది. నూతిలో త్రోచుట సాహస కార్యమే కాగలదు. అయినను అడవులలో పాడునూతులు ప్రాణాపాయ మొనరించునవి కావని చాలచోట్ల మన పూర్వ కావ్యాలలో కనబడును. సామాన్యముగా నవి కందకములను బోలివుండుట ప్రసిద్ధమే. అంటే అట్టి నూతులు తీగెలు వగైరాలల్లుకొని నిర్జలమై యుండుటచే ప్రాణోపద్రవకరములు కావని భావము. దీనినిపట్టి శర్మిష్ఠ దేవయానిని హీనపర్చుటకే ఆ కార్య మొనరించినట్లు నన్నయ భారతంలో సమర్థించినాడు.

తరువాత యయాతి నరేంద్రుడు వేటకు బయలుదేరి, దప్పికగొని ఆ బావివద్దకు చేరుకుంటాడు.

సీ॥ "తతూష్మపమున విలసత్కాలఘువల్లి యన్నిష్టపక్షి నూది యున్నదాని, దనసమీపమునకు జనులరాగమనంబు పన్నుగాగోరుచు నున్నదాని ......వరుణేంద్రదేవి యపోనిదాని" దేవయానిని చూచాడు.

చం॥ "జలధివిలోలవీచి విలసత్కలకాంచి సమంచితావనీతలవహానతుమం బయిన దక్షిణ హస్తం" ఆసరాతో ఆమెను పైకితీశాడు.

ఇట్టి విషయాలవల్ల మనం ప్రధానంగా చర్చింప బూనుకున్న శర్మిష్ఠపాత్రలో సహజమునకు భిన్నమైన దుర్మార్గపు మనఃప్రవృత్తి లేదనియు; దేవయానిని మట్టుపెట్టాలని కాకుండా అప్పుడు తనకు కలిగిన తాత్కాలిక క్రోధకాన్ని పురస్కరించుకొని కించపర్చుటకే ప్రయత్నించినట్లు స్పష్టమగుచున్నది. తానొనరించు కార్యము ప్రమాదరహితమైనట్లు చివరకు దేవయాని ఆ విధంగా రక్షింపబడునట్లు హేమ్యమూహించినట్లు గూడ స్ఫురించును.

శుక్రుడిట్టివిషయమున కాగ్రహించక బదులు యజ్ఞయాగాది క్రతువులు ...
వారికంటె అక్రోధనుడు కరంబధికుడు క...
క్రోధంబు పనికిరాదంటూ కూతుర్ని వ...
లిస్తాడు. శర్మిష్ఠ రాచబిడ్డ, అని ...
జొన్నత్యాన్ని కొంత వినుతి...
"అలిగిన నలుగక యెగ్గులు పలికిన ...
పలుకని..." వారు ధన్యులంటూ ధర్మ...
కూడా బోధిస్తాడు. కాని ఈ విషయం...
శర్మిష్ఠ నిర్దుష్ట చరిత్రకు భంగం, కళం...
లేనివిధంగానే సమర్థింపబడినది.



శబ్ద శాసన...

ఈ రభస జరిగిన తదుపరి వృషపర్వుడు ...
గురువుగారికి భయపడి (కేవలము భయము ...
కాకపోయినను భక్తి విశ్వాసములకు లొంగి ...
తనపుత్రిని, చెలికత్తెల సహితంగా గురు...
పుత్రికి పరిచారికగా సమర్పిస్తాడు.

దేవయాని శర్మిష్ఠతోసహా ఆ పరిచారిక...
నందరను వెంటనిడుకొని విమల జలప్రవా...
విలసితంబైన ఒక సెలయేటికెలన శీత...
తాతలంబున విష్టవినోదములతో విహ...
వుంటుంది. ఈ సమయంలోనే య...

★ బాచిమం...



కొత్తశీర్షిక

మహారాజు ఆగమనాన్ని వర్ణించిన శబ్దశాసనుని కూర్పు అనితరసాధ్యమైనది. మనోహరమైనది. పాఠకుల కమితానందము గొల్పునట్టిది. ఆ మహారాజు వచ్చి సుఖోపవిష్టుడై యతిశయ రూపలావణ్య గుణసుందరియైన శర్మిష్ఠను జూచి విభ్రాంతుడైనాడు. ఆమె నెఱుంగగోరినాడు. అప్పుడు తన అధికృతను; శర్మిష్ఠ హీనమును వ్యక్తపర్చే విధంగా "నాదాసి" అని చెపుతుంది.

కచుని శాపంవల్ల నామమాత్రంగా యయాతి రాజుతో దేవయాని వివాహ

ని శర్మిష్ఠ

మౌతుందేమో కాని మహారాజు చూపులు; మనస్సు; కూడ ప్రథమదర్శనంతోనే శర్మిష్ఠ పరమగులెవి. ఈ విషయం నన్నయ కూర్పువల్ల స్పష్టమగుతున్నది. తప్పుకూడ లేదు.

ఆయన రాజు; ఆమె రాజపుత్రిక, సుగుణవతి; విశేషించి సౌందర్యవతి. శర్మిష్ఠపై అతనిమనసు లగ్నమైన దనడంలో ఆశ్చర్యము లేదు.

తరువాత దేవయాని "ఆరోజున నూతిలో నుండి బయటకు తీయునప్పుడు నాపాణిని గ్రహించితిరి. గావున మన ఉభయులకు వివాహము ఖాయమే" అని చమత్కరిస్తుంది.

శుక్రాచార్యులవారు తనపట్టిని మహారాజుకు సమర్పిస్తూ, అంటే అపక్రమదోషం లేనివిధంగా నన్నమాట. (బ్రాహ్మణకన్యను క్షత్రియునకు వివాహం చేయడం) "ఇది వృషపర్వుని కూతురు. దీనికిం బ్రియంబున నన్నపానభూష ణాచ్ఛాదన మాల్యానులేపనాదుల సంతోషంబు చేయునది. శయన విషయంబున బరిహరించునది." అని అల్లుడికి ఆజ్ఞాపించటం చూడగా, యయాతి చూడ్కు లాపెయందు గాఢంగా నాటుకొనుట ఆచార్యులవారు గ్రహించినట్లు విశదమగుచున్నది.

ఏవిధముగ జూచినను శర్మిష్ఠపాత్ర మనోహరమైనది. యౌవన ప్రాయములో నామె అతిలోకసుందరిగా ఒప్పెనని నన్నయ పలుతోట్ల వర్ణించినాడు: "అతిశయ రూపలావణ్య గుణసుందరి" అని గట్టిగా పేర్కొన్నాడు. దీనినిబట్టి శర్మిష్ఠ కమనీయ గుణసంపదచే నొప్పెనని బోధపడుచున్నది.

భార్గవీ యయాతి నృపుల కలయికం జూచి శర్మిష్ఠ తాను సంప్రాప్త యౌవనయు, ఋతుమతియునై వెలయుటవల్ల వాపోతుంది. ఒకనాడు అద నెరిగి మహారాజు నేకాంతమున గలసి తన కోరిక నీ విధముగా బయటపెడుతుంది:

"నీలగళోపమాన కమనీయ గుణోన్నతిం జెప్పజాలు నన్నేలిన దేవయానికి నరేశ్వర! భర్తవు గాన నాకునుం బోలగ భర్తవీవు యిది ధూనుత ధర్మపథంబు..." అంటూ ధర్మోపదేశం చేస్తుంది. శయన విషయంలో తన్ను పరిహరిస్తానని ఒప్పుకున్న రాజు ప్రతిజ్ఞకు భంగం లేదని క్రిందిపద్యం ద్వారా రూఢిపరుస్తుంది. కం॥ "చనుబొంకగ బ్రాణాత్యయమున సర్వ ధనాపహరణమున వధ గావచ్చిన విప్రార్థమున వధూజన సంగమములందుఁ." మహారాజు ప్రసాదం చేత శర్మిష్ఠకు రాజలక్షణ లక్షితుడయిన కుమారు డుద్భవిస్తాడు.

శర్మిష్ఠ పాత్ర ఉదాత్తమైనది. తిక్కన సైరంధ్రి పాత్రనెంత చక్కగా సృష్టించి తన శిల్పాన్ని ప్రదర్శించాడో — తద్రూపముగా నన్నయ శర్మిష్ఠ పాత్ర పోషణనుఅంత చక్కగా చిత్రించాడు.

భారత మాంధ్రుల పాలిటి కల్పవృక్షము. భారత రసాస్వాదన మెట్టివారికిని తన్మయత్వము గూర్పగలదు. "నా నృషిః కురుతే కావ్యం" అన్నారు.

ఋష్యంశ లేనిదే కవిత్వసంపద చేకూరదు. నన్నయ ఋషి, ఆయన నెందరెన్ని విధాల ప్రశంసించినప్పటికీ ఆ ప్రశంసలు సమగ్రము కాజాలవు. నన్నయ ప్రశస్తికి సంబంధించినవి నా పద్యములు కొన్నింటిని యిక్కడ ఉదహరింతును:

ఉ॥ ఈ వటు పద్యమల్లు నత డింతకు మున్ను
జనింపలేద; ఈ
భూ వలయంబునన్ గవితపుట్టెను నీ కల
మందు-ముందుగా
జీవముఁబోసి మా తెలుగు క్షేత్రమునం
దున బీజముంచి నీ
భావము లన్న నీర మిడి పండగఁ జేసితి
తెల్గు కైతలన్.

ఉ॥ పన్నగ నీవు హృద్యమగు పద్యము లల్లెదు
కావునంద ఏ
వెన్నెల కూడి దివ్యమగు విందొనరిం
చెనొ? లేకయున్న నీ
ఉన్నత భావముల్ తెలుగు లొత్తునె? ఇం
కొక డెవ్వడేని య
భ్యున్నతి నొందె నీవు బలెఁ బూజల నం
దెనె? రాజరాజుచే!

మ॥ విపుల ప్రాభవ "శబ్దశాసన"-లసద్వి
ఖ్యాత నామంబుతో
జపహోమాది విశేషకర్మ లవనిం సాగించి
పూజ్యుండవై
విపరీతంబగు త్రోవఁబోక కవితన్
వెచ్చించి నల్దిక్కులం
దుపకారం బొనరించి తాంధ్రజను
లోహోయంచు మెచ్చన్నినున్.

కవిత్రయ నిర్మిత కావ్యరాజ మాంధ్రులకు వరవడి. కవిత్రయము ధన్యులు. వారి కీర్తి అజరామరము. ★

శ్రీహరి శాస్త్రి ★

ఉత్తరబంధనం

(24-వ పేజీ తరువాయి)

కలసిన యీ ముసలాళ్ళే ఇలా తయారవుతే ఇంక చేసేదేమిటి? పైగా ఇందులో వెనుక నీవేదో వుత్తరం వ్రాసినట్లు వ్రాయబడిందేం? నాకు చెప్పలేదే?"

"ఏం చెప్పను? అదంతా పెద్దగాథ"

"అయితే ఇప్పుడు చెప్పకు. వినే వోపిక నాకులేదు"

"అంతా పూర్తిగా వింటేకాని నీ కేరియో అర్థంకాదు. నే నీవూరు వచ్చేముందు వాళ్ళ నాన్న, అంటే లతనాన్న, "నాయనా, వుత్తరాలూ అవి వ్రాస్తూవుండు" అన్నాడు. బాగుండదని రాగానే వొకటి వ్రాశాను. చాలా చిన్న వుత్తరం. వెంటనే దాని కామె సమాధానం వ్రాసింది, చివర నాలుగు ప్రశ్నలిరికించి. ఏం చేయను? తిరిగి వ్రాయవలిసి వచ్చింది. దాని కావిడ సమాధానం వ్రాసింది. మళ్ళా నేను-"

"వ్రాశావు. చివరికి ఆవిడతో తల లోతు కరెస్పాండెన్సులో మునిగిపోయావు. మీ నాన్న ఛాదస్తం నీకూ పట్టుకుంది. ఆమాట చెప్పడానికి నా ప్రాణం తీశావు."

"అంతా వివరంగా చెబితే నీకేమైనా వుపాయం తగలవచ్చని"

"ఇంతవరకూ వచ్చాక ఇంక దీనిని తప్పించడం మంచిదికాదు. మాపిన్నికి తెలిసిందంటే నేనుకూడా ప్రమాదంలో ఇరుక్కుంటా. దీనికంతా గ్రంథకర్తని నేనని తెలిసిందంటే ఆవిడ ఆలోచనలు రకరకాలుగాపోయి, నే నేదో స్వార్థానికిలా చేశాననుకుని నా మెడకి వురివేస్తుంది."

"అయితే నేం? నీవు చాలా తెలివయినవాడివి. లతని భరించగలవు. శివుడు గంగని భరించినట్లు."

"ఆ-శివుడిదంతా ఛాదస్తం లెద్దూ? ఆ గంగని కొస్త కొండ మించి భడల్న క్రిందికి కోసేయక నెత్తిన పెట్టుకున్నాడు. అయినా నాకంత అవసరం రాలేదుగా?"

"అయితే మన స్నేహం ఇంతే నన్నమాట?

"అవును."

"నువ్వో సిడ్నీ కార్టన్ వనుకున్నాను."

వాడెవడు?"

"డికెన్సు కేరక్టరులే. చాలా త్యాగం చేశాడు."

"ఓహో! బహుశా తెలుగులో అలాంటి వాళ్ళు లేరనుకుంటా."

"లేకేం? వుంటే వుంటారు బోల్డుమంది. మన నాగయ్య 'త్యాగమయమీ జీవనమూ' అంటూ పాడేరు కూడాను."

"నే విన్లేదు."

సంభాషణ తప్పుదారి త్రొక్కిందని గ్రహించాడు సుందరం. అతనికి శ్రీనివాసరావుని ఎలా మెత్తబరచాలో తెలుసు!

"శ్రీనివాసూ!" బ్రతిమాలాడు.

"ఉహూఁ!"

"శీనూ!"

"అబ్బ!—సరలే." లొంగిపోయాడు. అలాకాక ఇంకోలాగ చేయలేడతను.

"అయితే నేనిప్పుడో వుత్తరం చెబుతా వ్రాయి."

తన చెవులని తానే నమ్మలేక పోయాడు సుందరం. శ్రీనివాసు తనని వేళాకోళం చేస్తున్నా డనుకున్నాడు.

"లతకే? ఛస్! ఇంక నేనామెకి ఒక్క వుత్తరం కూడా వ్రాయను."

"ఛప్! ఇప్పుడు వ్రాస్తావు. అది కూడా నేను చెప్పినట్లు వ్రాస్తావు. ఇదిగో కాగితం, ఇదిగో కలం. రెడీ?" అన్నాడతిసీరియస్ గా. అతనిలో ఏదో ఇన్స్పిరేషన్ హఠాత్తుగా కలిగింది.

"'మీరు వ్రాసినట్లు ఆకథ వ్రాసింది శ్రీనివాసరావే. అది మీరిష్టే గ్రహించినందుకు మీ మేధస్సునతనెంతయినా మెచ్చుకున్నాడు. సతీష చంద్రుని బుర్రని మించిన బుర్రమీదని—"

"మధ్యలో నీ ప్రసక్తిదేనికి?" అడ్డు చెప్పాడు సుందరం.

"వ్రాయవోయ్ అడ్డుప్రశ్నలు వేయక. దానివల్ల నీవు ఇంకా నాతో స్నేహంగా వున్నావనీ, తన వుత్తరాల్ని ఫూల్ లాగ నాకు చూపిస్తున్నావనీ ఆవిడకి తెలియాలి. ఊఁ వ్రాయి...

'కాని అతను నాకోరిక మీదనే అలా పంపించాడు. మీరు సినిమాలని చాలా పొగుడుతారని, ఈమధ్య నేనో సినిమా చూశాను.—"

"నేను సినిమా చూసి రెండేళ్ళయింది. ఈమధ్య చూడందే?" మళ్ళా అడ్డొచ్చాడు సుందరం.

"చూడకపోవడ మేమిటి? చూశావు. వెర్రివేషాలు వేయక వ్రాయి..."

'ఆ సినిమా చాలా బాగుంది. అందులో కథానాయకురాల్ని చూస్తే అచ్చంగా మీరు గుర్తుకొచ్చారు. ఆమె చీపురుకట్ట చేతిలో లేనిదే భర్తతో మాట్లాడలేదు.'

"ప...ప్...ప్...ప్!" అతి ఖంగారుగా నోరు చప్పరించేశాడు సుందరం.

"ష్! ఇది నీకోసమా? నాకోసమా?...

'భర్తని అస్తమానూ ఇలా చెయ్యండి, అలా చెయ్యండి అని ఎంతో ముచ్చటగా మాట్లాడేది, మీలాగే. ఆభర్త నాలాగ మెత్తనివాడు కాకుండా మానాన్నగారిలాగ అగ్గిపెట్టె అయివుంటే వారి సంసారంలోని కీచులాటలు చూడటానికి ఎంతయినా ఇచ్చివుండేవాడిని.'—

తీసుకుని వెంటనే పోస్టులో వేసెయ్."

సుందరానికి పూర్తిగా బుర్ర పోయింది. అతని వళ్ళంతా చెమటపట్టి తడిసిపోయింది. అతని కీవుత్తరం తలాతోకా అర్థంకాలేదు.

"దీనిభావ మేమిటయ్యా తిరు—" సందేహం వెలిబుచ్చాడు.

"లతని వదుల్చుకోవాలంటే డైరెక్టు ఏక్షన్ తప్ప ఇంకోటి పని చేయదు. తనని గురించి నీవిటువంటి అభిప్రాయంలో వున్నావని తెలిశాక పెళ్ళిపీటలమీద నుండి నిన్ను మెడకాస్తా పట్టుకుని బైటకి విసిరేయకపోతే జుట్టుతీయించుకుని ముక్కు మూసుకుని ముక్తేశ్వర్ లో సన్యసిస్తా," అని ప్రతిజ్ఞ చేశాడు శ్రీనివాసు.

"ముక్తేశ్వర్ లోనే సన్యసించడ మేం?"

"ప్రాసకోస మేడ్చానయ్యా. నన్ను పూరిఖే విసిగించకు."

"ఇదికాస్తా ఆమె మానాన్నకి చూపిస్తే?"

"తనగురించి అంత ముచ్చటయిన వర్ణనలున్న వుత్తరాన్ని లతలాంటి పిల్ల ఇంకొకరికి చూపిస్తుందా? అసలు అది చదివీ చదవడంతోటే చింపిపారేయకపోతే ముక్తేశ్వర్ — ఏం లేదులే. వెంటనే పోస్టుచేసెయ్."

అంతకంటే వేరే హామీ సుందరానికి అక్కర్లేదు. ఎక్స్ప్రెస్ పోస్టులో ఆ వుత్తరాన్ని పంపించేశాడు.

* * *

ఇది జరిగిన నాలుగవ రోజున శ్రీనివాసరావు వుదయం ఎనిమిది గంటలకి అలారం పెట్టుకుని లేచి, బద్దకంగా వొళ్ళువిరుచుకుని 'కాఫీ' అనుకునే సమయంలో సుందరం హడావిడిగా దూసుకొచ్చి అమాంతంగా అతన్ని కౌగలించుకుని,

"శీనూ! నీ మేధస్సుకి పరిమితిలేదు. హెర్క్యూల్ పైరోట్, షెర్లాక్ హోమ్సు, ఆమాటకొస్తే జీవ్సు వీళ్ళందరి బుర్రలోని గుంజూ తీసుకుని దాన్ని పదిపెట్లు గుణించి ఆ మొత్తాన్ని నీ బుర్రలో ఇరికించాడు దేవుడు. ఇదిగో యీ వుత్తరం చదువుకో" అని చిన్న కాగితాన్నొకదాన్ని అతనిమీద పడేశాడు.

అది సుందరం తండ్రి వ్రాసింది. ఆయన ఎంతటి ఛాందసుడయినా చెప్పవలసింది ఖచ్చితంగా మూడు ముక్కల్లో చెప్పివేయగలిగినందుకు సీను ఎంతయినా సంతోషించాడు. అందులో:

"దౌర్భాగ్యుడా! ఇప్పట్లో నీవు శెలవు పెట్టి రానక్కరలేదు" అని వుంది. ★

[శ్రీనివాసరావు, లతనుండి తప్పించుకున్న వయినం 13-7-55 ఆంధ్ర వార పత్రికలో "దత్తుడు" అన్న పేరిట ప్రచురింపబడింది]

★

నక్షత్ర ఫలితాలు

(5-2-58 మొదలు 11-2-58 వరకు)

బి. నరసింగరావు

గ్రహస్థితి

	కే		
	8 తేదీని ధనుస్సులో శని ప్రవేశము. సింహ, కన్య, తుల వృశ్చికములలో చంద్రుడు.		
ర బు శు			
కు	శ	గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

ఈ వారము కార్యభారము అధికంగా పైని వేసుకుంటారు. ఆటంకములు కలుగుతాయి. ఖర్చులు ఎక్కువే కాక అనుకున్నట్టుగా డబ్బు అందకపోవుటచేత అశాంతి కలుగుతుంది. మీ పనులే మీకు కష్టము అవుతున్నప్పటికీ ఇతరులకోసము కూడా శ్రమపడి ఫలముపొందుతారు. కోర్టువ్యవహారములు కొంతవరకూ అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు కొత్తసమస్యలు, వర్తకులకు వ్యవహారముపట్ల పేచీలు వస్తాయి. భార్యకు ఆరోగ్య భంగము కలుగవచ్చు. విద్యార్థులకు చదువుపై శ్రద్ధతక్కువ. 5, 6 తేదీలలో కార్యభారము, త్రిప్పట, ఆటంకములు. 7, 8, 9 తేదీలలో కార్యలాభము. 10, 11 తేదిలలో వివాదము, ఆరోగ్య-చింత.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము ఆశాభంగమునకు కారణములు కనబడకపోయినా, ప్రతి ప్రయత్నములోనూ ఆటంకములు కలుగుతాయి. మీరు ధనవంతులైయుండి కూడా సమయమునకు అవకాశము లేక అప్పుచేయవలసి వస్తుంది. అయినప్పటికీ వెంటనే సద్దుకొని తీరుస్తారు. ఆత్మబంధువులకొరకు తాపత్రయ పడతారుగాని కార్యములు నెరవేరక మాటపడి మనోవ్యథ చెందుతారు. సాహసవంతులగుటచేత పటుదలతో ప్రయత్నించి ఫలముపొందుతారు. వాహనములవల్లగాని, యంత్రములవల్లగాని ప్రమాదములు కలుగవచ్చు; జాగ్రత్తపడండి. పోలీసుశాఖ ఉద్యోగులకు ఇంజనీరింగు శాఖలో వారికి మేలుకాలము. 5, 6 తేదిలలో త్రిప్పట, ఆటంకములు, అప్పు. 7, 8, 9 తేదీలలో ధనాదాయము, ఋణవిమోచనము, అధిక ఖర్చులు. 10, 11 తేదీలలో అవమానము, ప్రమాదభయము.

కృత్తిక [అ, ఈ, ఊ, ఏ]

ఈ వారము బంధుసహాయమునకు, అధికారుల సహాయమునకు మీ బుద్ధిబలము తోడై గత రెండువారములనుండి కలుగుచున్న చిక్కులు పరిష్కరించుకొని ఫలముపొందుతారు. ధనాదాయము తృప్తికరముగా వుంటుంది. విద్యార్థులకు చదువు చురుకుగా సాగుతుంది. కవులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 5, 6 తేదిలలో కార్యాచరణలో తొందరలు, శ్రమ. 7, 8, 9 తేదీలలో ధనాదాయము, బంధుసహాయము, కార్యానుకూలత. ఖర్చులు అధికము, 10, 11 తేదీలలో, అలసట, అనారోగ్యము.

రోహిణి [ఓ, వా, వీ, వూ]

ఈ వారము మీకు యోగకాలము. చిక్కులు తీరిపోతవి. అనుకున్న సొమ్ము చేతికివస్తుంది. మతాధిపతులవల్ల నూతనాంశాలు తెలుసుకుంటారు. కోర్టువ్యవహారములు అనుకూలముగా తీర్పుఅవుతాయి. విద్యార్థులకు ఉత్సాహముగా వుంటుంది. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు మంచికాలము. నటీనటులకు యోగం. 5, 6 తేదిలలో తొందరలతోకూడిన కార్యక్రమము. 7, 8, 9 తేదీలలో శుభయోగము. 10, 11 తేదీలలో శ్రమ.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము మీ ఆర్థికస్థితి, పదవి కూడా ఎక్కువవుతాయి. బంధువులను కలుసుకుంటారు. గాయకులతోనూ, కవులతోనూ వినోదిస్తారు. ఇంట్లోవారికి కలిగిన అనారోగ్యము సరి అవుతుంది. దూరగతులైన ఆప్తుల క్షేమము తెలిసి ఆందోళన తొలుగుతుంది. వెండి సరుకుల వర్తకులకు ప్రయాణమువల్ల లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకూ యోగకాలము. 5, 6 తేదిలలో, శ్రమగల కార్యక్రమము. 7, 8, 9 తేదీలలో ప్రయాణము, లాభము, క్షేమవార్త. 10. 11 తేదీలలో బంధు సమాగమము, మృష్టాన్నభోజనము, అస్వస్థత.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు యోగదాయకము. గత వారము పూర్తికాకుండా నిలిచిపోయిన పనులు ఈ వారము లాభకరముగా ముగుస్తాయి. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. నూలు, బట్టల వ్యాపారస్తులకు యోగము. కవులకూ, గాయకులకూ, కళాకారులకూ మేలుకాలము. 5, 6 తేదీలలో తీరికలేని కార్యక్రమము, 7. 8, 9 తేదిలలో కార్యలాభము. స్త్రీలతోనూ, ఆప్తులతోను విందు, వినోదము, శుభవార్త, 10, 11 తేదీలలో అలసట.

* పునర్వసు [కే, కో, హా, హి] *

ఈ వారము శ్రమదాయకముతో కూడిన కార్యక్రమమువల్ల తీరికవుండదు. యత్నకార్యములకు విఘ్నములు కలుగుతాయి. ఆర్థికస్థితి సరిగా వుండనందున అవసరాలు తీరక ఇబ్బంది అవుతుంది. అకాల భోజనమువల్ల ఆరోగ్యము భంగపడుతుంది. వెంటనే శ్రద్ధవహించండి. విద్యార్థులకు శ్రద్ధతక్కువ వర్తకులకు శ్రమఎక్కువ. 5, 6 తేదిలలో. ఉద్యోగస్తులకు ఒత్తిడి. 7, 8, 9 తేదిలలో రాజకీయవాదులకు అనుకూలము. 10, 11 తేదిలలో స్వల్పలాభము, అనారోగ్యము.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగా వున్నప్పటికీ క్రమేణా మిత్ర సహాయమువల్ల కార్యలాభము పొంది తృప్తిచెందుతారు. ఉద్యోగస్తులకు ధనలోపమువల్ల అలజడి. వ్యాపారస్తులకు మాంద్యము. 5, 6 తేదిలలో నిరాశ, గృహకలతలు, మనోవ్యధ. 7, 8, 9 తేదీలలో ప్రయాణము, మిత్ర సహాయము, విచిత్రవస్తులాభము, కార్యసిద్ధి. 10, 11 తేదిలలో అలసట, ఆరోగ్యభంగము.

ఆశ్రేష [డి, డూ, డే, డో]

ఈ వారము బంధువుల రాకవల్ల ఖర్చులు ఎక్కువ. తలపెట్టిన పనులకు ఆటంకము, గృహకలతలు వీటివల్ల మనోవ్యథ ఉంటుంది. పీఠాధిపతులవంటి మతగురువుల బోధనలవల్ల మనోవికాసము కలుగుతుంది. ఉద్యోగస్తులు కొంత శ్రమపడినమీదట మేలు పొందుతారు. 5, 6 తేదీలలో కార్యసాధనకు ఆటంకములు,

ధరలు:

నూలు, వస్త్రములు : కొంచెము చురుకగును.

నూనెదినుసులు : మార్పు లేదు.

బెల్లము, పంచదార: సమస్థాయిలో నుండును.

చింతపండు : కొంచెము తగ్గును.

ఆహారధాన్యములు : తగుదలలో నుండును.

పప్పుదినుసులు : మార్పు లేదు.

వెండి, బంగారము: స్వల్ప తేడాలో నుండును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, వ్యాసుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

★ నక్షత్ర ఫలితాలు ★

అధిక ఖర్చులు, అశాంతి 7, 8, 9 తేదీలలో సాధుసాంగత్యము, ఆత్మవికాసము, స్వల్ప లాభము. 10, 11 తేదీలలో బంధువులరాక, ఆందోళన.

మఖ [మా, మీ, మూ, మే]

ఈ వారము పరోపకారముకొరకు మీరు ఎక్కువ శ్రమపడి కూడా మాట దక్కక చింతిస్తారు. ధనలోపమువల్ల అలజడిగా వుంటుంది. ఇచ్చిపుచ్చుకోనేపట్ల ఒత్తిడి ఎక్కువై వివాదపడతారు. కోర్టు వ్యవహారములు సుముఖ మవుతాయి. ఇంట్లో స్త్రీల ఆరోగ్యము సరిగా వుండదు. విద్యార్థులకు చదువు సాగదు. 5, 6 తేదీలలో ఆటంకములు, ధనలోపము 7, 8, 9 తేదీలలో కొంత కార్యానుకూలత. 10, 11 తేదీలలో వివాదము, ఆరోగ్యచింత.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ]

ఈ వారము ఎంత ఉత్సాహముతో కార్యసాధనకు ప్రారంభించినప్పటికీ ఆటంకములు కలుగుతాయి. అయిననూ నిరుత్సాహపడక ప్రయత్నములను మానకుండా చేయుటచేత తుదకు మీకు అనుకూలముగా ఫలము కలుగుతుంది. రాబడిచాలక, ఖర్చులు ఎక్కువగుటచేత కుటుంబ కలతలు వచ్చి మనోవ్యధ కలుగుతుంది. అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము వుంది. జాగ్రత్తవల్ల తప్పవచ్చును. ఉద్యోగస్థులు అధికారులచే మాట పడవలసి వస్తుంది. ఖనిజములు, లోహములు, రంగులు వ్యాపారస్థులకు శ్రమతో కూడిన లాభము. 5, 6 తేదీలలో ధనలోపము, ఆటంకములు. 7, 8, 9 తేదీలలో కొంత కార్యానుకూలత. 10, 11 తేదీలలో ప్రమాదభయము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము మీ ప్రజ్ఞను ఉపయోగించి చేసే ప్రయత్నాలు నెరవేరుతాయి. ఆదాయం బాగుంటుంది. అధికారుల ఆదరణ లభిస్తుంది. ప్రయాణమువల్ల నూతన మిత్రలాభము, శుభకార్య నిశ్చయము జరుగుతాయి. కవులకు సన్మానము. శిల్పులకూ, చిత్రకారులకూ, వైద్యులకూ మేలుకాలము. 5, 6 తేదీలలో అధిక ఖర్చులు, ప్రయాసము. 7, 8, 9 తేదీలలో ప్రయాణము, మిత్రలాభము, కార్యసిద్ధి, 10, 11 తేదీలలో అస్వస్థత.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము మీకు మంచి యోగకాలము, ధనయోగము కలుగుతుంది. పురాణ గ్రంథపఠనవల్ల మీ జ్ఞానము అభివృద్ధి అవుతుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తవి. ఉద్యోగులకు హోదా పెరుగుతుంది. ఉపాధ్యాయులకూ, పండితులకూ, న్యాయవాదులకూ, కళాకారులకూ మేలుగా వుంటుంది. 5, 6 తేదీలలో కార్యసాధనలో శ్రమ - ఆ పైని ధనయోగము, కార్యానుకూలత, పండిత గోష్ఠి. 11 తేదీని అలసట.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీరు తలపెట్టిన పనులు నిర్విఘ్నముగా నెరవేరుతాయి. అనుకున్న డబ్బు చేతికివస్తుంది. ఆప్తుల క్షేమము తెలుస్తుంది. బంధుమిత్రులతో కలిసి వినోదములలో పాల్గొంటారు. నూలు, బట్టల వ్యాపారస్థులకు లాభము. 5,6 తేదీలలో కార్యాచరణలో త్రిప్పట. ప్రయాసము. ఆ పైని ధనయోగము, కార్యసిద్ధి, వినోదము, మృష్టాన్నభోజనము. కవులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 10,11 తేదీలలో నిలకడలేని స్థితి.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము యోగప్రదముగా వుంటుంది. ధనాదాయము బాగుంటుంది. మీ పనులనే కాకుండా ఇతరుల పనులను కూడా మీరు తలపెట్టి లాభకరముగా నెరవేరుస్తారు. కోర్టు వ్యవహారములు అనుకూలము. వాహనయోగము బాగుంది. శుభకార్యాలోచనలు చేస్తారు. ఇంట్లో పాడి, పసువుసంపద వృద్ధి అవుతాయి. ఖరీదైన వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 5,6 తేదీలలో కార్యతొంద

రలచే అలసట, ఆ పైని ధనలాభము, కార్య సిద్ధి, విందు, వినోదము. 11 తేదీని అనారోగ్యము.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము మీకు ఏమంత యోగకాలము కాదు. యత్నకార్యములకు ఆటంకాలు వస్తాయి. కార్యభారము ఎక్కువ. అనుకున్నట్టుగా డబ్బురానందున అవసరములు తీరక ఇంట్లో అసంతృప్తి కలుగుతుంది. వేళతప్పిన భోజనమువల్ల ఆరోగ్యము సరిగా వుండదు, వెంటనే శ్రద్ధతీసుకోండి. ఉద్యోగస్తులకు కొత్తసమస్యలు; వర్తకులకు ఆందోళన 5,6 తేదీలలో కార్యభంగము, శ్రమ, అశాంతి. 7,8,9 తేదీలలో పితృవర్గసహాయము, లాభం. రాజకీయవాదులకు మేలు కాలము. 10,11 తేదీలలో ఆరోగ్యభంగం.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈవారము అనుకున్న సౌమ్ము సకాలములో చేతికిరాదు. ఏ పనిచేసిందికి ఎటూ నిశ్చయించలేని ఆందోళనస్థితిలో వుంటారు. తలపెట్టేపనులకు మొదట్లో ఆటంకాలు కలిగినా వారాంతమున మిత్రసహాయమువల్ల కార్యసిద్ధి పొందుతారు. 5, 6 తేదీలలో ఆర్థికలోపము, కార్యభంగము. వర్తకులకు నిరాశగావున్నా వారాంతమున లాభం. 7, 8, 9 తేదీలలో మిత్రసహాయము, కార్యసిద్ధి, విచిత్రవస్తు సంపాదన, అన్యదేశస్తులతో పరిచయము. 10,11 తేదీలలో ఇంటియందుండు వారి ఆరోగ్యచింత.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము మీకు మిశ్రమయోగము. అనుకున్నట్టుగా పనులు జరగవు. ధనలోపము వుంటుంది. కోరిన సహాయము లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవముపై భారమువేసి కార్యసాధనకు ప్రయత్నించి తుదకు ఫలము పొందుతారు. వర్తకులకు మొదట్లో త్రిప్పట, ఆశాభంగము, వారాంతములో లాభము. 5, 6 తేదీలలో త్రిప్పట, కార్యభంగము, శ్రమ. 7, 8, 9 తేదీలలో పుణ్యపురుషుల సాంగత్యము, శాంతి, కార్యలాభము. 10, 11 తేదీలలో ఇంట్లోవున్న వృద్ధుల ఆరోగ్యముగురించి ఆందోళన.

మూల [యే, యో, బా, బీ]

ఈవారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. కార్యభారమువల్ల శ్రమ. కోరు వ్యవహారములు అనుకూలమైనా, మరికొన్ని కొత్తవి తలెత్తుతాయి. ఇచ్చి పుచ్చుకొనేచోట వివాదాలు వచ్చి మనోవ్యథ కలుగుతుంది. భార్య ఆరోగ్యము చెడేసూచనలున్నవి. విద్యార్థులకు చదువు సరిగాజరగదు.

వర్తకులకు శ్రమతోకూడిన లాభము. 5, 6 తేదీలలో కార్యభంగము, వివాదము. 7, 8, 9 తేదీలలో కార్యానుకూలత. కర్రతో బొమ్మలుచేయువారికి లాభము. 10, 11 తేదీలలో ఆరోగ్య చింత.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈవారము ఎంతప్రయత్నించినా కార్యసాధనలో ఫలముండదు. సాహసము, పట్టుదలగలవారగుటచేత ప్రయత్నములను విడవకుండా చిక్కులను విప్పుకొని మేలు పొందుతారు. సోదర సహాయమువల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి. జాగ్రత్తగావుంటే ప్రమాదములు తప్పవచ్చును. 5, 6 తేదీలలో కార్యభంగము, మనోవ్యధ. 7, 8, 9 తేదీలలో సోదర సహాయము, కార్యానుకూలత, శుభయోగము. పోలీసు, ఇంజనీరింగుశాఖల ఉద్యోగులకు యోగము. 10, 11 తేదీలలో ప్రమాదభయం.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈవారము మీకు యోగదాయకము. మీప్రజ్ఞచేత కార్యసాధనలో జయం పొందుతారు. అధికారుల సహాయము కలుగుతుంది. నూతన వ్యక్తుల పరిచయము కలుగుతుంది. బంధువుల కుశలవార్త వింటారు. గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, చిత్రకారులకు నటీనటులకు యోగకాలము. విద్యార్థులకు శ్రద్ధగా చదువు సాగుతుంది. 5, 6 తేదీలలో కార్యలాభము చేత్రిప్పట, 7, 8, 9 తేదీలలో కార్యసిద్ధి, మిత్రలాభము, కుశలవార్త, 10, 11 తేదీలలో శ్రమ, ఆందోళన.

శ్రవణము [జూ, జే, జో, ఖా]

ఈవారము మీకు యోగప్రదము. పోయిన వారములో పూర్తికాకుండా నిలిచిపోయిన పనులు ఈవారములో సానుకూలమవుతాయి రాబడితోపాటు అధికారము కూడా పెరు తుంది. ఉపాధ్యాయులకూ, న్యాయవా లకూ పండితులకూ మేలుకాలము. 5, 6 తే లలో త్రిప్పట, శ్రమ. 7, 8, 9 తేదీలల ధనలాభము, కార్యానుకూలత, సంతా మునకు క్షేమాభివృద్ధి, వర్తకులకు లాభమ 10, 11 తేదీలలో అలసట, అస్వస్థత. వా మంతా విద్యార్థులకు చురుకుగా చదు సాగుతుంది.

* ధనిష్ఠ [గా, గీ, గూ, గే] *

ఈవారము మీరుచేసే ప్రయత్నములన్నీ ఇంటా బయటా కూడా తృప్తికరముగా సా కూలమవుతవి. ఆర్థికస్థితి బాగుంటుంది. బంధ మిత్రులతో కలసి కవితాగోష్ఠి మొదల వినోదములలో పాల్గొంటారు. ఇంట్లో వా ఆరోగ్యము బాగుపడుతుంది. విద్యార్థులక చదువుపై ఉత్సాహము ఎక్కువవుతుంది నూలు, బట్టలు, వెండి వ్యాపారస్తులకు లా దాయకము. 5, 6 తేదీలలో కార్యములప త్రిప్పట, అలసట, 7, 8, 9 తేదీలలో ధనలాభము, కార్యసిద్ధి. కవులకూ గాయకులకూ, నటీనటులకూ యో కాలము. 10, 11 తేదీలలో అస్వస్థత.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈ వారము మీ ఆదాయము పెరుగ తుంది. యత్నకార్యాలు ఫలిస్తాయి. కవుల గాయకులు మొదలగు కళాకారులతో వినో దిస్తారు. దూరప్రయాణము, చేయవలసి వుంటుంది. సాంఘిక కార్యములలో పాల్గొంటారు. శుభకార్యాలోచనలు, బంధు మిత్రులతో విందుభోజనము జరుగుతవి. కవులకూ, గాయకులకూ. కళాకారులకూ, నటీనటులకూ మంచికాలము. 5, 6 తేదిలలో

నక్షత్రఫలితాలు

త్రిప్పట, శ్రమ, అధికఖర్చులు. 7, 8, 9 తేదీలలో ధనలాభము, ప్రయాణము, కార్యసిద్ధి శుభకార్యాలోచన, విందు భోజనము. 10, 11 తేదీలలో ప్రయాసము.

*** పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] ***

ఈ వారము డబ్బునుగురించి ఎక్కువ కష్టము కలుగుతుంది. సర్దుబాటు చేసుకోవలసిన విషయాలు ఎక్కువవుతాయి. ఏ కార్యము నెరవేరదు. అకాలభోజనమువల్ల ఉష్ణాధిక్యము కలిగి అనారోగ్యచిహ్నాలు కనబడిన వెంటనే శ్రద్ధతీసుకోండి. ఉద్యోగస్తులకు బాధ్యతలు ఎక్కువ. ఆదాయాభివృద్ధి. విద్యార్థులకు చదువు సాగదు. 5, 6 తేదిలలో త్రిప్పట. కార్యభంగము, అధికఖర్చులు. 7, 8, 9 తేదిలలో ప్రయాణము, రాజకీయవాదులకు లాభము. 10, 11 తేదిలలో ఆరోగ్యభంగము.

*** ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] ***

ఈ వారము ఏపని చేసిందికి సమాధానము కుదరక చికాకు పడవలసి వస్తుంది. ప్రతి ప్రయత్నము కొన్నాళ్లు పోయేక అయేటట్టు వుంటుంది. కార్యసిదికి శ్రమపడుతూ కూడా మాట పడవలసి వస్తుంది. సకాలములో డబ్బు చేతికి రాకపోవడము అన్నిటికన్నా పెద్ద ఆటంకము. అయినా వారాంతములో మీకన్న అధికారములో వున్నవారి సహాయమువల్ల కొన్ని ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు మనస్సు చంచలముగా వుండి చదువు సాగదు. 5, 6 తేదిలలో చాంచల్యము, ఆందోళన. 7, 8, 9 తేదిలలో ప్రయాణము, కార్యలాభము. 10, 11 తేదిలలో అనారోగ్యము.

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈ వారము మీరు ఎవరి సహాయముతో పని నెరవేర్చుకుందామనుకుంటారో ఆ వ్యక్తివల్లనే మీకు ఆటంకాలు కలుగుతాయి. డబ్బుకు తొట్రుపాటు ఎక్కువ. అయినను ఆధ్యాత్మికచింత కలవారగుటచేతను ఈశ్వరకృపవల్ల అన్నికష్టములు తీరుతాయనే ధైర్యములో వుంటారు. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలుగజేస్తుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు నిరాశ. విద్యార్థులకు చదువుమీద అనాసక్తి. 5, 6 తేదీలలో ఆటంకములవల్ల అశాంతి. 7, 8, 9 తేదీలలో సాధు సాంగత్యము. ఆత్మశాంతి. స్వల్పముగా అనుకూలము. 10, 11 తేదీలలో ఆరోగ్యచింత.

సర్వేషాం సన్మంగళాని భవంతు.

★



అనుమానాలు - అపవాదులు

యం. యల్.

కొందరుమంది అనవసరంగా అవతలివారిని అనుమానించి, వారిమీద అపవాదు వేసి ఇళ్ళమీదికి యుద్ధాలకొస్తారు. ముఖ్యముగా ఈ ప్రవర్తన స్త్రీలలోనే ఎక్కువేమోనని నా అభిప్రాయం. ఎందుకంటే ఇంతవరకు నా దృష్టిలో పడ్డ సంఘటనలన్నీ స్త్రీమూలముగా జరిగినవే కనుక.

ఇవి నిజంగా జరిగిన సంగతులు వ్రాస్తున్నాను. నా కళ్ళతో చూసినవి. ఈ సందర్భంలో మా యింటినిగురించి కొంత చెప్పడం అవసరం. మేమున్న ఇల్లు చాలచిన్నది. రెండుగదులు మేడమీద. వాటికి ఆంధ్రప్రదేశ్ కాపిటల్ అవుటవల్లనో, లేక ముందునుండి అంతేనో, 80 రు అద్దె. హైదరాబాదులో సాధారణంగా మేడమీది పోర్షన్లకు ఎత్తు చాల తక్కువగా యుంటుంది. ఇంక ఆ యిళ్ళ వెంటిలేటర్లు మరీ ఎత్తుతక్కువగా వుంటాయి. అంటే కాస్త పొడగరి కాళ్ళు ఎత్తి చూస్తే అవతలకి కన్పడేటట్లు. అన్ని ఇండ్లసంగతీ ఎలావున్నా మా యిల్లు మాత్ర మంతే. బాత్ రూం మా వంటియింటి వెంటిలేటర్న లోంచి చూసే కన్పడుతుంది. మా గదులప్రక్కనే ఇంటివారి కోడుకు, కోడలి పడకగది. మిగతా కాపురమంతా క్రిందనే.


క్రిందటి వేసవి సెలవులకు మా మఱది వచ్చాడు గుంటూరునుండి. అతనికి పదునేడు పదునెనిమిది సం॥లకంటే మించదువయసు. చూపులకి మాత్రం ఎఱ్ఱగా, పొడవుగా వుంటాడు. సికింద్రాబాదు నుండి మా పినతండ్రి కూతురు సరళకూడా వచ్చింది, సెలవులు మాతో జాలీగా గడపవచ్చని. దానివయస్సు 15, 16 సం॥ లుంటుంది.

ఆ రోజు మావారు ఆఫీసుకెళ్లారు. నేను సరళా, తోడికోడళ్ళు మాటినీ సినిమాకు బయలుదేరాం. మా మఱది రాముని రమ్మంటే తలనొప్పిగా వుందనీ, అప్పటికే తను మూడుసార్లు చూశాననీ చెప్పాడు. ఇంకతన్ని బలవంతపెట్టడం యిష్టంలేక పోయింది. అందులో అవి ఇన్ఫ్లూయంజా రోజులు.

మేము తిరిగి ఇంటికొచ్చే టప్పటికి మా వాకిలిముందు ఇల్లుగలవారి కుటుంబం యావన్మందీ మా చుట్టుముట్టారు. మేము నిర్ఘాంతపోయి లోపలికెళ్లాము. మంచంమీద గోడవైపు ముఖం పెటి మా మఱది పడుకున్నాడు. ఇంటి యజమాని ముసలాయన నోటినుండి తిట్లవర్షం కురుస్తున్నది. మనిషి ఆవేశపడి పోతున్నాడు ఒక ప్రక్కగా, వారికోడలు జుట్టు విరియబోసుకుని, భోరు భోరున శోకాలు పెడుతున్నది.

ఇంతకీ ఈ రభస పర్యవసాన మేమంటే, మా రాము వంటయింటిమీది కిటికీలోంచి బాత్ రూంలో స్నానంచేస్తూన్న ఆ 35 ఏండ్ల వయస్సుగల ముగ్గురు పిల్లల (పెద్దపిల్ల 12సం॥లు) తల్లిని చూశాడుట. ఇది అసలు సంగతి.

ఇంక వారు పెట్టే బూతులు, తిట్లు విన



కాకరపందిరి

—కోటమర్తి హైమవతి, పిఠాపురం.

అనుమానాలు - అపవాదులు

లేకపోయా మనుకోండి. అటువంటి వారితో మనం కల్పించుకున్నా లాభంలేదు. వాళ్లి నందర్నీ సర్ది చెప్పి మెల్లిగా లోపలికి వచ్చి అతని వంటిమీద చెయ్యివేసి చూశాను. కాలిపోతోంది వళ్లు. 104°ల జ్వరం. గోడ ప్రక్క ముఖం పెట్టుకుని ఏడుస్తున్నాడు. అతన్ని మెల్లిగా సముదాయించి అడిగాను సంగతేమని. అతనన్న దిది: "వదినా! నువ్వ నమ్ము నమ్మకపో. నాకు నిజంగా ఏమీ తెలియదు. మీరు బయల్దేరేప్పటికే నాకు జ్వరముగా నున్నది. దాహమయి వంటింట్లోకి వెళ్ళాను. మంచినీళ్ళు త్రాగి, మళ్ళీ కాపిని నీళ్ళుపోసి కడగటాన్కి ఎవరూ లేరుగదా అని బాత్‌రూమ్‌లోకి పోశాను విసరి. (ఆ ఇంటికి నీరుపోయే తూము లేదులెండి) మళ్లీ బయటికి వెళ్ళలేక. నాకసలు ఆమె స్నానం చేస్తున్నాదని తెలియనే తెలియదు. పోనీ సరళ, నేను ఇన్ని రోజులనుండి వున్నాం గదా ఆమెయెడల నా ప్రవర్తన అసభ్యంగా నున్నదేమో అడుగు" అని వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పాడు. నిజానికి సరళ చిన్నపిల్ల. ఏ విధమయిన పోకిరీ ప్రవర్తన మా చెల్లియెడల నేను చూడలేదు. అభం, శుభం తెలియని వారి నిలా బాధపెట్టటం ఏం బాగుంది? మా వారితో ఆరోజే ఖాళీ చెయ్యమనిచెప్పాను. మరి తప్పతుందా?

ఆ మరునాడే ఆ యింటి దగ్గరలో యింకొక మేదరవాళ్ళ యిల్లు ఖాళీగా వుంటే, మాకా యిల్లు ఎక్కువ అద్దె అయినాగూడా అవసరాన్ని బట్టి చేరక తప్పింది గాదు. మేము భార్యాభర్తలం. మాకు రెండుగదులు సరిపోతవి. ఇంకొక పెద్ద రూము విడిగా నున్నది. అది మా కనవసరం. ఫామిలీకి ఇవ్వటానికి ఒక్క గదిలో ఎవరుండగలరూ?

ఇంతలోనే మెడ్రాస్ నుండి కొన్ని ఆఫీసులు యిక్కడికి రావటం వలన అక్కడ పనిచేస్తున్న మా కజిన్ బ్రదర్ వచ్చి మా యింట్లో దిగాడు. అతను బ్రహ్మచారి. సరే యింకేం మారూమ్‌లోనే వుండమన్నాము.

ఆ మరునాడే యిల్లుగలాయన మావారికి చెప్పాడుట, 'మీకారూమ్ ఎక్కువగా వుంటే ఎవరికైనా ఫామిలీ కివ్వండిగాని వంటరి మగవాళ్ళకి మాత్ర మివ్వద్దు' అని. మావారు అతనికి మాకు వున్న బంధుత్వం చెప్పి సర్దారుట. కానీ యింటి యజమానురాలు మాత్రం గునుస్తూనే యున్నది.

వచ్చి రెండు రోజులయినా అయిందో లేదో అతనికి కూడా ఫ్లూ జ్వరం పట్టుకున్నది. తలనొప్పితో చాల బాధ పడుతున్నాడు. ఆ రోజు ఆఫీసుకి లీవు పెట్టాడు. నేను భోజనమది అయ్యాక వెళ్ళి అడిగాను ఎట్లా వుందని. అమృతాంజనముంటే ఇయ్యి అన్నాడు. తీసికెళ్ళి సీసా చేతికిస్తుండగా యిల్లుగలామె ఎందుకో బహుశః సి. ఐ. డి. పనికో మీదకి వచ్చి మమ్మల్ని చూసి అటాగే చరచర మెట్లుదిగి వెళ్ళిపోయింది' నేనేమీ అప్పుడు పట్టించుకోలేదు.

మర్నాడు పత్రిక చదువుకుంటూ గడపలో కూర్చున్నాను. క్రిందనుండి సంభాషణ విన్పిస్తున్నది. అందులో నాపేరు గూడ వుండటాన ఇంకొంచెం జరిగి వింటున్నాను. ఇంటి యజమానురాలు క్రిందనే యింకొక ప్రక్క కిరాయికుంటున్న మరాటీ ఆమెల సంభాషణ.

ఇంటి ఆమె గొంతు — చూసినావా! చంద్రమ్మా! నేనప్పుడే అనలేదా మొగాళ్ళకియ్యరాదని కిరాయికి. మా మొగోళ్లు ఇన్పించుకుంటేగా? మీద రూములోనున్నాయన ఈయాల దఫ్తర్‌నే పోలేదు. నేను ఆమెతో పనుండి పోతిని. ఆమె అడనే యున్నది. అన్నట మళ్ళ-

మరాటీ ఆమె గొంతు — అవ్వ అవ్వ ఆయన నూస్తే అట్టనే యున్నాడు. పొద్దుగాల పాయిఖానకి పోతూ నాయంక అట్టనే నూస్కుంటూ పోయిండు. మొగోడికి కిరాయికిచ్చి ఎవలుంటరు?

ఇంక నా పరిస్థితి ఎట్లా వున్నది. వ్రాయనవసరం లేదనుకుంటాను. నాలుగయిదు, నిమిషాలవటకు షాక్ తిన్నట్లయిందనుకోండి.

అతను వచ్చి రెండు దినాలయినా అయిందో లేదో చూడండి మరి. అయినా అపవాదు లెయ్యటాన్కయినా వీలూ, చాలూ, వరసా, వాయి లుండక్కర్లే? మన స్త్రీలలోనే ఇంత నీచమైన బంధుత్వాలుగల వారుంటారంటే ఎంతో సిగ్గుపడవలసిన విషయం.

మరొక విషయమేమంటే సాధారణంగా పురుషులూ, స్త్రీలనే అనుమానించుట, స్త్రీలూ, స్త్రీలనే అనుమానించుట జరుగుతూంటుంది. తోటిస్త్రీలని గడ్డిపోచ సాధారంగా తీసికొని వారిమీద అపవాదులు రుద్దటంకంటే ఘోరమైన పనింకొకటి లేదని నా అభిప్రాయం. అదే పల్లెలలో నయితే ఏదయినా కాస్త ఆధారం దొరికిందంటే ఊరంతా టముకు, టమాలేసే స్త్రీ లుంటారు. వారికసలు ఇటువంటి సమాచారాన్ని అందచెయ్యందే నిద్రగూడ పట్టదు. ఇట్లాంటివి చాలా మంది నోళ్లల్లో వింటూవుంటాము.

ఒకవేళ క్రొత్తగనుక మా కజిన్ బ్రదర్ ఎవరున్నారోనన్న క్యూరియాసిటీ వలన చూశాడే అనుకోండి. ఆమె మాత్రం అతన్ని చూడందే అతను తనవంక చూస్తున్నాడనెట్లా తెలిసింది? ఆమె చేసిన దంతమాత్రం తప్పుకాదు. అదే పురుషుని యెడల మహాపరాధం.

పురుషులలో అవినీతి ప్రవర్తన గలవారు లేరని మాత్రంకాదు నేనన్నేది. సందినీ, మందినీ ఏకంచేసి ప్రతి చిన్న విషయానికి పరువుగల కుటుంబాల యువకుల్ని రచ్చకీడ్చి ద్విపాద పశువులుగా వారిని భావించుట మన స్త్రీలకెంత మాత్రం తగదని నా ఉద్దేశ్యం. తగినంత కారణముంటే అది వేరొక సంగతి.


తోటి స్త్రీలని గూడ పూర్తిగా సంగతి సందర్భాల నవగాహన చేసికోకుండా, అనుమానించి, అవినీతి సంబంధాలు కట్టి, అపవాదుల్ని లేవతీయటం కంటే ఇంకా హీనమేమున్నది?

ఆ జాతికి సంబంధించిన స్త్రీలంతా 'వనితాలోకం, చేస్తున్న వుపకారాల్లోయిది గూడా ఒకటిగావించి తమ తమ ప్రవర్తనల్ని మార్చుకుంటారని ఆశిస్తూ వ్రాశానే గాని స్త్రీలని ఎత్తిపొడిచి అవమానించాలన్న ఉద్దేశ్యముచేత కాదని పాఠకులు గ్రహించ ప్రార్థన. ★



చీరెల అంచు కు డిజైను

—పి. విజయలక్ష్మి, క్రోసూరు.



కడుపులో బల్లలు

రుద్రాక్ష 8 సార్లు చుట్టుగా అరగదీసి చనుబాలతో రోజువిడిచి రోజు పది పూటలు ఇచ్చినయెడల బల్లలు (లివర్లు) పెరిగిన పసిపాపలకు అద్భుతంగా పనిచేస్తుంది.

తలనొప్పి

ఉత్తరేణి ఆకురసం పార్శ్వపు తలనొప్పులకు బాగా పనిచేస్తుంది. ఒక ప్రక్క తలనొప్పి వుంటే, రెండోప్రక్క చెవిలో ఆ ఆకురసం పోసిన వెంటనే నివారణమవుతుంది.

నత్తి

సాంబ్రాణిచెట్టు ఆకు ఎండించి చూర్ణం చేసి 8 గురిగింజల యెత్తు చూర్ణం తేనెతో సేవించిన నత్తి నయమవుతుంది.

చెవులో పుండ్లు

బీర ఆకు రసం రెండుబొట్లు పోస్తే చెవిలో చీము, పుండ్లతో బాధపడేవారికి బాగా పనిచేస్తుంది.

తలలో పుండ్లు

చిన్న పిల్లలకు తలపైలేచే పుళ్ళకు ఆముదపు ఆకు నూరి తలపైపూసి ఒకగంట వున్న తరువాత స్నానం చేయిస్తే పుండ్లు మానుతాయి.

కర్పాణి

వక్కపెంటిగడ్డ తెచ్చి బాగా కాల్చి బూడిదచేసి వెన్నతో కలిపి కర్పాణి గజ్జిపై పూతపూసిన ఆ చీడ తొలగిపోతుంది.

గజ్జికురుపులు

చీముతో కూడిన గజ్జి కురుపులకు కచ్చూరాలను వెన్నతో అరగదీసి పూసిన తగ్గుతయి.

చలిజ్వరాలు

ఇండుపగింజ నేతిలో ముంచి పెనంమీద వేసిన వెంటనే పొంగుతుంది. అది తీసి వెంటనే నూరి 4 మోతాదులు తేనెతో యిస్తే చలిజ్వరం (మలేరియా) తగ్గుతుంది.

చంటిబిడ్డగుణం

చంటిపిల్లలకు సర్వసాధారణంగా బాలపాప చిన్నెలనే జబ్బు వస్తుంటుంది. వాటికి పిప్పిలి మాడ్చిన చూర్ణము 1 గురిగింప్రమాణం వెన్నలో కలిపిగాని, చనుబాలతో కలిపిగాని ఇచ్చిన బాలపాప చిన్నెరోగాలు పోతాయి. లేదా మూర్ఖండాకు పసరు రెండు చుక్కలు రెండు ముక్కుల్లో పోస్తే బాలపాప చిన్నెలు తగ్గుతాయి.

పడిశము

పటిక పొంగించి చూర్ణముచేసి 1 గురిగింజ యెత్తు తేనెతో ఇస్తే పిల్లలకు వచ్చే పడిశము, దగ్గు, జలుబు నిమ్మళిస్తుంది. ఆ పటిక చూర్ణాన్ని పన్నీరులో ఇస్తే కోరింత దగ్గు మారిస్తుంది.

—సేకరణ: తాడాల వెంకటసూర్యనారాయణ.)

* * *

వేపచెట్టు

వేపచెట్టు నీడన వేసవిలో విశ్రమించిన చల్లగాను, హాయిగానూ వుంటుంది. క్షయరోగులు ఈ చెట్టుక్రింద నివసించిన చాల మేలు చేస్తుంది.

వేపచెట్టు ప్రతిభాగమూ ఉపయోగపడుతుంది. దీని చెక్క కషాయముగాని లేక చూర్ణముగాని సేవిస్తే చలువ చేస్తుంది. దాహము, వాంతి, రక్తపైత్యము, చర్మవ్యాధులు, దురద సర్వమేహములు నశిస్తాయి.

దీని చెక్కతో గాఢ కషాయము గంటకొకసారి యిస్తే చలిజ్వరాలు పోతాయి.

దీని పుల్లతో అనుదినము దంతధావనము చేస్తే నోటి దుర్గంధముపోయి, రుచిపుట్టిస్తుంది.

వేపనూనె పైన మర్దించిన మేహవాతపు నొప్పులు పోతాయి. వేపచిగుళ్ళు (లేత ఆకులు) మెత్తగానూరి గచ్చకాయ ప్రమాణము సేవించిన పురాణ విషమజ్వరములు పోతాయి.

వేప ఆకు, పసుపు నూరి కట్టిన సెత్తురు గడ్డలు, రాచపుండ్లుసహా నివరింపజేస్తుంది.

పండిన వేప ఆకులు పొగవేస్తే దోమలు నశిస్తాయి. వేపనూనెను దీపములకు ఉపయోగించవచ్చును. ఎండుపువ్వును కూరగా వాడుతారు.

నండూరి జగన్నాథరావు.



చీరెఅంచుకు మరో డిజైను

—పి. జయలక్ష్మి, క్రోసూరు.

ఎవరి ఇంటి పనులు వారే...

కారుమంచి మారుతి

ఎంత కలిగినవాళ్ళయినా ఎవరి యింట్లో పనులు వారు స్వయంగా చేసుకోడంలో తప్పులేదు. కొందరు హెచ్చులకు పోయి "నాకలవాటు లేదమ్మా... నేను చేసుకోలేనమ్మా" అని అయిందానికి కానిదానికీ పనిమనుషుల్ని పెట్టి చేయించుకోవడం చాల మందికి అలవాటు.

ఒంట్లో కావలసినంత శక్తి ఉంచుకుని కూడ స్వంతపనులను యింకొకరిచేత చేయించుకోవడం సోమరితనాన్ని పెంచుకోవడమే అవుతుంది. అట్లాగని ప్రతిపనీ మనమే చేసుకోవాలని కాదు.

సాధారణంగా ఈరోజు కట్టుకున్న చీర మరునటిరోజు ఉదయం ఉతికి ఆరవేసుకుంటారు. పిల్లల గుడ్డలుకూడ ఈవిధంగానే ఉతుక్కుంటూ వారానికో పదిరోజులకో ఒకసారి యిస్త్రీకి వేస్తుంటే గుడ్డలు ఎక్కువ కాలం మన్నుతాయి. కొందరు ఒళ్ళువంగక వారానికి ఒక పెద్దమూట తయారుచేసి, చాకలి రాగానే వాడిమొహాన పడేస్తారు.

ఈ రోజులలో 'జీవన ప్రమాణ' మనుసరించి కనీసం అయిదారు రూపాయీలు యివ్వందే పనిమనిషి రాదు. అంట్లూ చెంబులూ తోమి, యిల్లు వాకిలీ ఊడ్చిపోతుంది. (మిగిలితే) అన్నంపెడుతుండాలి. ఒక మెతుకు తక్కువయిందంటే పేచీ తప్పదు. ఒప్పుకున్న పనులకంటే ఒక్క పిసరు ఎక్కువచెప్పినా చెయ్యరు. ఇలాంటి బాధలన్నీ పడుతూ నయినా పనిచేయించుకుంటారుగాని, దాన్ని మాన్పించి తమ పని తాము చేసుకోలేరు.

కొందరు ఉదయమే లేచి ముక్కులించి (అతికష్టంమీద) ఆప సోపాలు పడుతూ కాఫీకాచి తను కాస్త గొంతులా పోసుకుని పనిమనిషి తోపాటు వాగుతూ ఉంటారు. ఎందుచేతనంటే వీళ్ళకేమో చేయాల్సిన పనేమో ఉండదు. ఉన్న అంట్లూ చెంబులు పనిమనిషికి పడేసి ఏదో వకవిషయం మీద పేచీపెట్టుకుని కూచుంటారు. దాని పాచిపనీ అదీ అయినాక యిదొక ప్రోగ్రాంమాదిరిగా ఉంటుంది యిరుగు పొరుగు వాళ్ళకు.

అంటే పనిమనుషుల్ని పెటుకోవద్దని కాదు. తగినంత తీరిక, ఓపిక ఉన్నప్పుడు యింటిపనులు ఎవరికి వారు చేసుకోవాలి. అలా చేసుకున్నదువల్ల ఆర్థికంగాను శారీరకంగాను లాభమేగాని నష్టమేమీ లేదు. తప్పనిసరయితే తప్ప... అంటే జబ్బుచేసి ఒంట్లో కులాసా లేకపోయినా, లేక పెద్ద కార్యాలపట్ల మినహా...ఎవరి యింటిపనులు వాళ్ళు చేసుకోవచ్చు.

"ఆపిల్ల చదువుకున్నది...... మొగుడికి అన్నం ఏమి వండిపెడుతుంది?" అని చదువుకున్న ఆడవాళ్ళు ఇంటిపనులు చేసుకోరు అని ఒక దురభిప్రాయం చాలామందిలో ఉంది. అది నిజంగా దురభిప్రాయం అనడానికీ వీల్లేదు. చదువుకున్నంతమాత్రంచేత గర్వం బలిసిపోయి కొందరు తమరు చేసుకునే పనులుకూడ అత్తగారు, ఆడబిడ్డలమీద రుద్దేవారున్నారు కాబట్టి...... అనుకునే వాళ్ళకు చాన్సు దొరుకుతున్నది.

ఎంత విద్యావంతులయినా, నిత్యకృత్యాలైనపనులు స్వయంగా చేసుకోవడం చాల మంచిది.

అన్ని రంగాలలోనూ స్త్రీలు ముందంజ వేస్తున్నారు. భారత మహిళలు వారికున్న అవకాశాలమేరకు చక్కగా వినియోగించుకుని అభివృద్ధికి పాటుపడుతున్నారు. వారు ఎంత శ్రమపడినా దేశంలో ప్రతి స్త్రీకూడ ఆత్మపరిశీలన చేసుకుని తనూ ఉడతాభక్తిగా సంఘ అభివృద్ధికీ, పెద్దలు చేస్తున్న మంచి కార్యాలకూ సహాయం చేయకలిగానని సంతృప్తిపడటానికి ప్రయత్నించాలి. చిన్న చిన్న యిటుకలు కలిస్తేనేకాని భవన నిర్మాణం జరగదుకదా!

దీనికీ ఎవరింటిపనులు వారు చేసుకోవడానికీ సంబంధమేమిటని కొందరు విమర్శించవచ్చు "ఉట్టి కెక్కలేనమ్మ స్వర్గానికెమి ఎక్కుతుందని" మన తెనుగునాటి ఒక సామెత ఉన్నది.

పూజ్యబాపూజీ సిద్ధాంతాలలో ఎర్రసిరాతో అండర్ లైన్ చేసుకుని ఆచరించవలసిన వాటిల్లో "ఎవరిపనులు వారు చేసుకోవాలి" అనేదని ప్రతివారికీ తెలును.

ఏడు జన్మలు!

వివాహిత అయిన స్త్రీ తాలూకు దినచర్యపరికిస్తే స్త్రీ ప్రతిరోజూ ఏడు జన్మలు ఎత్తుతుందనడంలో అతిశయోక్తిలేదు.

ఉదయం లేవగానే దంతధావనం చేసుకొని వాకిలి శుభ్రంచేసి, చక్కగా ముగ్గులు దిద్ది, వంట పాత్రలు శుద్ధిచేసుకొని, ఇల్లు మంగళప్రదంగా, శోభాయమానంగా అలంకరించుకుంటుంది. ఇవన్నీ సరిదిద్దుకోవడములో "దాసీ" జన్మ ఎత్తుతుంది.

ఉదయమే భర్తకు కాఫీ, ఫలహారములు వేడి వేడిగా సమర్పించుకొని వంటఇల్లు సర్దుకొని శుచిగా, శుభ్రముగా, హితవుగా భోజన సదుపాయములు కలుగజేయటంలో "వంటపుట్టి" అవతారం దాల్చుతుంది.

భర్తని ఆఫీసుకు పంపి పిల్లల బట్టలు, భర్త తాలూకు విడిచిన వస్త్రములు మధ్యాహ్నం తీరుబడి కాలంలో సబ్బు, సోడా ఉపయోగించి "ఇంటి చాకలి" అవుతుంది.

మధ్యాహ్నం కాఫీ ఫలహారాలు అయిన తర్వాత చల్లబాటున పూలమొక్కలకు నీళ్లుపోసి చెట్లకి పూసిన పువ్వులు ఒకటి ఒటిగా కోసి దండలు గుచ్చి "తోటమాలి" అవుతుంది.

భర్త ఆఫీసునుంచి ఇంటికి రాగానే పగలంతా కష్టపడి పనిచేసిన శ్రమకు సేద దీర్చుతూ తమాషాగా కబుర్లు చెప్పుతూ భర్తకి సంతోషం కల్గిస్తూ "స్నేహితురాలు" పాత్ర ధరిస్తుంది.

రాత్రి భోజనంకాగానే భర్తకి ఇంటి విషయాలలోను, అవసరమైన విషయములలోనూ మంచి చెడ్డా తిమ్మరుసులా ఆలోచించి తగు సలహోయిస్తూ "మంత్రి పీఠం" అలంకరిస్తుంది.

ఇక శయనాగారములో రంభ అయి ఆరోజుకు తన జన్మలు చాలిస్తుంది.

—వేములకొండ దమయంతీ శ్రీహరిరావు
కాకినాడ.]

పిల్లల పనులు

ఆరోజు నే వూరునుంచి వచ్చాను. స్నాన భోజనాదులు అయేసరికి ఒకటిన్నర అయింది. పడుకున్నానుగాని నిద్రరావటం లేదు. ఏదన్నా నవల చదివితే నిద్రవస్తుందని నా లైబ్రరీ గదిలోకి వెళ్ళాను. పుస్తకాల బీరువా తాళం తీసేవున్నది.

ఏమిటా అని తలుపులు తెరిచి చూశాను. పుస్తకాలు ఎక్కడివి అక్కడే సర్ది వున్నాయి. ఒక పుస్తకం తీసి చూశాను. ఒక్కదానికి కూడా అట్టలు లేవు. లోపల సినిమా తారకల తాలూకు బొమ్మలుకూడా చింపేసి వున్నాయి.

పత్రికలూ, ఫిల్మిండియా, మొదలగు పుస్తకాల అటలే గాదు. లోపల బొమ్మలన్నీ కత్తిరించబడి వున్నాయి. పట్టరానికోపం వచ్చిందినాకు. చిరిగిపోయిన పుసకాలను చూస్తూంటే నిజంగా దాకు ఏడుపుకూడా వచ్చింది. ఒకటా. రెండా, ఎన్నో పుసకాలు. కొద్దినెలలనుంచి వాటి నన్నింటినీ జాగ్రత్తగా దాచుకుంటున్నాను. నాలుగురోజులు యింటివద్ద లేకపోయేసరికి యిన్ని పుస్తకాలు ఈ విధముగా చిరిగి పోయినవిగదా అనుకున్నాను.

నా పుస్తకాల బీరువా తాళం తీసింది ఎవరక్కా అనడిగాను. నే చూడలేదమ్మా అన్నది.

"పుస్తకాల్లో వున్న బొమ్మలన్నీ చింపి వేసి వున్నాయి ఒకటా రెండా" వుద్వేగంతో అన్నాను.

ఏమోగాని రాజేంద్రుడు ఒకవాడు నీ లైబ్రరీగదిలోంచివస్తున్నాడు. బాగా చెమట పటేంది. చేతిలో జగురు భరిణ వున్నది. ఏమిటో అని మాఱుకున్నాను. అడగ లేదు అన్నది.

అయితే వాడే ఈ పని చేశాడక్కా అన్నాను. యింటికిరాగానే వాడికి ఎట్లా బుది చెప్పాలి? ఏవిధముగా శిక్షించాలి? అనే దేనాఆలోచన. వాడు స్కూలునుంచి ఎప్పుడు వస్తాడా? అనిఎదురుచూస్తున్నాను.

నాలుగున్నరకి రాజేంద్ర వచ్చాడు. వాడెంతో సంతోషం గాను, వుషారుగానూ వున్నాడు. వాడి వుషారు చూస్తూంటే నాకు అమిత కోపం కలిగింది. పుస్తకాలు డ్రాయర్ మీదకి విసిరి, అక్కా-అక్కా అంటూ ఏదో చెప్పబోయాడు.

వాడు చెప్పేది వినకుండా కోపం కొద్దీ చెంప ఛెళ్ళుమనిపించాను. ఎందుకక్కా? అన్నాడు. చిక్క మొహం వేసి.

యిట్లారా వెధవా అంటూ గదిలోకి తీసుకెళ్ళి, యిట్లా చేసింది నువ్వేగా అన్నాను పుస్తకాల వంక చూపిస్తు.

వీరపనేని సరోజినీదేవి

"నే...నే...ను" భయపడుతూనే జవాబిచ్చాడు.

వీటిని చింపవలసిన అవసరం ఏమిటి? అని వాడిని ఓపికవున్నంతవరకూ కొట్టాను. అప్పటికికాని కోపం చలారలేదు.

రాత్రి చదువుకుంటున్నాకూడ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. వాడిమీద జాలికూడా కలగలేదు.


"ఎందుకే అంతలాకొట్టావు వాడిని" అనడిగింది అక్క.

కొట్టనూ. వెధవని! ఎన్ని పుస్తకాలను సర్వనాశనంచేశాడు అన్నాను. మరురోజు సాయంకాలం స్కూలునుంచి రాగానే పరాపరి నాదగ్గరకొచ్చి పెద్ద పుస్తకం (బాల రామాయణం) చక్కనిగోల్డు పెన్నూ కూర్చుని వుంటే నావళ్ళో పడేశాడు.

ఎక్కడివి యివి ఆశ్చర్యపోతూఅడిగాను.


నా బొమ్మల అల్బంకి ఫస్టుప్రయిజ్ క్రింద ఈపుస్తకం వచ్చింది. అల్బంని బాగా తయారుచేసినందుకు మెచ్చుకుని D. E: O. గారు ఈ పెన్నూ యిచ్చారు. వీటికేగా నన్ను అంతగా చావబాదేశావు. D. E. O. గారు వస్తాడని ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. నాకేమీ తోచలేదు. ఒక అల్బం తయారుచేయాలనుకున్నాను. మరి బొమ్మలు లేవుగా? నీదగ్గిర సినిమా పత్రికలు వున్నవని

(48-వ పేజీ చూడండి)



ముగ్గు: "చదరం"

—ఎస్. జయలక్ష్మి, కాకినాడ.



సహవాస దోషం

దద్దనాల రంగనాయకమ్మగారు ఆఖరున చెప్పినట్లు వారి "నేరాలు నేర్పే గారాలు" నిజంగా పిల్లల మనస్తత్వాలకు ప్రతిబింబం.

గారాబం చెయ్యటంవల్ల పనికి రాకుండా పోతున్న పిల్లల్ని మనం నిత్యం చూస్తూనే ఉంటాము. రాముడంతటివాడే ఆకాశంలో కనపడ్డ చందమామ కావాలని మారాం చేస్తే అద్దంలో ప్రతిబింబం చూపిస్తే గాని ఊరుకోలేదు ఈ కాలం పిల్లల్ని అట్లా నమ్మించలేమనుకోండి.

పిల్లలు చెడిపోవడానికి తల్లి తండ్రులు కొంతవరకుబాధ్యులు గాని పూర్తిగా కాదు; మా ఆడపడుచు కొడుకున్నాడు. చదువుకని అమ్మమ్మ దగ్గరుంచారు. వయస్సుకొద్ది అయినా బుద్ధులు చాలా పెద్దవి. చెప్పినమాట వినటమనేది లేదు. వాడుకోరింది చెయ్యకపోతే ఆపూట అన్నంతినడు సరిగదా, కిటికీనుంచి రాళ్ళు, యిసక చిమ్ముతాడు, వయిన వయినాలుగా తిడుతూ. పెద్దలపెంపకంతోపాటు సహవాస దోషం అంటకుండా కూడ జాగ్రత్త పడాలి.

—కారుమంచి మారుతి, ఒంగోలు

* * *

నలుపులో నాణెం

"నల్లనివాళ్ళంటే" అన్న వ్యాసం చదువుతూంటే నాకు ఒకామె జ్ఞాపకము వస్తుంది. ఆమె మాఇంటిప్రక్కామే. ఆమె పిల్లలు తెల్లగా వుంటారు. వారి పెద్దమ్మాయికి సంబంధాలు చూస్తూవుంటే ఎరుగున్నామె ఒకరు "ఏమిటండీ. మంచి మేనరికం వుంది. ఆస్తికి ఆస్తి! పైగా పిల్లాడు స్కాలర్ షిప్ మీద అమెరికా వెళ్తున్నాడు. ఇలాంటిది వదిలిపెట్టుకుంటారా?" అంటే ఆమె, "పిల్లాడు నలగా వుంటాడు. మా అమ్మాయికి తగడు" అంది. ఆ మేనల్లుడే నా స్నేహితురాలిని కట్నంపుచ్చుకోకుండా పెండ్లి చేసుకున్నాడు. ఆ అమ్మాయి చాలా బావుంటుంది. మేమిద్దరం కలసి ఒక రోజున పేరంటం వెళ్ళాము. అక్కడికి మాపక్కింటి ఆమె కూడా వచ్చింది. వచ్చింది వూరుకోక నన్ను 'నీ ఫ్రెండుకదే ఆ అమ్మాయి. బంగారపుబొమ్మలాంటిది వాడిని ఎలా చేసుకొన్నదమ్మా? కట్నం పుచ్చుకోలేదుటగదూ, అయినా అలాంటివాడికి కట్నం ఎవరుఇస్తారులే!" అంటూ మొదలుపెట్టింది. ఆ పిల్లాడు నల్లగా వున్నా చక్కగా వుంటాడు. తనకు కావలసినంత ఆస్తి వుంది, పైగా తను సంపాదించుకొంటున్నాడు. ఒక్కడే పిల్లాడు. కట్నం ఏం చేసుకొంటారు? ఆవిడ దుగ్ధ ఏమిటంటే తన కూతురుకు అంత అదృష్టం పట్టలేదనే......

—కుమారి కె. శాప,

* * *

ఏ పుస్తకాలు చదవాలి?

"మిగతా; ముక్కాణీ ఏంజేశావు?" అనే వ్యాసంచదివి ఆశ్చర్యపడ్డాడనీ, ఈరోజుల్లో నూటికి నూరుపాళ్ళూ—భార్యలు భర్తలను తమచేతిలో పెట్టుకునేవారేననీ ఈమధ్య ఎల్. వెంకట్రమణగారు వ్రాశారు.

ఏదైనా నూటికి నూరుపాళ్ళూ అన్నది దేనికీ వర్తించదనుకుంటాను. భర్తను కీలుబొమ్మగా జేసుకుని, తనమాటకు అడుగు దాటటానికి వీలులేకుండా చేసుకున్నామని ఎంతోగర్వంతో చెప్పుకునే శ్రీమతులూ వున్నారు; తమరాకకోసం వేయికళ్ళతో ఎదురుచూసే భార్యను జీవంలేనియంత్రంలా చూస్తూ స్నేహితులతో కులాసాగా కాలక్షేపంజేసే శ్రీయుతులూవున్నారు. మంచీ, చెడ్డా అన్నది స్త్రీలలోనూ వుంటుంది; పురుషుల్లోనూ; వుంటుంది. ఒకరి కష్టసుఖాలు ఒకరు అర్థంజేసుకున్నప్పుడే సంసారం సుఖంగా వుంటుంది.

తర్వాత మందపాటి శేషమోహనరావుగారూ గ్రంథాలయాలను గురించి వ్రాసింది చదివాను. స్త్రీలు నవలలూ, డిటెక్టివ్ లే, కాని ఉత్తమ గ్రంథాలు చదువరనీ ఈ భాగ్యానికి గ్రంథాలయాలెందుకనీ వ్రాశారు. పట్నం సంగతైతే నాకు తెలియదు గానీ పల్లెటూళ్ళలో స్త్రీలు గ్రంథాలయాలలో పుస్తకాలకంటే భర్తతెచ్చినవో లేకపోతే, పక్కింటివారిదగ్గర తెచ్చుకున్నవో ఎక్కువ చదువుతారు. భర్త తెచ్చినవైతే ఫరవాలేదుగానీ పక్కింటివారు తెచ్చుకున్నవైతే ఎవరి అభిరుచినిబట్టి వారుతెచ్చుకుంటారు గనుక అవి మంచివో కావో, ఏ పుస్తకాలు చదవాలో, ఏవి చదవకూడదో చాలామంది స్త్రీలకు తెలియదు. ఏదో కాలక్షేపంకోసం ఏవికనబడితే అవి చదువుతూంటారు.

ఒకసారి నేను ఒకమాసపత్రిక చదువుతూ వుండగా మావారు వచ్చారు. నాచేతిలో పుస్తకంచూసి, ఇట్లాంటి పుస్తకాలు చదువకూడదు; ఎప్పుడూ చదువకు అనిచెప్పారు. అప్పుడు ఆ పుస్తకంమీద నాకు మక్కువగా వుందేమో, మావారు చూడకుండా చదవడం మొదలుపెట్టాను. ఇంతలో మావారువచ్చి నాచేతిలో పుస్తకంచూశారు; చాలాకోపం వచ్చింది. ఏదిఅంటూ నాచేతిలోపుస్తకం పుచ్చుకుని అపంగాచింపి, అవతల పడవేశారు. దాంతో నాకు బుద్ధివచ్చింది. నాజాగ్గాచెబితే విన్పించుకోనందుకు బాధపడ్డాను. ఇంకెప్పుడూ అల్లాంటిపుస్తకాలు చదువలేదు.

తర్వాత ఏపుస్తకాలు మంచివో మావారిని అడిగి తెప్పించుకుంటున్నాను. నేనడిగిన పుస్తకాలు వెంటనే దొరక్కపోయినా ఆ పుసకాలు వచ్చినప్పుడు పంపేవాడు లైబ్రేరియన్.

స్త్రీలుమాత్రమే నవలలూ, డిటెక్టివ్ లూ చదువుతారనడం పొరపాటంటాను. ఎందుకంటే స్త్రీలు నవలలుచదివినా డిటెకివ్ లు చదివినా లాభం లేకపోతే లేకపోవచ్చు గానీ, నష్టంమాత్రం వుండదు.

డిటెక్టివ్ లూ, నవలలూ అడుగునపెట్టుకుని, క్లాసు పుస్తకాలు పైనపెట్టుకుని పాఠాలు పాడుజేసుకున్న విద్యార్థులు ఎంతోమంది వున్నారు ఎవరో ఎందుకు? మా తమ్ముడే అట్లాజేసి, ఇప్పుడు ఇంటిదగ్గర కూర్చున్నాడు!

స్త్రీల గ్రంథాలయాలు కావాలనీ లైబ్రేరియను మంచివారు కావాలనీ, అనడం మంచిది కాదు; కానీ; స్త్రీలు ఏ పుస్తకాలు చదివితే విజ్ఞానవంతులవుతారో అన్ని విషయాలూ తెలుసుకోగలరో కొంచెం పురుషులుచేబితే స్త్రీలు తొందరగా ముందుకురాగలరుగానీ స్త్రీలు నవలలే చదువుతారు, ఈ భాగ్యానికి గ్రంథాలయాలు కావాలంటారు అనడం న్యాయంకాదు. ★

—భూపతిరాజు రామసీత, జిన్నూరు.

★ దగాపడిన తమ్ముడు ★

(19 -వ పేజీ తరువాయి)

శీతలో చందురిని చల్లనిచూపు చుక్కల కనుగీటులను సరిగ్గా కనపడనీయలేదు. ఊరంతా ఉత్సాహంగావుంది. కమ్మరిచేసిన గైరమ్మతల్లి బాజా భజంత్రీలతో డప్పుల ధమధమలతో ఊరేగుతోంది. యువకులు యువతులు మెచ్చుకున్నట్లు దేవి ఎదరగా గరిడీకి లంఘించుకున్నారు. నూరమ్మకు కావలిసిన ఒళ్ళు కొంత సేపటికిగానీ రంగంలోకి దూకలేదు. డప్పులవాళ్లని వెర్రెత్తించాడు వెంకన్న! కానీ మనసు మనసులా లేదు...గైరమ్మ కదిలిపోతూంది. వెనకా ముందూ చుట్టూ ప్రజ కదులుతున్నారు. సంతోషంతో గంతులు వేస్తున్నారు కొందరు. ఆడుతూ పాడుతూ పోతున్నారు మరికొందరు. వెంకన్న ఆగిపోవటం చూసి నూరమ్మ తోడివారినించి తప్పుకుంది.

ఆమె ఇంటి పెరటే-బూజుగా, తుప్పలా అక్షింతల చెట్టు—అప్రక్కనే గడ్డిమేటు! ఆ చాటులో నిల్చుంది. అనుకున్నట్లు వెంకన్న ఆ త్రోవలోనే వెళిపోతున్నాడు. సైగ చేసింది. నిల్చున్నాడు, కానీ రాలేదు. చూసింది. ఆగలేక చెయ్యి పట్టుకుంది. అప్పటికీ కదల్లేదు. "ఎవరూ లేరు" అంది.

"నేనెవరికీ జడవలేదు. పదిమంది వచ్చినా చీల్చేస్తాను."

"నా మాట వినవూ?"

ప్రార్థనతో కూడిన కోరికకు కాదనలేకపోయాడు. వెంటపడ్డాడు. ఆకసం నిర్మలముగా వుంది. పట్టపగల్లా తీరి కాస్తున్నది వెన్నెల!

"ఈరోజు యెప్పటి కొస్తాదని యెన్ని రోజులనుంచో చూస్తున్నాను! నిన్ను పట్టుకుని మురిసిపోవాలని...ఎదవ జాతులు!"

వెంకన్న ఆమెనింకా తాకలేదు. అన్నాడు: "అంద సందాలున్న ఆడకూతురివి నువ్వు! బంగారంనాంటి కొంపలో పడతావు. నాలాటి పాపిష్టోడితో నీ కెందుకు?"

ఆమె నోరు నొక్కేసింది. "నా పెళ్ళి స్థిరమైపోయింది. రాత్రీ పగలూ నీకోసమె నేనూసుకొని ఉన్నాను. ఎటో వెళ్ళిపోదాం... పద ..పద!"

ఆమె గట్టిగా అదిమి పట్టుకుంది. కన్నీరు కార్చేస్తోంది. వెంకన్న లోన చలించినా, బయటకి శిలా ప్రతిమలా అయ్యాడు.

"వద్దు! ఇంత బలం గలవోడ్ని నీటికంటె పల్చన, దూదికంటె తేలికయిపోమంటావా?"

"వదు నూరీ! ఈ దొంగోడ్ని యిలా బతకనియ్యి!"

ఆమె కళ్ళవెంట నీరు కారుతోంది. చూసాడు. మనసు మళ్ళీ ద్రవించుకపోయింది. "నూరీ! నన్ను మంచన్నది యీ లోకాన నువ్వొక్కదానివే! లోకాన నా బాగు కోరిన నీ ఒక్కదానికీ అన్యాయం సేసిస్తే ఈ భూమి నాలాంటి పాపిష్టోడిని మొయ్యగలదా? ఈ యాళ ఇక్కడుంటాను—రేపు యేవూర్లో, యేమూలో — సుఖాన్న వున్న పేణాన్ని దుఃఖాన్న పెట్టకోక!"

వెళ్ళిపోవాలని ఆమె కన్నీరు చేతితో తుడిచాడు. ఆమె ఇంక యేడవలేదు. వెన్నెలను ఒక మబ్బుతి నేస్తోంది. ఆమె దుఃఖాన్ని ఒక కోరిక నమిలేస్తోంది.

"నూడు! నేనొక్కటి కోరతాను. కాదనకు..."

వెంకన్న ముందుకు అడుగువేయబోయి ఆగాడు. "సెప్పు" అన్నాడు.

"ఇద!" చెయ్యి చాపింది.

మబ్బుతెర లేచిపోయింది. మెరుగెక్కిన చందురుడు మెల్లగా కదిలిపోతున్నాడు.

తెల్లవారేసరికి వెంకన్న వూళ్ళోలేడు. వారం రోజుల్లోనే వూళ్ళో రకోరామేళం వాగింది. యెర్రయ్య పెళ్ళికొడుకు. ఏనుగులాంటి మనిషి—గానుగెద్దులాంటి తరిఫీదు. మొదటి పెళ్లానికి పిల్లా జెల్లా లేరు. ఈ మొగుడితో మనలేనని కన్నవారింటికి వెళ్లిపోయి తెగతెంపులు చేసుకుంది. ఊళ్లో నలుగురూ, నూరమ్మ చాలా బాగుంది. చక్కని చుక్క అన్నారు. పదుగురూ అంటున్న పిల్లని పెళ్ళి చేసుకోవాలని భీష్మించుకున్నాడు. పెళ్లయిపోయింది. డబ్బుకీ తనకీ లంకె. దానికోసం యేం చేయమన్నా చేసేస్తాడు.

నూరమ్మ కాపరానికి వచ్చింది. "దున్ననివానికి గుడ్డి యెందుకు? యేలకపోయినవానికి పెళ్లెందుకు" అనుకుంది నూరమ్మ. ఇంట్లో తనకేం లోటులేదు కానీ, సౌఖ్యం అనేది లేకపోయింది. రెండు నెలలు పోయాక వెంకన్న ఒక రాత్రి పొరుగూరినుంచి దొంగతనంచేసి వచ్చేస్తున్నాడు. ముగ్గురు మనుషులు ఆ చీకట్లో పెద్ద కొండపోతులతో తారసపడ్డారు. పోతులు యెర్రయ్యవని పోల్చుకొని, వాళ్ళతో చేతిలోని బాణాకర్రతో యుద్ధానికి లంఘించుకున్నాడు. ఆ దొంగలకి దెబ్బలు బాగా తగిలాయి. ఒకడికి కాలు విరిగింది. వెంకన్నకు కవుకు దెబ్బలు తగిలాయి.

ఆ రాత్రి మీద పోతులు, కాళ్ళు విరిగిన మనిషిని మోసుకొచ్చిన వెంకన్నని చూసి, అంతా శెభాష్ అన్నారు. ఎర్రయ్య కృతజ్ఞతగా రెండు పూటలు ఇంట్లో భోజనం చేసేమన్నాడు.

అదే చిక్కు తెచ్చింది. నీటి తీరువలేని సారమైన భూమికి కాలవనీరు వచ్చింది. వెంకన్న తనతో వుండకపోతే బలవంతాన చచ్చిపోతానని నూరమ్మ మొరపెట్టింది.

ఊళ్లో గుసగుసలు బయలుదేరాయి. రానురాను వెంకన్న. బసయెర్రయ్య యిల్లు అయిపోయింది. ఏం ఫలితం కోరకండా పనిపాట్లలో సహాయం చేస్తున్నాడని యెర్రయ్య సంతోషించాడు. నూరమ్మకు ఒక్క క్షణం వెంకన్న లేకపోతే బ్రతకటం దుర్లభంగా వుంది. ఈ తిండితో కండలు పెరిగిపోయాయి. విచారం లేదు. నలుగురిలో నాయుడిగా చెలామణి అయిపోతున్నాడు. కొందరు "పెద్ద చెరువునీటికి, పెదింటి రంకుకు" పోల్చారు. మరికొందరు పడుచుకన్న యిల్లు తుడుచుకుపోతాదని లోలోన అనుకున్నారు. ఎవరో గుసగుసలాడుకుంటున్నారని, ఎర్రయ్య విసవిస లాడాడు. కానీ పెళ్లం ఏడ్చుకుందని కరిగిపోయాడు.

నూరమ్మకు కొడుకు పుట్టాడు. వూళ్ళో వెంకన్న రూపేనని గుసగుసలాడుకున్నారు. నూరమ్మ ఒకేఒక కొడుకు రాజన్న నూనూగు మీసాలప్పుడు వెంకన్నను ఇంటినుంచి పొమ్మన్నాడు. చాలా రభస జరిగింది. ఆ మాటల పోరాటం వల్ల వెంకన్న రెండు రోజులు ఎర్రయ్య యింటికి వెళ్లకపోవటంతో, నూరమ్మకు జ్వరం పట్టుకుంది. యెర్రయ్య కొడుకుని మందలించాడు. "మీ అమ్మతో నువ్వు తగలక. అది వచ్చింది. ఉన్న సిరి ఇట్టే పొంగిపోయింది. అది బతికినంతకాలం ఈ ఇంట్లో లచ్చిందేవి ఉన్నాదే అని" చెప్పాడు. కొడుకు అప్పటికి ఊరుకున్నాడు. ఎర్రయ్య వెళ్లి వెంకన్నను పిలిచాడు. రాజన్నాయుడు, పురఫ్ రాజిగాడికి పెళ్ళయింది. పెళ్లం, అత్తలాంటి చక్కని రూపుకాకపోయినా, బింకమైన మనిషి. వారం రోజులు కాపరంచేశాక ఈ సంసారంలో మాటలతోనే చిచ్చుపోసింది.

"బలే కుటుంబం! చెట్టంత కొడుకుని పెట్టుకొని...మా తల్లి...మా అత్తకి సిగ్గు లేకపోతే...నీకు లేదా?"

ఈ ఎగతాళితో ఆ రాత్రంతా రాజన్నకి నిదరపట్టలేదు. పెళ్ళాం అంతతో వూరుకోలేదు. "నాకు ఈ రగడ తెలిస్తే, ఈ ఇంటికి కోడలిని కాకపోదునంది." తండ్రి దగ్గర భయంవున్న కొడుకు, యింకా వోర్చాడు. ఒకనాటి రాత్రి "ఎందుకంత పెద్ద మీసాలు" అంది. దానితో రాజన్నకు బ్రహ్మాండమయిన పౌరుషం వచ్చింది. నిర్మొహమాటంగా చెప్పేశాడు. వెంకన్న ఇంట్లోకి అడుగు పెట్టడానికి వీల్లేదని. ఈ కేకలు ఇరుగుపొరుగుకి ప్రాకి ఊరంతా ప్రాకిపోయినాయి. తల్లి పోలిక కూతురికి వస్తాది గానీ

దగాపడిన తమ్ముడు

గొడలి కెందుకొస్తాదనుకున్నారు కొందరు. సూరమ్మ సగం చచ్చిపోయింది. ఈ గలాటాలో "నీ వెవ్వరికి పుట్టావురా కొడకా!" అని అందామన్నంత పౌరుషం వచ్చేసింది. కాని కొడుకంటే యెడతెగని ప్రేమ. ఒక ప్రక్క వెంకన్న, ఇంకోపక్క కొడుకు. ఎటూ మాటాడలేక కుమిలిపోయింది. వాడు పోకపోతే నేను వేరే వుంటానన్నాడు కొడుకు.

వెంకన్నకు ఆత్మాభిమానం కలిగినా సూరమ్మను విడిచి తనూ బ్రతకలేడు. మాటలుపోయి చేతులు పైకెత్తారు. రాజన్నాయుడిని పడదొయ్యటానికి ఒక్క చెయ్యి చాలు...కానీ...ఆగిపోయాడు... వెళ్ళిపోవాలనుకున్నాడు. కానీ ఆమెను విడిచి ఉండలేడు!

ఒకనాటి అర్ధరాత్రి. చీకటిరాత్రి! ప్రకృతి నల్లగుడ్డ కప్పుకొని, నిద్రపోతుంది. ఆ నిశ్శబ్దంలో వుండి వుండి, దూరదూరాన్న చలిబాధకు, ఆకలిబాధకు ఓర్వలేని, ఓముసలి నక్క యేడుస్తోంది. పెరటిలో వున్న పెంటమీదినించిగాలి దుర్గంధాన్ని మోసుకొస్తోంది. వెంకన్న ఒంటిగా ఎర్రయ్య యింటి పెరటి కొట్టు అరుగుమీద దుప్పటి కప్పుకొని, పడుకున్నాడు. చాలాసేపటి వరకూ నిద్రపట్టలేదు. ఎప్పుడూ లేనిది, జరిగిన రోజులు నెమరువేసుకున్నాడు. తన ఒళ్ళు కోస్తే రక్తం అంతా పాపమే అనుకున్నాడు. తనే యెర్రయ్య అయితే, రాజన్న అయితే సూరమ్మసేసిన పనికి యేం అయ్యేవాడు? మళ్లీ పాపిష్టోడు జరిగింది, జరగబోయేది ఆలోచించ కూడదనుకున్నాడు. పడుకునే ముందర తనదగ్గర యెవరో వున్నట్లనిపించింది. లేచి చూసాడు! దెయ్యమా? వంద దెయ్యాలు రానీ-ఒంటిగా వల్లకాటిలో పలుకుతుంటాను-మళ్ళీ ఏదో కదిలినట్లయింది-పెరటిపాలలోనిపోతులు ఇంకా తెలివిగానే వున్నాయ్. ప్రక్కనేవున్న ఆవు కునుకుపాట్లు పడుతోంది. పడుకుంటూ ఆకాశంలో చుక్కల వేపు చూశాడు. ఆకాశంలో చిన్నాపెద్దా చుక్కల్ని వుంచాడు. భూమిమీద నాలాంటి వోలని యెర్రయ్యలాంటి వోలని, పుట్టించాడు. దేముడు బలేవోడనుకున్నాడు...అలా మగత నిద్దర కమ్ముకొచ్చింది.

నలుగురు చుట్టుముట్టారు. నోటిలో గుడ్డలు-కాలుచేతులకు బంధం. అమ్మో అంతా సరి అనబోయాడు! ఆయేడుపు గుండెలో ప్రతిధ్వనించింది. అంతా చీకటి-జగమంతా చీకటి. తన సూరమ్మ యెలావుంటుందో, యిప్పుడు వూహించుకోవాలి. పొడిచిన కళ్ళనించి రక్తం కారిపోతుంది.-తను వెంకన్నాయుడు కాడిప్పుడు. గుడ్డి వెంకన్న. గట్టిగా ఎడవబోయాడు. నాలుగు సింహాల బలం పౌరుషం వచ్చింది... పోతులూ ఆవులూ కట్ల చుట్టూ తిరుగుతున్నాయి ముసలినక్క ఏకకంఠంతో అరుస్తోంది.

చిన్న చప్పుడుకు సూరమ్మ బుడ్డి వెలిగించింది. కొడుకు మరి ముగ్గురూ! హో అంది... మరి మాటాడలేదు. చూసింది...తన ప్రియుడికళ్ళ వెంబడి రక్తం కారుతోంది. నిట్టూర్పులతో మీదపడిపోయింది. కళ్ళవెంబడి కన్నీరు మున్నీరుగా కారుతోంది...కొడుకు తల్లిని కాళ్ళ తన్ని వుమ్మివేసి వెళ్ళిపోయాడు.

నోటిలో గుడ్డలుతీసింది. వెంకన్న, జంతువు కదలిక పసిగట్టి ఆకలిగొన్న సింహంలా వున్నాడు. కానీ కళ్ళల్లో మేకులు గ్రుచ్చుకుని, గ్రుడ్డిచేసాయి. సూరమ్మను నొక్కివేస్తూ యేడుపులోనే రౌద్రాన్ని, వెళ్ళగ్రక్కుతూ. "రాజగాడి రక్తం త్రాగకపోతే!" తొడచరిచాడు.

ఆమెకీళ్ళన్నీ ఒక్కసారిగా విరిగిపోయినట్లయినయ్. అలా వంగుతూ వెంకన్న పాదాలమీద పడిపోయి కన్నీటితో పాదప్రక్షాళనం చేస్తోంది.

ఈ స్త్రీ భార్యకంటె తల్లిగా పరిపక్వం చెందిందిప్పుడు. ఒక్కగాని ఒక్క కొడుకు-కడుపు వెర్రి అయిపోతోంది... ఈ సింహంలాంటి మనిషి, తలుచుకుంటే, యేమైనా చెయ్యగలడు. కొంత సేపటికి వెంకన్న "సూరీ! నాపాకలో దిగబెట్టే" అన్నాడు. ఆ గొంతుకలో యిదివరకు భీకరంలేదు. ఆమె భుజంమీద చెయ్యివేశాడు.

"ఒక అడుగు, రెండడుగులు, తీసుకుపద...ఆగకే సూరీ!...నాలుగడుగులు వేస్తే నరకం....వదే సూరీ! నా సూరీ!"

ఇప్పుడు కన్నీరు కారిపోతూంది. నడుస్తూనే సూరి భుజాలు మోము, ముక్కు...తల... తాకుతున్నాడు!

మళ్ళీ తన పాక! అంతా మత్తుమందు తిన్నట్లు...క్రొత్తగా తాగిన వాళ్ళలా నిద్రపోతున్నారు.

కూర్చున్నాడు. చీకటి! ఆ చీకటిలో తన ప్రేమమూర్తిని తాకింది. మళ్లీ యౌవనం ఆమెలోకి చొచ్చుకున్నట్లయింది.

"సూరు! నేనొక్కటి కోరతాను... కాదనకు!"

వెంకన్నకు ఆవెన్నెలరాత్రి జ్ఞాపకం వచ్చింది.

"చెప్పు" అన్నాడు.


"ఇద" అని చెయ్యి చాపింది. వెంకన్న మళ్ళీ బాధలోనే యౌవనాన్ని అంకురింపచేసుకున్నాడు, ఈమె ఈసారి సుఖం కోరాలనుకున్నా కోరలేదు. కళ్ళల్లో నీరు వుబికి రాలుతోంది. "ఆడు పశు వయ్యాడు. నా కొడుకు కాడు, నీ కొడుకే...ఆడికి యేం కీడు సెయ్యనని..." ఆమె గొంతుక పట్టుకపోయి, ఆ వేదనతో వెంకన్న ఒడిలో తలెట్టి వెక్కి వెక్కి యేడవటానికి ఉపక్రమించింది. గుడ్డి వెంకన్న మెల్లగా ఆమె చెయ్యి అందుకున్నాడు. చేతిలో చెయ్యి వేసి వచ్చే దుఃఖాన్ని బలవంతాన ఆపుకొంటూ "సూరీ! అంతా ఋణానుబంధం! వెంటనే మాటలు రాలేదు. కాసేపు ఆగి మెల్లగా: "నాను సేసిన దానికి సిక్షయిది... నీ కొడుకే సిక్ష యేయలేదు...ఆ దేవుడు యేయడానికి...? భగవంతుడే యీ శిక్ష యేశాడు...సచ్చిపోను...బాగా బాధ పడతాను..." ఏడుపు ఆపలేకపోయాడు. కన్నీళ్ళు ఆమె తలమీద చుక్క చుక్కలు పడుతోంది. "ఆతిగతీ లేక యీధిలో కుక్కలా సస్తాను-యెల్లే సూరీ!"

ఆమె యెంత సేపటికో లేచి మౌనంగా పాదాలను తలమీద పెట్టుకొని, వెళ్ళిపోయింది. వెళ్తూ "నా దేవుడా!" అనిలోన మొక్కుకొని వెళ్ళిపోయింది. ఇంత జరిగినా తిరిగి వెళ్ళేసరికి మొగుడు విధరుగుమీద కుంభకర్ణుడిలా నిద్రపోతున్నాడు. తెల్లవారేసరికి ఆ వూళ్లోనే కాదు. యిరుగుపొరుగూళ్లు కూడా గుబ్బుమన్నాయ్. ఎర్రయ్య కూడా పలుకరించడానికి వెళ్లాడు. "రాత్రిమీద ముళ్లడొంకమీద పడిపోయాను ముళ్లు గుచ్చుకున్నా యన్నాడు." కొందరు నమ్మారు. మరికొందరు, "దొంగతనం అడి పుటకతోనే వచ్చింది. వెళ్లివుంటాడు. ఎవరో కళ్ళుపొడిసి యింటికి దిగబెట్టేశారేమో" అని అనుకున్నారు. ఉన్నది వూడిపోతేగాని, వేదాంతం రాదని మరికొందరు గొణుక్కున్నారు.

సూరమ్మ ఆ రోజునుంచి వెంకన్న ముఖం చూడలేదు. రోజురోజూ బెంగతో చిక్కిపోయి—ఆరునెలలు తిరగలేదు. యీసారి యిదివరలా అత్తారింటికి కాదు-యమసదనానికి—వెళ్లిపోయింది.

సూరమ్మ చచ్చిపోయి అప్పుడే అయిదేళ్లయింది. వెంకన్న ఆమె చచ్చిపోయిన మరుచటి రోజునుంచీ గిన్నెపట్టుకు వీధిలో పడ్డాడు.

[ఇంకా వుంది]



స్వర్గం - నరకం

రంగనాథ పురంలోన
సింగారపు ప్రోవు అనగ
రంగసాని యొకతె గలదు.

ఏడుపులూ, మొత్తుకోళ్లు
వీధిలోన విన్పింపగ,
నన్న జేసి, ముసలిదాన్ని
చెంత బిలిచి, యిట్లనియెను :

"కాటికరుగు ఆ పీనుగు
స్వర్గానికో...నరకానికో...!
అరసిరమ్ము వేగబోయి."

ముసలిదాసి పోయిచూచి
తిరిగివచ్చి యిట్లనియెను :
"పాడె మీద పోవుశవము
స్వర్గానికె సాగిపోవు!"

పడకటింటి పాన్పుపైన
హాయిగ పవళించియున్న
పండితుడాశ్చర్యపోయి,
రంగసాని నటు పిలిచీ
'అది యెట్లో తెలియజెప్పు'
మనగానే ఇట్లనియెను :

"తెలియని దేమున్నదిందు!
పదిమందీ 'పాపమయ్యొ
పుణ్యాత్ముడు పోయినాడు!'
అనుకొంటే బొందితోడ
స్వర్గానికె వాడు పోవు!—
'పాపిష్ఠి...దుర్మార్గుడ!
చచ్చావా...పీడవదలె!'
అని నలుగురు చీదరిస్తె
నరకానికె వాడు వెళ్లు!"

రంగసాని వివరణతో
పండితుడామెను మెచ్చెను
నరగున అక్కున జేర్చెను. ★

★ 'రత్నం' ★

తెలివైన భార్య

పూర్వం ఒకప్పుడు ఒక భీకరారణ్యంలో ఆ మూల ఒక రాక్షసుడు, ఈ మూల ఒక రాక్షసుడు నివసిస్తూండేవాళ్లు. తనొక్కడే ఆ అరణ్యానికి అధిపతి అని యిద్దరూ అనుకునేవాళ్లు. కాని, కొన్నాళ్లకు యిద్దరకూ తెలిసింది మరో రాక్షసుడు ఈ అరణ్యంలోనే ఉంటున్నట్లు. ఆమూలనున్న రాక్షసుడు అతిభయంకరుడు, బలాఢ్యుడు, తాడిచెట్టంతవాడు. వాడు వికటాట్టహాసం చేస్తే సింహం గర్జించినట్లు భయంకరంగా ఉంటుంది. అందుచేత వాడిపేరు సింహాగర్జనుడు. కాని ఈ మూలనున్న రాక్షసుడు సింహాగర్జనుడివలే పొడగరి కాడు. రమారమి ఏనుగంత పొట్టిగా ఉంటాడు. వీడికిపెండ్లి కూడ అయిపోయింది. వీడు అరిస్తే పెద్దపులి అరిచిందా అనిపిస్తుంది. అంచేత వీడిపేరు వ్యాఘ్రదత్తుడు. వ్యాఘ్రదత్తుడికి సింహాగర్జనుడి సంగతి తెలియగానే ముచ్చెమటలు పోశాయి. కారణం? వ్యాఘ్రదత్తుడు భయంకర రాక్షసుడైనప్పటికి పిరికివాడు. సింహాగర్జనుడికి వ్యాఘ్రదత్తుని సంగతి తెలియగానే తోకత్రొక్కిన పాములా మండిపడ్డాడు. "ఒకేఒరలో రెండుకత్తు లుండటం అసంభవం! ఉంటే వాడయినా ఉండాలి, లేదా నేనయినా ఉండాలి. వాడి అంతు ఏమిటో కనుక్కుంటాను!" అని వెంటనే సింహాగర్జనుడు వ్యాఘ్రదత్తుని నివాసానికి బయలుదేరాడు, కారాలు మిరియాలు నూరుకుంటూ. ఆసమయంలో వ్యాఘ్రదత్తుడు తన భార్యతో యిష్టాగోష్ఠి మాట్లాడుతూ కూర్చున్నాడు. సింహాగర్జనుడు ఆసమీపానికి వచ్చేసరికి భూమి దద్దరిల్లటం గమనించాడు వ్యాఘ్రదత్తుడు. "ఏమిటీవిడ్డూరం!" అని ఇవతలకొచ్చి ఎత్తయిన ప్రదేశంనుండి చూశాడు. వ్యాఘ్రదత్తుడు నిలువెల్లా కంపించిపోయాడు. ఇంతలోనే ఆగృహంప్రక్కనుండి సమస్త జంతుజాలం ప్రాణభీతిచే గుంపులు గుంపులుగా, మందలు మందలుగా పారిపోవటం, పక్షులు అతిదీనంగా, ఘోరంగా కూయటం విని "ఏమిటి చెప్మా!" అని యివతల కొచ్చింది వ్యాఘ్రదత్తుని యిల్లాలు.

"బొలక్"

ఇంతలోకే గజగజ వణికిపోతూ వ్యాఘ్రదత్తుడు రావటం గమనించి ఆశ్చర్యపోయి, తటాలున చేయిఊతఇచ్చి భర్తనుఇంటికి తీసుకవచ్చి శైత్యోపచారాలు చేసింది. దాంతో వ్యాఘ్రదత్తుడు తేరుకొని సంగంతా చెప్పాడు. వ్యాఘ్రదత్తుడి భార్య చాలా గడసరి, తెలివైనది కూడా.

"ఈ మాత్రానికే భయపడిపోతారా! మరేంఫర్వాలేదు. నేచెప్పినట్లుచెయ్యండి, వాడిని మూడు చెరువుల మంచినీళ్లు త్రాగించేస్తాను." అని ధైర్యం చెప్పి గబగబ అక్కడ మంచంవాల్చి, భర్తను పడుకోమంది. వ్యాఘ్రదత్తుడికిదేం అర్థంకాక అలాగునే పడుకున్నాడు. అప్పుడు ఆరాక్షసగృహిణి ఒక దుప్పటి కప్పి, ఒక తడిగుడ్డ నుదుటిపై పరచి విచార సూచకంగా జుట్టు రేపుకొని ప్రక్కన కూర్చుంది. ఇంతలో సింహాగర్జనుడు, దగ్గరకు వస్తూన్నట్లు అడుగుల శబ్దం వినిపించింది. వ్యాఘ్రదత్తుడు లోలోన ఎంతో భయపడిపోతున్నాడు. అతని గుండెల్లో పిడుగులు పడుతున్నాయి. కానిఏంచేస్తాడు? "వ్యాఘ్రదత్తుడెక్కడ? వ్యాఘ్రదత్తుడెక్కడ? ...ఎక్కడ్రా ఉన్నావ్! ...ధైర్యవంతుడవయితే ఎదురుగావచ్చి పోరాడు...పిరికిపందవయితే, శరణుగొని ఈ అరణ్యాన్నివిడిచి పారిపో!" ..." అంటూ సింహాగర్జనుడు గర్జించాడు. ఆకేకలువిని వ్యాఘ్రదత్తుని భార్య యివతలకొచ్చింది. సింహాగర్జనుడు ఆమెనుచూసి "వ్యాఘ్రదత్తుడేడి? ఇదేనా...వాడి నివాసం? ...వాడు లోపలున్నాడా...?"

అన్నాడు. అప్పుడామె "ఔను! ఇదే వారినివాసం. కానిమావారుఎప్పుడూ లోపలికిరారు. మీకు తెలియదా? మావారు చాలాపొడుగు, అంచేత వారింట్లోకి రాలేరు. ఎప్పుడూ బయటనే తిరుగాడుతుంటారు" అంది.

"అబద్ధం! నాకు తెలుసు. వ్యాఘ్రదత్తుడు అంతపొడుగుకాదు. నువ్వు వాడి పెళ్లానివేనా? వాడెక్కడున్నాడు? నిజంచెప్పు. నన్నుచూసి భయపడి యింట్లోనే తప్పక దాక్కొని ఉంటాడు" అని హూంకరించాడు. వ్యాఘ్రదత్తుని కీమాటలు వినిపించి, కంపించిపోయాడు. ఇంతలో వ్యాఘ్రదత్తుని యింట్లోని పందులు ఆప్రక్కగుండా వెళ్లటం చూసి "చాలా బాగున్నాయి యీ పందులు! నీమొగుడు బయటకురాక పోతే...ఈ పందుల్ని ఒక్కొక్కటి మింగేస్తాను జాగ్రత్త! రమ్మను... యివతలకు" అన్నాడు సింహగర్జనుడు. వ్యాఘ్రదత్తుని సతి విరగబడి ఫకాలున నవ్వింది. "అవి పందులా? ...ఏ ఊరయ్యా నీది...? మా బలే వాడివే?...అవి మా యింట్లోని ఎలుక పిల్లలు..."అంది యింకా నవ్వుతూనే. సింహగర్జనుడు చిన్నబోయాడా మాటలతో. ఇంతలో ఆ ప్రక్కనుండి ఆవులు, గేదెలు గుర్రాలు మందలుగా వస్తున్నాయి. "ఏయ్! నీ మొగుడ్ని యివతలకు తెస్తావా? లేకపోతే ఆ ఆవులు... గేదెలు...అన్నింటిని మింగెయ్యమంటావా? చెప్పు..." అన్నాడు సింహగర్జనుడు కోపం పెచ్చుపెరిగి.

ఈ మాటలకు వ్యాఘ్రదత్తుడి సహచారిణి మరీ విరగబడి, విరగబడి నవ్వింది. దాంతో సింహగర్జనుడు మండిపడి "ఎందుకలా పిచ్చెక్కినట్లు నవ్వుతావు?...నీకు మతిపోయిందా ఏం?" అన్నాడు.

"మతి నాకు పోలేదు. నీకు పోయిందనే నవ్వాను. అవి ఆవులు గేదెలూనా?...మా బావుంది. నీకు దృష్టి దోషం కూడా ఉందన్నమాట. అవి మా యింట్లో పెరుగుతున్న కుందేటిపిల్లలు' కుక్కలు, పిల్లులున్నూ..." అంది పొట్టచెక్కలయ్యేలా నవ్వుతూ.

"అబద్ధాలు! నాకు వీటితో

తెలివైన భార్య

వన్లేదు. నీ మొగుడితోనే పని. యువతలకు పంపిస్తావా...లోపలికొచ్చి యీడ్చి తన్నమంటావా? ...నేను నీ భర్తతో దెబ్బలాడి, ఈ లోకంలో నాకన్న గొప్ప రాక్షసుడు లేడనిపించుకోవాలి ... తెలిసిందా? అంచేత నీ మొగుడ్ని యువతలకు పంపించు" అన్నాడు.

"నేనేం అబద్ధం ఆడుతున్నాననుకున్నావా? రా...లోపలికొచ్చి చూసుకో...కాని ఒక్క సంగతి! మా అబ్బాయి పడుకున్నాడు. వాడు లేచిపోకుండా, నిశ్శబ్దంగా వెతుక్కో మా వార్ని..."అంటూ లోపలకి వచ్చింది. సింహ గర్జనుడు వెంట వచ్చాడు. "ఇదిగో! చూడు! నా చిట్టి తండ్రి ఎంత చక్కగా పడుకున్నాడో..." అని వ్యాఘ్రదత్తుని చూపించి "నిన్నటి వరకు జ్వరం, తలనొప్పితో బాధ పడుతున్నాడు...యిప్పుడే పడుకున్నాడు...అంచేత వాడి నిద్దుర పోగొట్టక, అంతా వెతుక్కో..." అంది. సింహగర్జనుడు ఆ పసిపాపను చూసి నిలువెల్లా కూలిపోయాడు. ఆ పసిపాపడే సరిగ్గా ఓ ఏనుగంత ఉన్నాడు. మరి వీడి తండ్రి నిజంగా చాల పొడగరై ఉంటాడు. అనుకున్నాడు. "ఏమిటీ? నీ బిడ్డడా ...వీడు...! వీడే యింతలా ఉంటే, వీడి తండ్రి ఎంతుంటాడో...ఓయ్! బాబోయ్!...నే నిక్కడ ఒక్క క్షణం ఉండలేను...బ్రతికుంటే బలుసాకు తినొచ్చు..."అంటూ ఒకటే లగువు లంకించుకున్నాడు. సింహగర్జనుడు పారిపోగానే, వ్యాఘ్రదత్తుడు లేచి..."నిజంగా! నేను పెద్ద రాక్షసుడ ననుకొని పారిపోయాడు. ప్రపంచంలో నీ అంత తెలివైన ఆడది లేదు," అన్నాడు. ★

డాక్టరు: నేను మిమ్మల్ని తెల్ల ఉల్లిపాయ తినమంటినే? ఏమైనా గుణం కనిపించిందా?

రోగి: ఆహా, మీరు చెప్పిన వైద్యం చేస్తున్నప్పటినుంచి బస్సులో గాని, ట్రాములో గాని నా ప్రక్కన ఎవ్వరూ కూర్చోటం లేదు. అదొక్కటే నాకు కనిపించిన గుణం.

కొజవెంకట కమల, విజయవాడ.

నక్క-పావురం

ఒకనక్క, పావురం ఎంతో స్నేహంగా వుంటూ వుండేవి. ఈ స్నేహం చిరకాలం వుంటుందో వుండదో, పావురాన్ని నమ్మవచ్చునో లేదో అని నక్కకు అనుమానం వేసింది. ఒకనాడు తెగించి "స్నేహితుడా!, నీ స్నేహంపట్ల నాకు నమ్మిక కలిగేటట్లు నీవు మూడు పనులు చేసి చూపిస్తే, నీవు నిజమైన స్నేహితుడవని నాకు నమ్మకం కుదురుతుంది. చేసి చూపగలవా" అంది. "సరే చెప్పు, ప్రయత్నించి చూస్తాను" అంది పావురం. పావురం నక్కను, కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వించాలి. జన్మలో ఎరగనట్టి విధంగా ఏడ్పించాలి. కడుపునిండా విందారగించే అవకాశం కలగజెయ్యాలి. ఇవీ, మూడు షరతులూను.

పావురం నక్కను వెనుకనే రమ్మనమంది. ఇంతలో దారివెంబడి యిద్దరు బాటసారులు నడిచిపోతున్నారు. ముందర నడుస్తూన్న ఆసామీ, ఒక కర్రకు మూట తగిలించుకొని, బుజంమీద కర్ర వుంచుకుని నడుస్తున్నాడు. రెండవ ఆసామీ అతని వెనుకనే నడుస్తున్నాడు. పావురం, మొదటి బాటసారి మెడమీదనున్న కర్ర కొనను వ్రాలింది. అది తేలిగ్గా వుందేమో అతడు గుర్తించనేలేదు. రెండవ బాటసారికి పావురంమీద మనసుపోయి, మంచి ఆహారం అవగలదని తలపోసి, తన జోడు తీసి దాన్ని చంపగలననే వుద్దేశంతో గట్టిగా దాని పైకి విసిరేడు. ఇంతలో పావురం ఎగిరిపోయింది. జోడు వచ్చి మొదటి బాటసారి తలపాగా ఎగురగొట్టింది. ఈ పనంతా కన్నుమూసి తెరిచేలోగా అయిపోయింది.

ఇంకేముంది? వారిద్దరి మధ్య పెద్ద జగడం రేగింది. రెండవ బాటసారి తాను బుద్ధిపూర్వకంగా కొట్టలేదని, జరిగిన విషయం గ్రహించమని, అంతా చెప్పి క్షమించమన్నాడు. మొదటి బాటసారి ఒప్పుకోడే! ఈలోపున పావురం చెప్పిన ప్రకారం

నేమాని వీరభద్రరావు

పొదలోనుంచి పొంచి చూస్తూన్న నక్క, కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వకుండా వుండలేకపోయింది.

"ఏమయ్యా, నీసరదా తీరిందా" అంది పావురం. ఇక రెండవది, ఏడ్పించడం.

నక్కని ఒక పొదలో వుండమని పావురం ఆజ్ఞాపించింది. ఆ దారి వెంబడి ఒక వేటగాడు నాలుగు వేటకుక్కలతో వస్తున్నాడు. నక్క దాగివున్న పొదచుట్టూ పావురం ఎగురుతూ 'ఇక్కడ ఏదో వుంది సుమా' అని అర్థమయ్యేటట్లు చూస్తోంది. ఇంతలో కుక్కలు పసిగట్టి పొదలోకి దుమికి నక్క వాళ్లు హూనంచేసి, మైదానమంతా ఊకరించేసేయి. పాపం నక్కకు ప్రాణం రక్షించుకుని బయటికిపడ్డం మహా కష్టమైంది. ఏడుపుకాదు. కళ్లే వూడి వచ్చే పరిస్థితి ఏర్పడింది నక్కకు.

"ఏం, నేస్తం, ఎలావుంది నా ప్రజ్ఞ" అంది పావురం. "పోదూ, చస్తాంటే, నాకు యిప్పుడు మంచి విందు చేస్తేనే నీ నిజమైన స్నేహానికి గీటురాయి" అంది నక్క. "సరే, రా," అంది పావురం.

ఆ దారిని ఇద్దరు రైతుపడుచులు నెత్తిన అన్నం గిన్నెలు పెట్టుకుని పొలానికి పోతున్నారు. పావురం వారిదగ్గరే ఏదో జాలిగా అరిచింది. "అయ్యో, పాపం దెబ్బతిందిలా వుంది. పట్టుకు రక్షిద్దామని వాళ్లు ప్రయత్నించేరు. దొరికినట్టే దొరకడం, వెంటనే దూరంగా పోతూండడం, ఇలాగ ఎన్నో వేషాలు వేసింది పావురం. ఆఖరికి గిన్నెలు ఒక చోటపెట్టి పావురాన్ని పట్టుకుందామన్న నిశ్చయానికి వచ్చి ముందుకు పరుగుతీసేరు.

వాహూ అలా కొంచెం దూరం వెళ్ళేరో లేదో, మన నక్కగారు మిత్రుణ్ణి పొగుడుతూ, విందుభోజనం చేశారు.

"ఇదీ నిజమైన స్నేహం అంటే" అని నక్క తన కష్టమంతా మరిచిపోయింది.

పిల్లల పనులు

(39-వ పేజీ తరువాయి)

గుర్తు వచ్చింది. వెంటనే తయారుచేసి స్కూల్లో యిచ్చేశా అన్నాడు, ఎంతో వుత్సాహంగాను.

చూస్తే పట్టుమని పదేళ్ళు లేవు. చదివేది ఫష్టుఫారం. వీడికింత ఆలోచన సమయానికి ఎటా స్ఫురించింది. అసలు పిల్లల వూహాలు పెద్ద అంతస్థులో వుంటాయి. చాలామటుకి పెద్దవాళ్ళసమక్షంలో పిల్లల పనులు సాగవు. వాళ్లయి ఏదయినా యిటువంటి పనులు చేయాలనివుంటాయి. పెద్దవాళ్లు చూడకుండా చేస్తారు. ఆపనులు ఒకోసమయంలో చెడువి అవుతాయి. మంచివికూడా అవుతాయి. మంచివి అయినా, చెడువి అయినా మనం వాళ్లని శిక్షించక మానము. వాళ్ళెంచేశారో ఆచేసినపని మంచా చెడా అనికూడా ఆలోచించలేముఆసమయంలో—పిల్లలుఏదయినా వారపత్రిక చదువుతుండగా. పెద్దవావాళ్లు చూస్తే వెధవా నీకు పత్రికలు కావాలా? క్లాసుపుస్తకాలు చదువుకోరాదూ అని మందలిస్తారు. కోపంగలవాళ్లయితే తగలనస్తారు.

సగంకథ చదివి తరిమాది చదవలేదే అని పిస్తుంది వాళ్లకి. ఎంతసేపు క్లాసు పుస్తకాలు చదివినాసరే వాళ్లకి ఆపత్రికమీదే ధ్యాస వుంటుంది. ఆకథే చదవాలని వుంటుంది. చదవటానికి వీలయే వుపాయం స్ఫురించకపోతే ఏరాత్రో క్లాసు పుస్తకం చదువుతున్నట్లుగా చూస్తూ అంగులో యీ పత్రిక వుంచుకుని చదివేయటం. ఈ విధముగా వాళ్లకోర్క తీర్చుకుంటారు చాటుమాటుగా.

ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుకొస్తుంది.

మా అమ్మాయిలు ఎప్పుడూ క్లాసు పుస్తకాలు తప్ప, ఏవీ కన్నెత్తి చూడరమ్మా. ఆఖరికి పేపర్ కూడా యిట్లా పట్టుకుని చదవరమ్మా ఎంతసేపూ క్లాసు పుస్తకాలేమో వాళ్లేమో అంటుంది మా పక్కింటి పిన్నిగారు.

ఎప్పుడు చూసినా వాళ్ల చేతుల్లో పుస్తకం వుంటుంది. వయసుకి చిన్నవాళ్ళయినా చదువులో మహాదిట్టలే అనుకున్నాను. పక్కింటి పిన్నిగారు చెప్పింది అక్షరాలా నిజమే అనుకున్నాను. తెలుగు టెక్స్టుబుక్ కోసం వాళ్ళింటికి వెళ్లాను. అది వాళ్ళనడిగి చదువుకుందామని చక్కగా అక్కాచెల్లెలూ లాంతర్ మధ్యన పెట్టుకుని క్రింద ఇంగ్లీషు పుస్తకం, పైన నవల ఒకరు, పత్రిక ఒకరూ ఏకదీక్షతో చదివేస్తున్నారు. నవలలూ పత్రికలేనా మీ క్లాసు పుస్తకాలు అనడిగాను.

ఇద్దరూ తెల్లబోయి. నా వంక చూశారు.

ఏమీ చదవరు. ఆఖరికి పేపర్ కూడా చూడరని పిన్ని చెప్పింది.

మరి అన్నీ అబద్దాలేనా అన్నాను నివ్వెరబోతూ!

లేదక్కా మేం పుస్తకాలు చదువుతున్నామని అమ్మకు తెలియదు. ఆఖరికి ఎవరికీ తెలియకు నేడు నీవే చూశావుగాని అమ్మకు చెప్పవకు తెలిసే యింకేమన్నా వున్నాదా? చదవాలని మహాజిజ్ఞాసగా వుంటుంది. ఎప్పుడూ క్లాసు పుస్తకాలే చదివితే చదివినవి కాస్తా మర్చిపోవటం జరుగుతున్నది. అందుకని చదవాలని వున్నప్పుడల్లా స్కూలునుంచి తెచ్చుకుని ఎవరికీ కనపడకుండా చదివేస్తూ వుంటాం. అమ్మతో మాత్రం చెప్పవద్దని బ్రతిమాలారు...సరే నన్నాను. వాళ్లే మీ పెద్దవాళ్లు కాదు. పన్నెండూ-పద్నాలుగేళ్ళవాళ్ళేను. వాళ్లు పెద్దవాళ్లు చూడకుండా చాటుమాటున పత్రికలూ-నవలలూ చదివిపారేస్తుంటారు. తాము చదువుతున్నట్లు పెద్దవారికిసైతం తెలియనీయరు. వాళ్లకి ఏదయినా చేయాలనివుంటే చాటుమాటున చేసి తృప్తిపడుతారు. ఎదుటబడి చేయలేరు. ఒకవేళ చేద్దామన్నా పెద్దలు వూరుకోరు. వాళ్లు ఏపనయితే చేయవద్దని వారిస్తారో ఆపనే చేయాలని వుంటుంది. వాళ్లు చేసే పనులు తప్పయినా, ఒప్పయినా పెద్దవాళ్లు శిక్షిస్తారు. అయినా, ఒకో సమయంలో వాళ్లు చేసిన పనులు గొప్పగా రాణించగలవని చెప్తున్నాను. ★

ఎవరింటిపనులు వారే...

(38-వ పేజీ తరువాయి)

అట్లా చేసికూడా ఆయన చూపించారు గనుకనే మహాత్ముడయ్యారు.

అందరూ మహాత్ములయిపోవాలని కాదు. అట్లా అవటానికి ప్రయత్నించాలి అందరు. ప్రతివారు ఇందిరాగాంధీ, విజయలక్ష్మి పండిట్ లు కాలేరు. అంతటి స్థాయికి మనమూ చేరాలనే ఆత్మబలంతో పని చేయటంలో తప్పులేదు.

వెనకటికో మేజిస్ట్రేటు గారుండేవారు. ఆయనభార్య మొదట ఎంతో దుబారాగా ఖర్చుచేస్తూ...ప్రతి పనికికూడ జవానును పురమాయిస్తూండేది. మొగుడూ పెళ్ళాం యిద్దరే అయినా వంటచెయ్యటానికి వంట మనిషిని, పాచిపనికి మనిషిని పెట్టుకున్నది. సంపాదన బాగాఉంది గనక భర్త ఏమి అడ్డు చెప్పేవాడు కాదు.

ఒకరోజున మేజిస్ట్రేటుగారు సాయంత్రం మామూలుగా ఆఫీసునుంచి యింటికి వచ్చి కాసిని కాఫీ త్రాగి విశ్రాంతి తీసుకుని ఫయిల్సు చూసుకోవటం మొదలుపెటారు. భార్య ఆ పని ఈ పని చూసుకుని ఎనిమిది గంటలు కాగానే భర్తను భోజనానికి లెమ్మని చెబుదామని వచ్చింది. కాని ఆఫీసుపనిలో మునిగిన ఆయనకు భోజనంకూడా పటలేదు; తొమ్మిదయింది...పదయింది.. తనకు ఆకలేస్తోందిగాని ఆయన కదిలేట్లు కనపడలేదు. ఆయనవంకే చూస్తూ కూర్చుండిపోయింది. "మగవాళ్ళు అంత కష్టపడి పనిచేసి సంపాయించుకొస్తే...తను వళ్ళు కదలకుండా అనుభవిస్తోంది. ఆయన కష్టపడటమేమి!... తను యిట్లా సుఖపడటం ఏమి!.. తను వంట ఎందుకు చెయ్యకూడదు? వంటమనిషిని మాన్పిస్తే తను చేసుకోగలను.....మిగతా చిన్న చిన్న పనులుకూడ చేసుకోగలను." అనే పరివర్తన కలిగింది ఆమెలో. మరుసటి రోజే వంటమనిషికి ఉద్వాసన చెప్పింది. ★

"మేము ఆంధ్రులం!"

(3 వ పేజీ తరువాయి)

వాళ్ళను మద్రాసీలని పిలుస్తారు. సిరి అంటకపోయినా జీడి అంటుతుందన్నట్లు మద్రాసు ఆంధ్రులకు రాకపోయినా ఇప్పటికీ మద్రాసీల క్రిందే చెలామణీ అవుతుంటాము ఇక్కడి ఆంధ్రులం. మాకదే ఇష్టం. మేము మద్రాసీలం కాము, ఆంధ్రులం అని చెప్పి వారిని ఒప్పించే ఓపిక మాదగ్గిర లేదు. దానికి కారణం మేము ఆంధ్రులం! అయినా ప్రచారం లేని పేరు ("ఆంధ్రులు") క్రింద చెలామణి అవడంకంటె ఇదివరకే ప్రచారం అయిన మద్రాసీలుగా మనడంలో పోయిందేముంది? అనే ఉదాసీనత మేమాంధ్రులం కాబట్టి.

అయినా ఇటువంటి ఆత్మవిమర్శలంటే మాకు గిటవుసుమండీ! ఎందుకంటే మేము ఆంధ్రులం!!



సినిమా

★ గురుదత్ చిత్రంలో గురుదత్ కథా? ★



ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారి "శారద" లో అత్యుత్తమంగా నటించిన మీనాకుమారి.

అనగనగా ఒక సినిమా డైరెక్టరు. అతడు ఒక యువతిని చూస్తాడు. ఆమెలో నిద్రాణంగాఉన్న నటనా కౌశలాన్ని గుర్తిస్తాడు. చేరదీస్తాడు. అమాంతంగా ఆమెను తారాపథాని కెక్కిస్తాడు ఆమె పైకివస్తుంది గాని, ఆమెను పైకితీసుకువచ్చిన డైరెక్టరు జీవితం అడుక్కిపోతుంది. దీనికి కారణం ఆ యువతిమూలంగా డైరెక్టరుకూ, అతని భార్యకూ మధ్య చెలరేగిన గృహకలహాలు.

ఈ కథావస్తువుతో గురుదత్ నిర్మిస్తున్న "కాగజ్ కే ఫూల్" షూటింగ్ సిమ్లాలో ప్రారంభమైంది. మనదేశంలో ఇప్పటిదాకా ఎవరూ సంపాదించని ఒక "చింతామణి"ని

బొంబాయి సినిమా లేఖ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

గురుదత్ సంపాదించాడు. ఈ చింతామణి పేరు సినిమాస్కోప్ లెన్స్. సినిమాస్కోపులో తీస్తున్న ఈ చిత్రంలో నాయకుడు గురుదత్, నాయిక వహీదా రెహమాన్.

ఈ చిత్రం కథలో "అనగనగా దర్శకుడు" గురుదత్ అవునో కాదో, అది అతని వ్యక్తిగత జీవితకథ అవునో కాదో చిత్రం పూర్తయితేగాని తెలియదు. వహీదా రెహమాన్‌ని బొంబాయి తీసుకువచ్చి, సి ఐ డి, ప్యాసా చిత్రాలతో తారగా చేసి, ఆమెకు నటనలో గురుత్వం వహించినవాడు గురుదత్ అని అందరికీ తెలిసినదే. ప్లేబాక్ సంగీతరాణి గీతారాయ్‌ని ఈయన ప్రేమించి వివాహమాడారనీ, వీరికిద్దరు పిల్లలనీ, వీరి సాంసారిక జీవితం ఇటీవల ఒడుదుడుకులలో పడిందనీ కూడాఅంతా ఎరిగినదే. కనుక ఆయన వ్యక్తిగత వ్యథయే సినిమా కథగా పరిణమించిందా అనిపించవచ్చు.



దర్శకనిర్మాత బిమల్ రాయ్ తీస్తున్న "మధుమతి"లో దిలీప్ కుమార్, వైజయంతీమాల.

★ బొంబాయి సినిమాలేఖ ★

గత సంవత్సరం బాగా ప్రజాభిమానం పొందిన నటుడు దేవానంద్. చలనచిత్రాలలో బహుమతుల కర్హులైన వారిని నిర్ణయించే సీజను ఇది. ఈనిర్ణయాల్లో దేవానంద్‌తో పోటీగా నిలవదగిన మరొక నటుడు దిలీప్ కుమార్ ఒక్కడే. ఓటింగ్‌లో మత ప్రసక్తి రాకుండా ఉండాలని అంతా ఆశించాలి.

నర్గిస్ ఇప్పుడు ఆరడజను చిత్రాల్లో నటిస్తోంది. ఆదర్శ పురుషుణ్ణి వివాహమాడాలని, ఆదర్శభర్త అంటే ఘనాలా విఘంగా ఉండాలని తాను ఇన్నాళ్ళూ కన్న బంగారు కలలు కరిగిపోయాయని ఆమె ఇటీవల అన్నదట. ఇంతకాలమూ ఆమెకు సినిమాల్లో ప్రియులుగా నటించిన హీరో పాత్రల్లో ఆదర్శభర్తల లక్షణాలకంటే గూండా లక్షణాలే ఎక్కువగా ఉన్నాయట. ఇట్లాంటి పాత్రలకు ప్రియురాలుగా నటించటంతో నటి నర్గిస్‌కు వివాహంమీద ఉన్న మోజు కొస్తా బూజై పోయిందట.

* * *

బి. ఆర్. చోప్రాచిత్రం "నయాదౌర్"లో కొన్ని పాటలు, నాట్యాలు తీసెయ్యాలని కేంద్రప్రభుత్వం ఉత్తర్వు చేసినట్లు తెలుస్తోంది. చోప్రా, సోదర నిర్మాతలనుకూడగట్టుకుని, ప్రభుత్వానికి నచ్చచెప్పాలని ప్రయత్నిస్తున్నారు.

* * *

తూర్పుయూరప్ పర్యటనకు వెళ్లిన రాజ్ కపూర్ అక్కడివారితో సంయుక్తనిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకురావాలని ప్రయత్నిస్తున్నారు. ఆ చిత్రానికి ఆయనే నిర్మాతగాను, దర్శకుడుగాను వ్యవహరిస్తారు.

* * *

గతవారం బొంబాయిలో రెండుచిత్రాలు విడుదల అయినాయి. ఒకటి బిమల్ రాయ్ ప్రొ॥ వారి "అపరాధీకౌన్ ?". రెండోది "దేవర్ భాభి."

"అపరాధీకౌన్"లో అభి భట్టాచార్య, మాలాసిన్హా, జాగీర్దార్, లిలియన్ మున్నగువారు నటించారు. సలిల్ చౌదరి ఇచ్చిన సంగీతం ఒకమోస్తరుగా ఉంది. సస్పెన్సు చివరిదాకా బాగా పోషింపబడింది. హాతుడుగాను, హంతకుడుగాను కూడా జాగీర్దార్ చక్కగా నటించాడు. కాని వినోదమూ, రొమాన్సూ, మంచిపాటలు ఏమీలేవు. కొత్త నటి లిలియన్ నటన తృప్తికరంగా లేదు.

"దేవర్ భాభీ" కథ పండిట్ ముఖ్ రాం శర్మ వ్రాశారు. ఆడది, మగవాడు కలిసి అమాయకంగా తిరిగినా అర్థంపర్థం లేకుండా అనుమానించే సంఘాన్ని విమర్శించటం ఈకథ లక్ష్యం. ప్రారంభంలో చిత్రం బాగానే ఉన్నది. కాని క్లయిమాక్సులో చప్పగా తయారైంది. పైగా విషాదాంతం కూడాను. సంగీతం చక్కగా ఉన్నది. బల్రాజ్ సహాని, లీలా మిశ్ర, "పవర్ ఫుల్"గా నటించారు. మాలాసిన్హా నటన స్థూలంగా బాగానే ఉన్నది. ★

సినిమా వార్తలు

"జగన్నాటకం"

పద్మశ్రీ ఫిలిమ్స్‌వారి పౌరాణిక చిత్రం "జగన్నాటకం" షూటింగ్ విజయా స్టూడియోస్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రానికి జనవరి 22న ప్రారంభోత్సవం జరిగిన సందర్భంలో శ్రీ బి. నాగిరెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. ఆరోజు షూటింగ్‌లో అమర్‌నాథ్, కృష్ణకుమారి పాల్గొన్నారు. వీరిద్దరూ కాక ఇంకా కె. వి. ఎస్. శర్మ, బాలకృష్ణ, సూర్యకళ, పి. హేమలత మున్నగువారు ఇందులో నటిస్తున్నారు. వాంప్, విలన్ పాత్రలకు ఇద్దరు అగ్రశ్రేణి నటీనటుల్ని బుక్ చేయాలని ఆలోచిస్తున్నారు.

ఈ చిత్రం దర్శకుడు శ్రీ శోభనాద్రి రావు. ఛాయాగ్రాహకుడు లక్ష్మణ్ గోరే. సంగీతదర్శకుడు అశ్వత్థామ. "వద్దంటే పెళ్ళి" చిత్రంతో పేరుపొందిన రామ్‌చంద్ ఈ చిత్రానికి సంభాషణలు వ్రాస్తున్నారు. మూడు పెద్దసెట్లతో మొత్తం చిత్రమంతా త్వరత్వరగా పూర్తిచేయాలనీ, మే నెలాఖర్లో విడుదల చేయాలనీ "జగన్నాటకం" సూత్రధారులు కె. ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి ఆలోచిస్తున్నారు.

* * *

"సమ్రాట్ విక్రమార్క"

చాలకాలంగా మూతపడివున్న ప్రభాత్ స్టుడియోస్‌ను పునరుద్ధరించటంతో లోగడనే తయారైన "సమ్రాట్ విక్రమార్క" తెలుగు చిత్రాన్ని ఫిలిం ఆర్ట్సువారు ఆంధ్రలో ఈ నెల 6వ తేదీన విడుదల చేయనున్నారని తెలుస్తోంది. ఈ చిత్రంలో కమలా కొట్నీస్, శివరావు, డా॥ గోవిందరాజుల సుబ్బారావు, సూర్యకాంతం, రంగరాజు మున్నగువారు నటించారు. పాటలు, మాటలు తాపీ ధర్మారావు నాయుడు వ్రాశారు. దర్శకుడు పి. ఎస్. కొట్నీస్.



ఫిల్మిస్తాన్ చిత్రం "తుమ్‌సా నహీ దేఖా"లో షమ్మీ కపూర్, అమీత.



పొన్నలూరివారి "శోభ"లో నాయిక పాత్రధారిణి అంజలీదేవి, ఆమెను కొరడాతో బెదిరిస్తున్న దరోడాగా ముక్కామల.



తొమ్మిదవ భారత రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'వాయిస్ ఆఫ్ అమెరికా'నుంచి జనవరి 28 వ తేదీ మంగళవారం రాత్రి ప్రసారమైన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న పద్మావతి, జానకి, మాధవపెద్ది సత్యం. సంగీతం : దేవదాస్. నిర్వహణ : మోహన్.

కొత్తసినిమాలో పాతకారు

"చల్తీ కా నామ్ గాడీ" అనే చిత్రంలో అశోక్‌కుమార్, కిశోర్ కుమార్, అనూప్ కుమార్, మధుబాల, వీణ, కె. ఎన్. సింగ్, సజ్జన్, సహీరా మొదలైన వారితోపాటు నటించటానికి నిర్మాత అనూప్ శర్మ ఒక పాత ఫోర్డు బస్సును సంపాదించాడు. ఇంతకంటె పాతడొక్కు ఇంకెక్కడా ఉండదట. దీన్ని బొంబాయి సెంట్రల్ టర్మినస్ స్టేషను నుంచి రామన్ స్టుడియోస్‌కు (దాదర్) కిశోర్ కుమార్ తాలూకు డ్రయివరు తోలుకొని వస్తుండగా అది చాలా హారాంచేసిందట. మొదట ఉబ్బసం పట్టుకున్నట్టు దగ్గింది. తరువాత సౌత్ పోల్‌లో హిల్లరీ మాదిరి గజగజ వణికిపోయింది. పరిగెట్టికెళ్లి ఆగిపోయి మండిపోబోయింది. డ్రయివరుకి వళ్ళుమండి ఇంజనులోంచి పెట్రోలు టాంకుతీసేసి బాగుచేశాడు. ఇప్పుడు అది ప్రముఖ నటీనటులతో కలిసి చిత్రంలో పాల్గొంటోంది. సత్యేన్‌బోస్ దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో కిశోర్ కుమార్ మధుబాలని ప్రేమించి, సంతోషం పట్టలేక నాట్యంచేస్తూ, పాటపాడే దృశ్యం ఈమధ్యనే 'షూట్' చేశారు. వెర్రిమొర్రి వేషాలు వెయ్యనని నూత్న సంవత్సరారంభంలో ఒటేసుకున్న కిశోర్ ఆ పాటని యథాప్రకారమే పాడాడట. సంగీత దర్శకుడు ఎస్. డి. బర్మన్.

* * *

గంగాగౌరి సంవాదం

కృష్ణకుమారి, జానకి, నారాయణరావు, ఋష్యేంద్రమణి, నాగయ్య మున్నగువారు నటించే విజయగోపాల్ ప్రొడక్షన్స్‌వారి "గంగాగౌరీ సంవాదం" మహాశివరాత్రికి (16 వ తేది) విడుదలవుతుందని తెలుస్తోంది.

శ్రీ ఎమ్. హెచ్. ఎమ్. మూనాస్ అనేక భాషల్లో నిర్మించిన "దేవసుందరి" తెలుగు వర్షన్ త్వరలో ఆంధ్రలో విడుదల కానున్నదని తెలుస్తోంది. మలయాళం వర్షన్ ఇటీవలే విడుదల అయింది.

"శారద"

ప్రసాద్ ప్రొడక్షన్స్ పేరిట దర్శకనిర్మాత శ్రీ ఎల్. వి. ప్రసాద్ బొంబాయిలో నిర్మించిన "శారద" హిందీచిత్రం ఇటీవల మదరాసు, ప్లాజాలో విడుదలైంది. తెలుగులో "ఇలవేల్పు" గా శతదినోత్సవాలు చేసుకున్న ఈ చిత్రం హిందీలో కూడా బాగా జనాన్ని ఆకర్షిస్తోంది. అగ్రశ్రేణి తారలు మీనాకుమారి, రాజ్ కపూర్, ప్రముఖ హాస్యనటులు ఆగా, ఓంప్రకాష్, గోప్, ఇంకా శ్యామ, అనితాగుహ మున్నగు వారీ చిత్రంలో నటించారు. సంభాషణలు విశ్వామిత్రఆదిల్, పాటలు రాజేంద్రకిషన్ వ్రాశారు. సంగీతం సి. రామచంద్ర. పేబాక్ పాటలు లతా, ఆశా, ముఖేష్, మన్నాడే తదితరులు పాడారు. కరుణ హాస్యరస భరితమైన ఈ చిత్రం అందరినీ ఆనందింపజేయగల చిత్రం.

* * *

సినీకళాకారులకు పద్మశ్రీ బిరుదులు

ఈ ఏడాది రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో రాష్ట్రపతి నలుగురు సినిమా కళాకారులకు "పద్మశ్రీ" బిరుద ప్రదానం చేశారు. వీరిలో ఇద్దరు దర్శకులు, ఇద్దరు తారలు. న్యూథియేటర్స్ సంస్థలో అనేక సంవత్సరాలు పనిచేసి ఇప్పటికీ బెంగాల్‌లో అగ్రశ్రేణి దర్శకుడుగా పరిగణింపబడుతున్న దేవకీబోస్ ఒకరు. చలనచిత్రకళలో దర్శకత్వంలో ఎవ్వరూ సాహసించని కొత్త దారులు త్రొక్కి, గొప్ప వైయక్తిక ప్రతిభను కనబరచిన సత్యజిత్ రాయ్ మరొకరు.

తారల్లో ఒకామె దేవికారాణి, మరొకామె నర్గీస్. బొంబేటాకీస్ నిర్మించిన అనేక చిత్రాల్లో నటించి సుమారు ఇరవై, పదిహేనేళ్ల క్రిందటి భారతీయ యువక జనాభాని ఉర్రూతలూగించిన తార దేవికారాణి. ఈమె నిన్నటి నర్గీస్. పదిపన్నెండేళ్ళ క్రిందట సినిమాల్లో ప్రవేశించి ఈనాటికీ అగ్రతారగా వెలుగుతున్న నటి నర్గీస్. ఈమె నేటి దేవికారాణి.

క్రమంగా భారతీయ చలనచిత్రాలకు స్థాయీ, గౌరవమూ పెరుగుతున్నాయనటానికి, చలనచిత్రాలు దేశానికి, సంస్కృతికి చేస్తున్న సేవను ప్రభుత్వంకూడా గుర్తిస్తోందనటానికి, ఇప్పుడీ "పద్మశ్రీ" బిరుదులివ్వటం మరో ఉదాహరణ.

* * *

ఎస్. డి. బర్మన్‌కు బహుమానం

నృత్య సంగీతాది కళలను ప్రోత్సహించటానికి ఏర్పడిన సంగీత నాటక అకాడమీ 1957-58 సం॥ లో ఉత్తమ చలనచిత్ర సంగీత దర్శకుడుగా ఎస్. డి. బర్మన్‌ను, ఉత్తమ చలనచిత్ర నటిగా దుర్గాబాయ్ ఖోటేను నిర్ణయించింది.

బహుమతి ప్రదానం మార్చి ఆఖరి వారంలో జరుగుతుంది. రాష్ట్రపతి చేత బహుమతులిప్పిస్తారు. రాష్ట్రపతి సంతకంతో ఒక పత్రము, స్వర్ణకంకణం, జరీ అంచులుగల శాలువ బహూకరిస్తారు.

* * *

బాక్సాఫీసు చిత్రాలు

గతసంవత్సరమే విడుదలయిన సెసిల్ బి.

సినిమావార్తలు

డి మిల్ చిత్రం "టెన్ కమాండ్ మెంట్స్" అప్పుడే బాక్సాఫీసు రికార్డులన్నిటినీ ముక్కముక్కలుగా బద్దలు చేసేస్తూ, ఇప్పటికి అమెరికా, కెనడాల్లో 66 లక్షల పౌన్లు ఆర్జించిందట. మైకేల్ టాడ్ నిర్మించిన "ఎరౌండ్ ది వరల్డ్ ఇన్ ఎయిటీ డేస్" (జూల్స్ వెర్న్) చిత్రం 57 లక్షల 80 వేల పౌన్లు ఆర్జించిందట. ఇప్పటికి ప్రపంచంలో కల్లా ఎక్కువ సంపాదించిన చిత్రాలు "గాన్ విత్ ది విండ్" (1 కోటి 20 లక్షల పౌన్లు), "రోబ్" (62 లక్షల 50 వేల పౌన్లు)

* * *

నిరుడు 292 చిత్రాలు

1957 సంవత్సరంలో మొత్తం 292 చిత్రాలు భారతదేశంలో తయారైనాయి 1956 లో తయారైనవి 296. అంటే నిరుడు 4 చిత్రాలు తక్కువ తయారైనాయన్న మాట. నిరుడు హిందీలో 115, బెంగాలీలో 54, తమిళంలో 45, తెలుగులో 36, కన్నడంలో 14, మరాఠీలో 14, మలయాళీలో 7, అస్సామీస్‌లో 3, పంజాబీలో 2, ఒరియాలో 1, పర్షియన్‌లో 1 తయారైనాయి.

* * *

వినోదం పన్ను మినహాయింపు

గత సంవత్సరం వెనిస్ చలనచిత్రోత్సవంలో మొదటి బహుమతి పొందిన బెంగాలీ చిత్రం "అపరాజిత"ను వినోదం పన్ను బాధ నుండి మినహాయిస్తూ బొంబాయి ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

లండన్‌లో "పథేర్ పాంచాలీ" బాగా ఆర్థిక విజయం సంపాదించటం చూసి "అపరాజిత"నుకూడా ఇంగ్లీషు సబ్ టైటిల్స్‌తో లండన్‌లో విడుదల చేయబోతున్నారు. మొదటి చిత్రంకంటె రెండో చిత్రంలో దర్శకుడుగా సత్యజిత్ రాయ్ పనివాడితనం బాగా కనిపిస్తుంది గనక దానికంటే ఇదే ఎక్కువగా విజయం పొందవచ్చునని డిస్ట్రిబ్యూటర్లు ఆశిస్తున్నారట.

ఈ రెండు చిత్రాలతోను అత్యుత్తమ దర్శకుడుగా పేరుపొందిన సత్యజిత్ మరొక బెంగాలీ చిత్రం ఇటీవల డైరెక్టుచేశాడు. "పరేష్‌పతార్" అనే ఈ చిత్రం కలకత్తాలో విడుదలయింది. అనేక సంవత్సరాలుగా బెంగాలీచిత్రాల్లోను, నాటకాల్లోనూ అప్రధాన పాత్రలు ధరిస్తూ ఉన్న తులసీ చక్రవర్తి అనే వృద్ధనటుణ్ణి కథానాయక వేషానికి తీసుకొని, అభూత కల్పనతో (ఫాంటసీ) కూడిన వ్యంగ్య కథ తీసుకుని సత్యజిత్ రాయ్ ఈసారికూడా అద్భుతమైన చిత్రం తీశాడని విమర్శకులు అభిప్రాయ పడుతున్నారు.

* * *

దాస్తొయెవ్‌స్కీ నవల

దాస్తొయెవ్‌స్కీ నవల "క్రైమ్ ఎండ్ పనిష్‌మెంట్" (నేరమూ, శిక్షా) కథ తీసుకుని దర్శకనిర్మాత రమేష్ సైగల్ హిందీ చిత్రంగా నిర్మించేస్తున్నారు. రాస్కాల్నికావ్ పాత్ర రాజ్‌కపూర్, సోనియా పాత్ర మాలాసిన్హా ధరిస్తున్నారు. ఎంత దాస్తొయెవ్‌స్కీ కథ అయినా పాటలు ఉండక తప్పదు గనుక సంగీత దర్శకుడు ఖయ్యాం.

ఇరవయ్యో శతాబ్దపు సరికొత్త నగరం!

గడచిన సంవత్సరంలో సినిమా వర్తకంలో అమిత లాభాలు గడించిన ట్వెంటీయత్ సెంచరీ-ఫాక్స్ సంస్థ లాస్ ఏంజిలిస్ వద్ద ఒక సరికొత్త నగరం నిర్మించబోతోంది. ఈ సంస్థకు లాస్ ఏంజిలిస్ నగరంలో పడమటగా 284 ఎకరాల స్థలం ఉందట. ఈ ఖాళీ స్థలంలో 30 కోట్ల డాలర్లు ఖర్చుపెట్టి ఇరవై పైగా స్కై స్క్రేపర్లు (ఆకాశ భవనాలు) కడతారట. ఈ భవనాలను అద్దెకిస్తే ఏడాదికి $3\frac{1}{2}$ కోట్ల డాలర్లకు పైగా నికరాదాయం వస్తుందట.

ఒక ఏడాదిలో పని ప్రారంభించి ఖాళీ స్థలంలో తూర్పుపక్కన మొత్తం ఇరవవయ్యేసి అంతస్తులు గల 18 నివాస భవనాలు, ఆరేసి అంతస్తులు గల 20 నివాస భవనాలు, 21 ఉద్యాన భవనాలు నిర్మిస్తారట. మొత్తం 40 క్రీడా సరస్సులు, 12 టెన్నిస్ కోర్టులు ఉంటాయట. ఇవికాక ఖాళీ స్థలానికి ఉత్తరపువైపున 7 ఆఫీసు భవనాలు (ఒకటి 30 అంతస్తులది, మూడు 22 అంతస్తులవి) కడతారు. వీటికి దగ్గర్లో 18 అంతస్తులు, 1000 గదులు గల ఒక హోటలు కడతారు. ఆరంతస్తులు గల చలనచిత్ర కళా కేంద్రం, 4000 సీట్లు గల ఒక ప్రదర్శనశాల, ఇంకా దుకాణాలు వగైరా కూడా ఉంటాయి.

ఇదంతా కలయో, వైష్ణవమాయో, సినీ మాయో అనిపించేటంత అద్భుతంగా ఉన్నా, హాలీవుడ్ నిగూర్చి తెలిసినవారెవరూ ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇంత ఖాళీస్థలమూ భవనాలు కట్టటానికే వాడుకుంటే ఫాక్స్ చిత్రాల ఔట్‌డోర్ షూటింగ్‌కు జాగా ఎక్కడ అనిపించవచ్చు. లాస్ ఏంజిలిస్‌కు పాతిక మైళ్ళ దూరంలో ఈ కంపెనీకి 2300 ఎకరాల రాంచ్ వేరే ఉంది! ★



గుంతకల్లు పౌరసన్మానసభలో శ్రీ ఎ. నాగేశ్వరరావుకు నటరాజ ప్రతిమ బహూకరిస్తున్న శ్రీకల్లూరు సుబ్బారావు; వెనుక నున్నవారు డా॥ హనుమంతరావు (చైర్మన్), శ్రీ బి. వి. రాజు.

★ పాకజితులు ★

(8-వ పేజీ తరువాయి)

చాడు జూనియర్.

"కొబ్బరి పీచా? ఉన్నట్టు లేదే?"—శేషగిరి.

"అయితే శుభ్రంగా ఓ కొబ్బరికాయ కొంటే సరి..." అని సీనియర్ సలహా ఇచ్చాడు.

"ఒరేయ్ జూనియర్! వెంటనే పావలా పట్టుకెళ్ళి పీచు దట్టంగావున్న కొబ్బరికాయ ఒకదాన్ని—లోపల ఎలావున్నా సరే—పట్టుకొచ్చేయి."

కుంపటి వెలిగింది. కాఫీ తయారయింది. మొదటిగుక్క తాగారు.

"ఏదో లోపించినట్లుందే...పాలుతక్కువయినట్టున్నాయి."

"కాదు కాదు...డికాక్షనే ఇంకొంత తగలాలి!"

"చచ్చు వెధవల్లా—పంచదార తక్కువయినా తెలియదేమిట్రా మీకూ?"

* * *

ముక్కలు తరగడం, కుంపటి విసరడం-వగైరా శేషగిరీ, వండడం-ఇత్యాదులు జూనియర్, పాళ్ళు కలపడం వంట ముఖ్యఅంశాలు-సీనియర్-ఇలా అని నిర్ణయించుకున్నారు.

ఓ కాగితమూ పెన్సిలూ పుచ్చుకుని అర ఘంట ఆలోచించి బీరకాయ పప్పు, బెండకాయకూర, ఉల్లిపాయిలపులుసు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. నిర్ణయం ప్రకారం శేషగిరి ముక్కలు తరిగాడు. బెండకాయ ముక్కలు తరిగి, ఓ వెడల్పాటి గిన్నెలో అర్థశేరు నీళ్ళుపోసి అందులో ఆ ముక్కల్ని పడేశాడు.

బీరకాయలు తీసుకున్నాడు. ఒక్కో ముక్కా ఓ ఘన అంగుళం వుండేట్టు తరుగుతున్నాడు.

"అదేవిటీ ఆ ముక్కలు అంత పెద్దగా తరుగుతున్నావేం?" అని అడిగాడు జూనియర్.

"నోరుమూసుకోవోయ్. ఈ ముక్కలు ఉడికేసరికి ఇంతింతఅవుతాయి." అన్నాడు శేషగిరి.

"మహాశయా! ఇవి మేలురకం 'సాన్ఫొరైజ్‌డ్' బీరకాయలు! కాబట్టి కాస్త చిన్నవిగా తరగమని ప్రజలకోరిక..."

"వీల్లేదు. ముక్కలు తరగడం నాఇష్టం... అంతే"

"ఒరేయ్! ఎందుకర్రా అలా కొట్టుకుంటున్నారూ?"—ఇది సీనియర్.

—బీరకాయలూ, కళ్ళనీళ్లు తిరగగా ఉల్లిపాయలూ, ముక్కలయాయి.

"ఇహనేం ముక్కలు చేశారుగా—మీరు పొండి. మిగతావి నేను చూసుకుంటా." అన్నాడు సీనియర్ ధీమాగా.

"అబ్బే—ఇక్కడే కూచుని పేపరు చూచుకుంటూవుంటాం. అవసరమయితే సాయంచేస్తాం." అన్నాడు జూనియర్.

—మరో అరఘంట తర్వాత...

"అన్నం అయిపోయింది" అని ప్రకటించాడు సీనియర్.

"భలే భలే!" అన్నారు జూనియర్, శేషగిరి పేపరుచూస్తూ.

పోపుపెట్టి అందులో బెండకాయ ముక్కలు వేశాడు సీనియర్. కలియబెడుతూంటే ముక్కలు గొలుసుల్లాగా వస్తున్నాయి.

"వెధవ ముక్కలు—ఇలా జిగటగా తగ

పాకజితులు

లడ్డారేం!" అని విసుక్కున్నాడు సీనియర్.

"అదో రకం బెండకాయ కామోసు. దానికి మనమేం చేస్తాం!"

"అంతే అయివుంటుంది. అంతా పరమాత్ముడి ఇచ్ఛ!" అన్నాడు జూనియర్—

"నేను కాస్త హాల్లోకెళ్ళి గడ్డం గీసుకుంటుంటానూ. అవసరమొస్తే పిలవండేం..." అని జూనియర్ లేచి వెళ్ళాడు.

ఇంకాస్సేపయింది. శేషగిరి పేపరు చూస్తున్నాడు. జూనియర్ గడ్డం గీసుకుంటున్నాడు. ఓ కుంపటిమీద బెండకాయ వేపుడు, మరో దానిమీద బీరకాయ పప్పు అమోఘంగా తయారయిపోతున్నాయి.

ఇంతట్లో సీనియర్ యేదో పనిమీద "అబ్బాయిలూ! కాస్త కుంపటి కనిపెట్టి వుండండి. ఐదునిమిషాల్లో వస్తా" అన్నాడు.

పేపరు చూస్తూ బుర్ర వూపాడు శేషగిరి.

నాలుగు నిముషా లయింది.

అక్కడెక్కడినుంచో సీనియర్ అరిచాడు. "ఒరేయ్, ఒరేయ్—ఆ పప్పులో ఇంత ఉప్పు పడేయండ్రా"—ఒక్కక్షణం షేవింగ్ మాని వంటింట్లో కెళ్ళి ఓ పిడికెడు వుప్పు తీసి పప్పులో పడేసి వెనక్కొచ్చాడు జూనియర్.

పేపరు చదవడంలో తదేకదీక్షతో నిమగ్నుడైవున్న శేషగిరి ఇది గమనించలేదు.

కాళ్ళు చేతులు కడుక్కుని సీనియర్ లోపలికి వచ్చాడు. జూనియర్ స్నానాల గదిలోకి వెళ్ళాడు.

పప్పులో ఉప్పు వేశార్రా?" అని అడిగాడు సీనియర్.

"ఏం వుప్పు?" అన్నాడు శేషగిరి.

"నేను అక్కడి నుంచి అరిచానుగా—వేయమనీ..."

"వినపడందే"—అన్నాడు శేషగిరి పేపరు మడుస్తూ.

'ఇంత' పప్పుకీ 'ఎంత' వుప్పు కావాలో అని ఖచ్చితంగా నిర్ణయించుకొని సీనియర్ కుకుడు పప్పులో యథాశక్తిని మరో పిడికెడు ఉప్పు పడేశాడు. యింతలో వేపుడు మాడువాసన వేయడం మొదలెట్టింది. ఒక్క దూకులో కుంపటి దగ్గరికివెళ్లి, క్షణంలో వేపుడు గిన్నెను తీసి క్రిందవుంచాడు శేషగిరి. వెంటనే "అమ్మయ్యో" అని పెద్దకేక పెట్టాడు....

"ఏవిటి ఏవిటి?" అన్నాడు ప్రక్కనే వున్న సీనియర్.

కళ్ళవెంబడి నీరు జలజల కారుతుండగా, తన అరచేతుల్ని చూపెట్టాడు. శేషగిరి. పదివేళ్ళూ ఎర్రగా కందిపోయివున్నాయి.

"హారినీ! అంత వేడిదానిని పాతగుడ్డ ముక్కతో పట్టుకు తీయాలిగానీ..."

"అది ముట్టుకునేదాక అంత వేడివుందని ఎవడికెరుకా?" అన్నాడు శేషగిరి... వేళ్లకు ఏదో తైలం రాచుకుంటూ.

"శేషగిరీ! ఆ ఖాళీగావున్న కుంపటిమీద పులుసుకు ఓ గిన్నె పడేయివోయ్."అంటూ సీనియరు చింతపండును నీళ్లల్లో కలిపేందుకు ఉపక్రమించాడు. శేషగిరి అలాగే చేసివచ్చి కూర్చుని పేపరువిప్పాడు. చింతపండు నీళ్లని కుంపటిమీది గిన్నెలో పోస్తున్నాడు సీనియర్.

పసిఫిక్ మహాసముద్రంలో ఉదజని బాంబు పేలినట్టు—కుంపటినుండి భగ్గున మంటూ మనిషి ఎత్తున తెల్లటి లావా లేచింది. శేషగిరి దృష్టి నీ దృశ్యం ఆకర్షించింది.

"శేషగిరీ! మీ ఇంట్లో చింతపండు కూడా ప్రత్యేకత వున్నట్టుందే!"

"నీ బుర్రకు స్క్రూలుకూడా సరిగా బిగించనట్టుందే!"

"ఏం?" అని తెల్లబోయాడు సీనియర్ కుకుడు.

"నీవు పైనుంచి పోస్తున్న చింతపండు నీళ్ళు తెల్లటిబూడిదతో కలిసి కుంపటిక్రింద నుంచి మహాప్రవాహంలా వస్తూన్నాయి."

స్నానం ముగించి వంటింట్లో అడుగు పెడుతూ ఇలా సెలవిచ్చాడు జూనియర్—" ఎంతటి అసలు సిసలయిన మూర్ఖులురా మీరు...పావలా కొబ్బరిపిచుపెట్టి వెలిగించిన కుంపటిని నిముషంలో ఆర్పేశారు గదరా..."

"మరి ఈ చచ్చువెధవ కుంపటిమీద ఖాళీ సీసపుగిన్నె పెడతాడని ఎవడనుకున్నాడూ?" అన్నాడు సీనియర్ శేషగిరి వైపు కోపంగా చూస్తూ.

"అదేమో, రోజూ మా ఆవిడ దీంట్లోనే పులుసు పెట్టేది ఎన్నడూ ఇలాక్కాలేదు." అన్నాడు శేషగిరి ఆ గిన్నె తన్ను అనవసరంగా మోసపుచ్చిందన్న బాధతో.

"అయితే ఇవాళ్టికి పులుసు మానేద్దాం."

"కూర, పప్పు, పెరుగూ వున్నాయిగా.. చాలు."

"నాకేమీ అభ్యంతరం లేదు." అన్నాడు శేషగిరి—

—కుంపట్లు ఆర్పి, ఇల్లు తుడిచి, కంచాలూ, మంచినీళ్ళూ పెట్టుకుని భోజనానికి కూర్చున్నారు.

"మహా ఆకలయిపోతూందిరా!"

"దానికేం, దిట్టంగా పప్పూ, పెరుగూ దంచేసేయ్?

"బెండకాయ వేపుడంటే నాకు రెండో ప్రాణం."

జూనియర్ అన్నం వడ్డించడానికి ప్రయత్నిస్తూన్నాడు. అన్నం గరిటె అన్నం గిన్నెలోనుంచీ రానంటూంది. శక్తికొలదీలాగాడు. వృథా అయింది.

"నువ్వవతల ఉండవోయ్"—అని లేచి ఎడమ మోకాలిని నేలమీద ఆనించి, కుడి పాదాన్ని నొక్కిపట్టి ఎడంచేత్తో ఆ అన్నం గిన్నెను పట్టకుని కుడిచేత్తో అన్నం గరిటను బయటకు లాగిన శేషగిరి, చేతిలో అన్నం గరిటతో రొమ్ముమీద వేడి వేడి అన్నపు ముద్దలతో, శరవేగాన దూసుకు వెళ్ళి మూడుగజాల అవతలవున్న మంచి నీళ్ళ బిందెమీద పడ్డాడు.

నీళ్ళు కాలవలైపారాయి. చినిగిపోయిన పేంట్లూ అవీ తెచ్చి నీటిని అద్ది మళ్ళీ కూర్చున్నారు.

ఈసారి శేషగిరి మరీ ఉగ్రంగా—"ఒరేయ్ సీనియర్! నీవు గిన్నెను ఈ ప్రక్కన పట్టకో. జూనియర్! నువ్వాప్రక్క-!" అని తాను రెండుచేతులతోనూ గరిటను పట్టుకుని, ఎట్టకేలకు, అన్నాన్ని బయటకు తోడాడు...

—కూర, పప్పు, వడ్డించుకున్నారు. భోజనం మొదలెట్టారు.

"అన్నం మరీ ఇంత జావలా వుందేం?"

"నూకలు నూకలుగా వున్నట్టుంది..."

"జావా, నూకలూ అయితే ఎంతో మేలు...నాకు వుత్తరాళ్ళె వస్తున్నాయి."

—"వేపుడు ఏదో వాసన వేస్తుందేం?"

"ఇది బెండకాయ కాదేమిటి?"

"ఈ నల్లనల్ల ముక్కలేమిటో?"

—"బీరకాయ ముక్కలు చేదుగా వున్నాయేం?"

"పప్పులో వుప్పెక్కువయి నట్టుందే..."

"పప్పు మరీ ఇంత నీళ్ళయిందేం?"

—"అయితే శేషగిరీ కనీసం పెరుగయినా వేసుకు తిందాం."

"హు... నే నెటూ హోటల్ భోజనమే కదా అని పెరుగమ్మాయిని ఇవాళ్టినుంచీ రావద్దని చెప్పా నిన్న..."

* * *

బొగ్గు మరకలున్న పంచతో శేషగిరీ, గుండీలు పెట్టకోని చొక్కాతో సీనియరూ, తిరగేసి తొడుక్కున్న బనియనుతో జూనియరూ—పరుగెడుతున్నారు 'పర్వత విలాస్' వైపు.


"ఎంతయినా- ఈ వండుకోవడం బాధే..."

"అయినా...హోటళ్ళు మరీ మన మనుకున్నంత అన్యాయం కాదు—"

"ఇంటితిండి తిని తిని, హోటల్లో ఎప్పుడెప్పుడు భోంచేద్దామా అని వుందసలు..."

—ఆకలితో మాడిపోతూన్న ఆ ముగురిలో ఏ ఒక్కడికీ కూడా, అప్పుడు ఒంటిగంట కావస్తూన్నదనీ, ఆరోజు ఆఫీసులున్నాయనీ గుర్తుకు రాలేదు..." ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



“చండప్రక్రియ”: నారసధారి

ఫొటో : ఆర్. సుబ్రహ్మణ్యం, గుంతకల్లు]

Regd. No. M. 4479 Andhra Patrika Illustrated Weekly